వేసవి సెలవుల అనంతరం గురువారం బడిగంటలు మోగాయి. నిన్నటివరకు ఆటపాటలతో సరదాగా గడిపిన విద్యార్థులు భుజాలకు స్కూలు బ్యాగులు తగిలించుకొని పాఠశాలల బాట పట్టారు. మొదటిరోజు విద్యార్థుల హాజరు తక్కువగానే ఉంది. ప్రైవేటు పాఠశాలలు కూడా గురువారం నుంచే ప్రారంభమయ్యాయి. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రైవేటు పాఠశాలల వారు మొదటిరోజు ఒంటిపూట మాత్రమే తరగతులు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు మాత్రం రెండు పూటలా తరగతులు జరిగాయి. కోట్లాది రూపాయల వ్యయంతో నాడు-నేడు పేరుతో పనులు చేపట్టినా కొన్ని పాఠశాలల్లో విద్యార్థులకు సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు.



- మొదటిరోజే స్టూడెంట్ కిట్లు పంపిణీ
- విద్యార్థుల హాజరు తక్కువే
- నాడు-నేడు పనులు అరకొరే..
- అసంపూర్తిగానే చాలావరకు భవనాలు
- వసతులు అంతంతమాత్రమే



ఒంగోలు సత్యనారాయణపురంలో ఎంపీపీ పాఠశాలలో అసంపూర్తిగా పనులు వదిలేయగా నేలపై కూర్చున్న విద్యార్థులు

విద్యార్థుల బడిబాట

ఒంగోలు(విద్య), జూన్ 13: పాఠశాలల గురువారం పునఃప్రారంభమయ్యాయి. విద్యార్థులు తొలిరోజు పలుచగా హాజరయ్యారు. నాడు-నేడు పథకంతో పాఠశాలలు అద్భుతంగా తీర్చిదిద్దామని గత వైసీపీ ప్రభుత్వం ఆర్భాటం చేసిన విషయం తెలిసిందే. అయితే అదంతా ఉత్తుత్తిదే అని స్పష్టమైంది. చాలాచోట్ల పనులు పూర్తికాలేదు. అసంపూర్తి భవనాలు, అరకొర పనులతో తొలిరోజే విద్యార్థులకు సమస్యలు స్వాగతం పలికాయి. కాగా మొదటి రోజే విద్యార్థులకు అందుబాటులో ఉన్నంత వరకు స్టూడెంట్ కిట్లను పంపిణీ చేశారు. 1 నుంచి 10 తరగతి వరకు 1,93,440 మంది విద్యార్థులకుగాను 1,37,630 మందికి బ్యాగులు వచ్చాయి. నోట్ పుస్తకాలు 10,80,628 అవసరం కాగా మొత్తం అందుబాటులో ఉన్నాయి. స్టూడెంట్ కిట్‌లోని యూనిఫాంలు, షూలు, డిక్షనరీలు రాలేదు. 1 నుంచి 10 తరగతులకు 16,30,676 పాఠ్యపుస్తకాలు అవసరం కాగా ఇప్పటివరకు 71శాతం అందుబాటులో ఉన్నాయి. అందుబాటులో ఉన్నంతవరకు పంపిణీ చేశారు.



అరకొర వసతులు

కొన్ని పాఠశాలల్లో అరకొర వసతులు విద్యార్థులను వేధిస్తున్నాయి. నాడు-నేడులో కొన్ని పాఠశాలలు సర్వాంగసుందరంగా కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా అభివృద్ధి చేస్తున్నట్లు ప్రకటించిన గత ప్రభుత్వం కొన్ని పాఠశాలలను గాలికి వదిలేసింది. కొన్ని పాఠశాలల్లో భవనాల పైకప్పు పెచ్చులు ఊడిపడుతుండటంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ పాఠశాలల్లో తరగతి గదుల్లో కూర్చుంటున్నారు. ఒంగోలు రామనగర్ హైస్కూలు ఆవరణలోని ప్రాథమిక పాఠశాలలో శ్లాబు పెచ్చులు పడుతున్నాయి. దీంతో విద్యార్థులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఒంగోలు సత్యనారాయణపురంలోని పాఠశాలలో పరిస్థితి ఇదేవిధంగా ఉంది. ఇలా అనేక పాఠశాలల్లో పరిస్థితి ఇదేవిధంగా ఉండగా 1 నుంచి 5 తరగతులు విద్యార్థులు ఒకే షెడ్‌లో కూర్చోవాల్సి రావడంతో తొలిరోజే ఇబ్బందులు పడ్డారు.

సెయింట్ థెరిస్సా హైస్కూలు మూత

స్థానిక మార్కెట్ సెంటర్‌లోని సెయింట్ థెరిస్సా హైస్కూలును మూసివేయడంతో విద్యార్థులు వెనుతిరిగి వెళ్లారు. ఈ పాఠశాలను యాజమాన్యం ప్రభుత్వంలో విలీనం చేసింది. ఇక్కడి టీచర్లను ప్రభుత్వానికి అప్పగించిన యాజమాన్యం ప్రభుత్వ గ్రాంట్‌ను వదులుకుంది. గతేడాదే ఇది జరగగా విద్యార్థుల తరఫున కొందరు హైకోర్టును ఆశ్రయించారు. అయితే కోర్టు యాజమాన్యానికి, ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పును వెలువరించింది. దీంతో ఈ ఏడాది ఏప్రిల్ వరకు జరిగిన పాఠశాల ప్రస్తుతం మూతబడింది. విద్యార్థులు ఈ పాఠశాలల నుంచి టీసీలు తీసుకుని ఇతర పాఠశాలల్లో చేరాల్సి ఉంది.

సొసైటీల పాలకవర్గాలు రద్దు

అధికార పీఐసీల కోసం ప్రతిపాదనలు

ఒంగోలు(విద్య), జూన్ 13: జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (సొసైటీ) పాలక వర్గాలు రద్దయ్యాయి. ఈ సొసైటీలన్నింటికీ అధికారి పర్సన్ ఇన్‌చార్జి (పీఐసీ) కమిటీలను నియమించనున్నారు. ఈ మేరకు జిల్లా సహకారాధికారి నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందాయి. రాష్ట్రంలో జరిగిన సాధారణ ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయి తెలుగుదేశం పార్టీ విజయం సాధించిన నేపథ్యంలో అన్ని ప్రభుత్వ శాఖలకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీచేశారు. నామినేటెడ్ పోస్టుల్లో గత ప్రభుత్వం నియమించిన వారి నుంచి రాజీనామా లేఖలను తీసుకొని వెంటనే ఆమోదించాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు. ఈ నేపథ్యంలో పీడీసీసీ బ్యాంకు చైర్మన్ సోమవారం తన పదవికి రాజీనామా చేయగా ఆయన స్థానంలో కలెక్టర్‌ను అధికార పర్సన్‌గా ప్రభుత్వం నియమించింది. డీసీఎంఎస్‌కు ఇప్పటికే అధికార పీఐసీగా జేసీ గోపాలకృష్ణ వ్యవహరిస్తున్నారు. సూపర్‌బజారు పాలక వర్గం గడువు ఈనెల 29తో ముగియనుండటంతో అధికార పీఐసీని నియమించాలని ప్రతిపాదనలు పంపారు. జిల్లాలో 93 సొసైటీలు ఉండగా వాటిల్లో ప్రస్తుతం తొమ్మిది సొసైటీలకు అధికార పీఐసీలు ఇన్‌చార్జీలుగా ఉండగా మిగిలిన 84 సొసైటీలకు అధికార పీఐసీలను నియమించేందుకు అధికారులు ప్రతిపాదనలు పంపారు.



పీడీసీసీబీ కార్యాలయం

16న మంత్రి స్వామి జిల్లాకు రాక

- భారీ ర్యాలీతో స్వాగత ఏర్పాట్లలో టీడీపీ శ్రేణులు, అభిమానులు
- అప్పటివరకు అమరావతిలోనే బిజీబిజీగా స్వామి
- సీఎం బాధ్యతల స్వీకరణకు హాజరు
- బాలయ్యను కలిసి శుభాకాంక్షలు తెలిపిన స్వామి, సత్య



బాలకృష్ణకు శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి డాక్టర్ స్వామి, సత్య

ఒంగోలు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రమంత్రివర్గంలో చోటు దక్కించుకున్న కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి ఈనెల 16న జిల్లాకు రానున్నారు. ఆ రోజు మధ్యాహ్నం అమరావతి నుంచి బయలుదేరి ఉమ్మడి జిల్లా సరిహద్దు బొప్పూడి వద్ద ఉన్న ఆంజేయస్వామి గుడిలో తొలుతపూజలు నిర్వహిస్తారు. అక్కడి నుంచి కొండపి నియోజకవర్గం ముఖద్వారమైన వల్లూరమ్మ గుడి వద్దకు చేరుకుని పూజలు చేస్తారు. అనంతరం స్వగ్రామమైన తూర్పునాయుడుపాలెంలో అంబేడ్కర్, ఎన్‌టీఆర్, దామచర్ల ఆంజనేయులు విగ్రహాలకు నివాళులర్పిస్తారు. తదనంతరం అభినందన సభ జరగనుంది. ఆ సభలో ఉమ్మడి జిల్లాకు చెందిన టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఇతర ముఖ్యనాయకులు పాల్గొననున్నారు. ఆ మేరకు కొండపి నియోజకవర్గ పార్టీ బాధ్యతలు చూస్తున్న పార్టీ యువనేత దామచర్ల సత్య ముఖ్యనేతలతో చర్చించి షెడ్యూల్ రూపొందించినట్లు సమాచారం. మంత్రివర్గంలో స్థానం దక్కించుకొని తొలిసారి జిల్లాకు వస్తున్న డాక్టర్ స్వామికి ఘనస్వాగతం పలికేందుకు టీడీపీ శ్రేణులు, అభిమానులు, భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇదిలాఉండగా కేసరపల్లి సభలో రాష్ట్రమంత్రిగా బుధవారం ప్రమాణస్వీకారం చేసిన డాక్టర్ స్వామి రాత్రి వరకు ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటే ఉన్నారు. ఇక గురువారం ఉదయం నుంచి తాడేపల్లి, విజయవాడ సెక్రటరియేట్‌లలో బిజీబిజీగా గడిపారు. ఎన్నికల ప్రచారంలో కొండపి నియోజకవర్గానికి వచ్చిన సినీహీరో, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను గురువారం ఉదయం విజయవాడలోని హోటల్ ఫార్చ్యూన్ మురళిలో మంత్రి స్వామి, యువనేత సత్యలు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మధ్యాహ్నం వరకు తను బసచేసిన తాడేపల్లిలోని ఫ్లాట్‌లోనూ అలాగే కోనూరులోని దామచర్ల సత్య నివాసంలోనూ టీడీపీ శ్రేణులకు అందుబాటులో ఉండగా నియోజకవర్గంతోపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు అలాగే వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సాయంత్రం సచివాలయంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు బాధ్యతలు స్వీకరణ కార్యక్రమానికి హాజరైన స్వామి రాత్రి వరకు సచివాలయంలోనే గడిపారు. కాగా శుక్ర, శనివారాలు అమరావతిలోనే మంత్రి డాక్టర్ స్వామి ఉండనున్నారు.



తక్షణమే చంద్రబాబు హామీలు

అమల్లోకి..

- విభిన్న వర్గాలకు లబ్ధి చేకూర్చే అంశాలపై సీఎం చంద్రబాబు తొలి సంతకాలు
- మెగా డీఎస్సీతో నిరుద్యోగులకు ఊరట
- పింఛన్ రూ.4వేల పెంపుతో 2.91లక్షల మందికి లబ్ధి
- పేదల ఆకలి తీర్చనున్న అన్న క్యాంటీన్లు
- ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు



పాతమార్కెట్‌లో బాబు, జనార్దన్ చిత్రపటాలకు పాలభిషేకం చేస్తున్న టీడీపీ శ్రేణులు

ఒంగోలు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన కీలక హామీల అమలుపై టీడీపీ కూటమి ప్రభుత్వం దృష్టిసారించింది. ముఖ్యమంత్రిగా బుధవారం ప్రమాణస్వీకారం చేసిన అధినేత చంద్రబాబు గురువారం సచివాలయంలో ఆ బాధ్యతలు తీసుకున్నారు. ఆ వెంటనే వివిధ వర్గాలకు ఉపకరించే ఐదు కీలక ఫైళ్లపై సంతకాలు చేశారు. ఎన్నికల ప్రచారంలో టీడీపీ అధినేతగా వివిధ వర్గాల వారికి లబ్ధి చేకూర్చే పలు అంశాలపై చంద్రబాబు విస్పష్టమైన హామీలు ఇచ్చారు. అందులో ఉపాధ్యాయ శిక్షణ కోర్సు పూర్తిచేసిన నిరుద్యోగులకు ఉపకరించే మెగా డీఎస్సీపై తొలి సంతకం, భూయజమానులను భయభ్రాంతులకు గురిచేసేలా గత వైసీపీ ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టుపై రెండో సంతకం చేస్తానని పలు సభల్లో చెప్పారు. అలాగే సామాజికపింఛన్ మొత్తాలను ప్రస్తుతం ఉన్న రూ.3వేల నుంచి రూ.4వేలకు పెంపుతోపాటు పలు ఇతర వాగ్దానాలు చేశారు. ఎన్నికలలో భారీ విజయాన్ని టీడీపీ కూటమికి ప్రజలు కట్టబెట్టగా ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన చంద్రబాబు మరుసటి రోజైన గురువారమే ఎన్నికలలో ఇచ్చిన హామీలు అమలుపై చర్యలు చేపట్టారు. తాను సీఎంగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఐదు కీలక అంశాలపై సంతకాలు చేశారు.

ఐదు ఫైళ్లపై సంతకాలు

ఎన్నికల వేళ చెప్పినట్లే మెగా డీఎస్సీపై తొలి, ల్యాండ్ టైటిలింగ్ యాక్టుపై రెండో సంతకం చేయగా పింఛన్ మొత్తం పెంపు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, స్కిల్ గణన అంశాలపై మిగతా సంతకాలు ఉన్నాయి. కాగా చంద్రబాబు తొలి సంతకం పెట్టిన మెగా డీఎస్సీలో రాష్ట్రంలో 16,347 ఉపాధ్యాయ పోస్టులు ఉండగా అందులో జిల్లాలో 988 పోస్టులు ఉన్నాయి. మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తే ఆమేర ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసుకొని ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు ఉద్యోగాలు రానున్నాయి. అలాగే పింఛన్ పెంపుతో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు ఇతరత్రా వర్గాలకు భారీ లబ్ధి చేకూరనుంది. ప్రస్తుతం జిల్లాలో సుమారు 2.91 లక్షల మంది పింఛన్‌దారులకు సుమారు రూ.87.90 కోట్లు అందిస్తున్నారు. తాజాగా మొత్తాన్ని రూ.3వేల నుంచి రూ.4వేలకు పెంచడంతో లబ్ధిదారులకు మరో సుమారు రూ.22కోట్లు మేర అదనంగా అందనుంది. అంతేకాక ఏప్రిల్ నుంచి జూన్ వరకు మూడు నెలలకు బకాయి మూడువేలు కూడా జూలైలో అందిస్తామని గతంలోనే చంద్రబాబు ప్రకటించారు. ఆ ప్రకారం జూలై తొలివారంలో ఒక్కొక్కరికి రూ.7వేల పింఛన్ అందనుంది.

అన్నకాంటీన్ ఇక కళకళ

టీడీపీ గత ప్రభుత్వంలో ఒంగోలుతోపాటు జిల్లాలోని పలు ఇతర పట్టణాల్లో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసి రూ.5కే భోజనం, టిఫిన్ అందించగా నిత్యం ప్రతి క్యాంటీన్‌లో వందలాది మంది తిని ఆకలి తీర్చుకున్నారు. వైసీపీ వచ్చాక వాటిని మూతవేసింది. పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించనున్నారు శుక్రవారం నుంచే వాటిని ప్రారంభించనుండగా చిరు వ్యాపారులు, వివిధ రంగాల కార్మికులు, అడ్డకూలీలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దుతో భూయజమానులకు భరోసా లభించనుంది. మొత్తంగా బాధ్యతలు స్వీకరించిన మరుక్షణమే పలు హామీల అమలుపై చంద్రబాబు సంతకాలు చేయడంతో పాలనలో మార్పు ప్రారంభమైందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.



కొత్తపట్నంలో ఏర్పాటుచేసిన అన్న కాంటీన్

మార్పు మొదలైంది..!

- టీడీపీ అధికారంలోకి రాగానే ఒంగోలులో అభివృద్ధివైపు అడుగులు
- ఆగమేఘాల మీద రోడ్లకు మరమ్మతులు
- చెత్త సేకరణపై అధికారులు ప్రత్యేక దృష్టి

ఒంగోలు (కార్పొరేషన్), జూన్ 13 : గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి ఊసే లేని ఒంగోలు నగరంలో అప్పుడే మార్పు మొదలైంది. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే యంత్రాంగంలో కదిలిక వచ్చింది. పేరుకుపోయిన సమస్యలపై దృష్టిసారించింది. రెండు రోజులుగా కార్పొరేషన్, ఆర్‌అండ్‌బీ శాఖల ఆధ్వర్యంలో పనులు వేగవంతమయ్యాయి. కమిషనర్ ఎం. జశ్వంత్‌రావు సిబ్బందితో సమీక్షించి, పనులకు ముందడుగు వేశారు. ఆయన స్వయంగా నగరంలో పర్యటించి పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టారు. నగరంలో ఇంటింటి చెత్త సేకరణలో నిర్లక్ష్యం వహించకూడదని సిబ్బందిని ఆదేశించారు. అలాగే నగరంలో వీధుల్లో చెత్త నిల్వ ఉండటానికి వీల్లేదని ఆదేశించారు. పారిశుధ్యంపై ప్రజల నుంచి ఫిర్యాదులు రాకూడదని, ఎప్పటికప్పుడు పారిశుధ్యం మెరుగుపరచాలని చెప్పారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ రవీంద్ర, శానిటరీ సూపర్‌వైజర్ పిచ్చయ్యతో కలిసి కమిషనరు నగరంలో పలు ప్రాంతాల్లో చెత్త తొలగింపు చర్యలను పర్యవేక్షించారు. ఇదిలా ఉండగా, నగరంలోని కర్నూలు రోడ్ బైపాస్‌తోపాటు ఫ్లై ఓవర్ బ్రిడ్జికి రెండు వైపులా ఉన్న సర్వీసు రోడ్లు గత కొన్నేళ్లుగా గుంతలమయంగా మారి, వాహన రాకపోకలకే కాదు కనీసం కాలినడక కూడా కష్టతరంగా మారింది. ఈ నేపథ్యంలో అధికారులు ఆ రోడ్డు నిర్మాణంపై దృష్టి పెట్టారు. ఇప్పటికే ఒక లేయర్ తారురోడ్డు వేశారు. మిగిలిన రోడ్లను అందంగా తీర్చిదిద్దారు. ఇటీవల ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఆదేశాలతో నగరంలో సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టగా, టీడీపీ అధికారంలోకి వచ్చిన వారంరోజుల్లోనే మార్పు మొదలైందని ప్రజలు చర్చించుకుంటున్నారు. తాజాగా కొత్త రోడ్డు నిర్మాణంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



బైపాస్ రోడ్డుపై కొత్తగా వేసిన లేయర్

ప్రభుత్వ భూమి

మళ్లీ ఆక్రమణ

- హెచ్చరిక బోర్డు తొలగించి గోడ నిర్మాణం
- జాతీయ రహదారి పక్కన 65 సెంట్లు కబ్జా
- మార్కెట్ విలువ రూ.4 కోట్ల పైమాటే
- వైసీపీ కౌన్సిలర్ అడ్డగోలు వ్యవహారం

మార్కాపురం, జూన్ 13: మార్కాపురంలోని రైతుల వినియోగం కోసం కేటాయించిన కల్లం భూమిని మరోసారి ఆక్రమించేందుకు వైసీపీ కౌన్సిలర్ పూనుకున్నాడు. గతంలో మార్కాపురం నియోజకవర్గంలో జరిగిన భూఆక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. మార్కాపురం పురపాలక సంఘంలో వైసీపీ కౌన్సిలర్ పట్టణానికి సమీపంలో నుంచి వెళుతున్న జాతీయ రహదారి పక్కనే ఉన్న సుమారు రూ.4 కోట్ల విలువైన భూమిపై కన్నేశాడు. గత ఏడాది సెప్టెంబరులో ఆ భూమిని చదును చేశాడు. ఈ విషయంపై 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు వెలువడ్డాయి. స్పందించిన రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని నిర్ధారించారు. అందుకు సంబంధించిన హెచ్చరిక బోర్డులు సైతం ఏర్పాటు చేశారు. అదే భూమిలో మరోసారి హెచ్చరిక బోర్డులు తొలగించి గోడను నిర్మించడం గమనార్హం.



వైసీపీ కౌన్సిలర్ ఆక్రమించిన ప్రభుత్వ భూమి(ఫైల్)

నాడు కల్లం కోసం వినియోగం

మార్కాపురం పట్టణ పరిధిలో సర్వే నెంబరు 1011లో 0.64 సెంట్ల ప్రభుత్వ భూమి ఉంది. పూర్వపు ఆర్ఎస్ఆర్ ప్రకారం ఆ భూమి రైతులకు సంబంధించిన కల్లంగా నమోదై ఉంది. గతంలో ఆ భూమిని ఎవరూ పట్టించుకునేవారు కాదు. మార్కాపురం పట్టణ సమీపం నుంచి జాతీయ రహదారి 545 వెళుతోంది. దీంతో ఆ రహదారి వెంబడి భూముల ధరలకు రెక్కలొచ్చాయి. దీంతో భూ అక్రమార్కులకు ప్రభుత్వ భూములపై కన్నుపడింది. మార్కాపురం మున్సిపాలిటీలోని ఓ కౌన్సిలర్ ఆ భూమిపై వాలాడు. మట్టి తోలి చదును చేసి ఆక్రమించాడు. దీనిపై కథనాలు వెలువడటంతో రెవెన్యూ అధికారులు స్పందించారు. ఆ భూమిలో కొలతలు నిర్వహించి ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని నిర్ధారించి బోర్డులు ఏర్పాటు చేశారు. కానీ సదరు వైసీపీ కౌన్సిలర్ మళ్లీ ఆ ప్రభుత్వ స్థలాన్ని తిరిగి తన స్వాధీనంలోకి తెచ్చుకోవడానికి సిద్ధమయ్యాడు. ఆక్రమిత చర్యలో భాగంగా రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డులను తొలగించాడు. ఆ స్థలంలో కొత్తగా గోడ నిర్మాణం చేపట్టాడు. ఇప్పటికైనా మరోసారి రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిని కాపాడటానికి సమగ్ర చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎంపీ పురందేశ్వరికి సత్కారం


ఎంపీ పురందేశ్వరిని సత్కరిస్తున్న నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 13: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి పార్లమెంట్ సభ్యులు దగ్గుబాటి పురందేశ్వరిని ఆ పార్టీ జిల్లా నాయకులు సత్కరించారు. ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వైసీ.యోగయ్యయాదవ్ ఆధ్వర్యంలో గురువారం విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో కలిశారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాజమండ్రి పార్లమెంట్ స్థానం నుంచి ఘన విజయం సాధించిన పురందేశ్వరిని శాలువతో సత్కరించారు. అదేవిధంగా రాష్ట్రమంత్రి వై.సత్యకుమార్, రాష్ట్ర సంఘటనా మంత్రి మధుకర్‌జీలను సన్మానించారు. కార్యక్రమంలో రాయపాటి అజయ్, సింగోతు రాజేష్‌వర్మ, మాకినేని అమరసింహ, పల్లిబోయిన మధు, కటారి సుధాకర్‌యాదవ్ పాల్గొన్నారు.

మినిమం టైం స్కేలు టీచర్ల కొనసాగింపు

● కౌన్సెలింగ్ నిర్వహించి నియామకాలు

ఒంగోలు(విద్య), జూన్ 13 : మినిమం టైం స్కేలుతో కాంట్రాక్టు టీచర్లుగా పనిచేస్తున్న డీఎస్సీ 2008, 1998 టీచర్ల సర్వీసులను 2024-25 సంవత్సరానికి కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు పాఠశాల విద్యా కమిషనర్ ఎన్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. వీరి సేవలను 2025 ఏప్రిల్ 30 వరకు కొనసాగిస్తారు. వీరు కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్నందున వీరి సర్వీసు బ్రేక్ కోసం ఒక నెలను నో వర్క్ పే కింద పరిగణిస్తారు. ఎంటీఎస్ టీచర్ల నియామకానికి సంబంధించి ప్రభుత్వం తాజా మార్గదర్శకాలను జారీ చేసింది. వీరందరికి కౌన్సెలింగ్ నిర్వహించి అవసరం ఉన్న పాఠశాలల్లోనే నియమించాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

పలు పాఠశాలల తనిఖీ

ఒంగోలు(విద్య), జూన్ 13 : ఒంగోలు నగరంలోని వివిధ పాఠశాలలను గురువారం ఎంఈవో టి.కిషోర్‌కుమార్ తనిఖీ చేశారు. పాఠశాలలు పునః ప్రారంభమైనందున వాటిని సందర్శించి హెచ్‌ఎంలకు పలు సూచనలు చేశారు. స్థానిక పీవీఆర్ బాలుర మునిసిపల్ హైస్కూలు విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను ఎంఈవో పంపిణీ చేశారు. సెయింట్ థెరిస్సా ప్రాథమిక పాఠశాల, హైస్కూలు, కోర్టు సెంటర్‌లోని మునిసిపల్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంగోలు మండలంలో 96 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 7500 మంది విద్యార్థులు చదువుకుంటున్నారన్నారు. అందుకోసం 70వేల పాఠ్యపుస్తకాలు, 40వేల నోటుపుస్తకాలు, 3వేలబెల్టులు పాఠశాలలకు పంపించినట్లు తెలిపారు. అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు స్టూడెంట్‌కిట్లు పంపిణీని ప్రారంభించినట్లు చెప్పారు.

మంత్రిమండలిలో యాదవులకు సముచిత స్థానం

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 13: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన మంత్రి మండలిలలో యాదవులకు సముచిత స్థానం కల్పించారని జిల్లాయాదవ జేఏసీ అధ్యక్షుడు చిరుమామిళ్ళ గోపికృష్ణ గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఒకేసారి ఇద్దరికి మంత్రులుగా అవకాశం ఇచ్చి యాదవులపై తనకు ఉన్న అభిమానాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు చాటుకున్నారన్నారు. ఆయన వెంటే రాష్ట్రంలో ఉన్న యాదవులందరూ ఉంటారని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో యాదవులకు నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పించాలని ఆయన కోరారు.

పచ్చిరొట్ట పైర్లను సాగు చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 13: పొగాకు రైతులు విరివిగా పచ్చిరొట్ట పంటలను సాగు చేయాలని పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ ఎం.లక్ష్మణరావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. జనుము, డయాంబియా, పిల్లిపెసరు తదితర రకాల పంటలను పెంచడం ద్వారా భూసారం పెరిగి పొగాకు మొక్కకు ఉపయోగపడుతుందన్నారు. ఈ పంటల వల్ల భూమిలో నత్రజని స్థాపితమై మొక్కకు ఉపయోగపడుతుందని, నేలకు అనేక పోషకాలు అందుతాయని తెలిపారు వివిధ రకాల కలుపు మొక్కలను సమూలంగా నిర్మూలించవచ్చన్నారు. ఎకరాకు 15నుంచి 20 కేజీల విత్తనాలను వేసి 50నుంచి 55 రోజుల తర్వాత పూత దశకు రాకముందే పంటలను భూమిలోపలికి దున్నడం వల్ల నేలలో భూసారం పెరుగుగుతుందన్నారు. అందువల్ల రైతులు విరివిగా పచ్చిరొట్ట పంటలను సాగు చేయడంతో ద్వారా నాణ్యమైన పొగాకును ఉత్పత్తిని చేయవచ్చని ఆయన పేర్కొన్నారు.

అధ్వానంగా కొండపి రోడ్డు

అడుగడుగునా గోతులు

పట్టించుకోని వైసీపీ పాలకులు

టీడీపీ ప్రభుత్వంపై ప్రజల ఆశలు



గోతులతో బురదమయంగా మారిన రోడ్డు

టంగుటూరు, జూన్ 13 : ఇది టంగుటూరు పట్టణానికి ప్రధాన రోడ్డు. ఈమార్గంలోనే ప్రభుత్వ కార్యాలయాల సముదాయం, బ్యాంకులు, ప్రభుత్వ ఆసుపత్రి, పోతుల చెంచయ్య వెస్ట్ కాలనీ, ఇండేన్ గ్యాస్ ఆఫీస్, జాతీయ బ్యాంకులు, నిత్యం మహిళలు వచ్చిపోయే పొగాకు గోదాములు, పలు ప్రైవేటు కార్యాలయాలు ఉన్నాయి. టంగుటూరు నుంచి కొండపికి వెళ్లే మార్గం కూడా ఇదే. కొండపి రోడ్డులోని పలు గ్రామాల ప్రజలు ఈరోడ్డు నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. ఇతటి ప్రాధాన్యం ఉన్న ఈ రోడ్డు గురించి గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అధ్వానంగా తయారైంది. టంగుటూరు స్టేట్ బ్యాంకు వద్ద నుంచి జాతీయ రహదారిలోని ఫ్లైఓవర్ వరకు గోతులమయంగా మారింది. కొద్దిపాటి వర్షం కురిసినా తటాకాన్ని తలపిస్తూ రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగా ఏర్పడిన టీడీపీ ప్రభుత్వంలోనైనా ఈ రోడ్డు పునర్నిర్మిస్తారని ప్రజలు ఆశిస్తున్నారు. అందుకు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని వారు కోరుతున్నారు.

సమష్టి కృషితోనే ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణ

● కలెక్టర్ దినేష్‌కుమార్

కొత్తపట్నం(ఒంగోలునగరం) జూన్ 13: సమష్టి కృషితోనే జిల్లాలో ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఆర్వోలు, నోడల్ ఆఫీసర్లు, ఏఆర్వోలు, ఇతర శాఖల జిల్లా అధికారులు, సిబ్బందితో ఆయన గురువారం కొత్తపట్నంలోని నల్లూరిగార్డెన్స్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సార్వత్రిక ఎన్నికలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించామని, అది అందరి కృషి వల్లే సాధ్యపడిందన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన పగడ్బందీ ప్రణాళికను రూపొందించటం, దాని అమలుకు పర్యవేక్షించటం ద్వారా ఎన్నికలను విజయవంతంగా నిర్వహించినట్లు ఆయన చెప్పారు. జిల్లా స్థాయి మొదలుకుని గ్రామస్థాయి వరకు అధికారులకు సిబ్బందికి ఆ దిశగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించటం ద్వారా ఎలాంటి ఆటంకాలు లేకుండా ఎన్నికల ప్రక్రియ ముగియటంతో పాటు పోలింగ్ శాతంలో రాష్ట్రంలోనే ప్రకాశం జిల్లా ప్రథమస్థానంలో నిలిచిందన్నారు. అనంతరం ఎస్పీ గరుడ్‌సుమిత్‌సునీల్ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది, జిల్లా అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేయటం వల్ల శాంతిభద్రతలకు ఎలాంటి ఆటంకం కలుగలేదన్నారు. అనంతరం విధుల్లో పాల్గొన్న అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జేసీ గోపాలకృష్ణ, మార్కాపురం సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే అవ్వాతాతల సంక్షేమం

● దామచర్ల నాగసత్యలత


అన్నదానం చేస్తున్న నాగసత్యలత

ఒంగోలు(కార్పొరేషన్), జూన్ 13: తెలుగుదేశం పార్టీతోనే అవ్వాతాతల సంక్షేమం సాధ్యమని దామచర్ల జనార్దన్ సతీమణి నాగసత్యలత పేర్కొన్నారు. ఈ మేరకు తమ నాయకుడు ఎన్నికల్లో దామచర్ల అత్యధిక మెజారిటీ సాధించిన సందర్భంగా ఒంగోలు నగరం 30వ డివిజన్ అధ్యక్షులు నత్తల కనకారావు ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. స్థానిక సీతారామపురంలోని సమతావృద్ధుల ఆశ్రమంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి నాగసత్యలత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులతో ప్రేమగా మాట్లాడిన ఆమె దామచర్ల గెలుపునకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వృద్ధుల సంక్షేమం కోసం ప్రత్యేక దృష్టి సారించారని చెప్పారు. సీఎంగా బాధ్యతలు స్వీకరించిన మొదటి రోజే పింఛను పెంపుపై సంతకం చేశారన్నారు. ఇకపై ప్రతి నెలా అవ్వాతాతలకు రూ.4వేలు పింఛను అందించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని పార్టీ శ్రేణులను నాగ సత్యలత అభినందించారు. కార్యక్రమంలో రమేష్, కె.భాను, సురేష్, కె.ప్రసాద్, కె.రాజేష్, నత్తల శ్రీనివాసరావు, బేతాళ నాని, మాలెంపాటి కృష్ణారావు, దాయనేని ధర్మ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు, దామచర్ల చిత్రపటాలకు పాలభిషేకం

● తెలుగు యువత ఆధ్వర్యంలో సంబరాలు


చంద్రబాబు, దామచర్ల చిత్రపటాలకు పాలభిషేకం చేస్తున్న నాయకులు

ఒంగోలు(కార్పొరేషన్), జూన్ 13 : ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు, ఒంగోలు ఎమ్మెల్యేగా దామచర్ల జనార్ధన్ విజయం సాధించడంతో పాటు, చంద్రబాబు బాధ్యతలు తీసుకున్న సందర్భంగా తెలుగు యవత ఆధ్వర్యంలో వారి చిత్రపటాలకి పాలభిషేకం చేశారు. గురువారం సాయంత్రం ఒంగోలు నగరం పాత మార్కెట్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలుగుయువత అధ్యక్షుడు ముత్తన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా, యువత పాల్గొని సంతోషాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాపాలన మొదలైందన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న మొదటి రోజే ఐదు అంశాలపై సీఎంగా సంతకాలు చేయడం శుభపరిణామని పేర్కొన్నారు. టీడీపీ హయాంలో రాష్ట్రం మరింతగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ముత్తన నాగరాజు, బి.దయానంద్, కె.పవన్, ముత్తన బాలు, తోట భరత్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

● సీఐటీయూ నాయకుల వినతి


ఎంఈవోలకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నాగులుప్పలపాడు, జూన్ 13: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు కోరారు. గురువారం నాగులుప్పలపాడులో ఎంఈవోలు తిరుమలశెట్టి రవి, ఈవీ.రమణయ్యలను సీఐటీయూ నాయకుడు జి.బసవపున్నయ్య ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించే కార్మికులకు పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలన్నారు. ప్రభుత్వం రోజుకోరకం వంటకం విద్యార్థులకు తయారు చేసి అందించాలని నిర్ణయించిందని చెప్పారు. ప్రతిరోజూ రాగి జావా అందించాలనే నిబంధన విధించిందన్నారు. నిత్యావసరాలు, కూరగాయలు, గ్యాస్ ధరలు, పెరగడంతో మధ్యాహ్న భోజన కార్మికులపై భారం పడుతుందని చెప్పారు. ఒక పక్క ధరల పెరుగుదల, మరో పక్క పని భారం పెరగడం, వేతనాలు పెంచకపోవడంతో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇదేవిధంగా కొనసాగితే మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ భారంగా మారుతుందన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రభుత్వం మెనూ చార్జీలు పెంచి, గుర్తింపు కార్డులు, కనీసవేతనం, ఉచితంగా గ్యాస్ సరఫరా, ఎకరూప దుస్తులు, ప్రతి నెల 5వ తేదీ లోపే వేతనాలు అందించాలనే డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు హనుమంతరావు, మాధవి, ఎం.వెంకటేశ్వరమ్మ, వెంకటరమణ, రమణ, పి.వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

పాఠశాలలో వస్తువులు ధ్వంసంపై ఫిర్యాదు



స్కూలులో ధ్వంసమైన తలుపు, వాషింగ్‌షీట్స్

నాగులుప్పలపాడు, జూన్ 13 : ప్రభుత్వ పాఠశాలలోని తలుపులు, వాషింగ్ షీట్స్‌ను ధ్వంసం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అమ్మనబ్రోలులోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలోని బాత్‌రూం తలుపు, మూడు వాషింగ్ షీట్స్‌ను గుర్తు తెలియని వ్యక్తులు వేసవి సెలవులలో పగులగొట్టారు. గురువారం పాఠశాలలు పునఃప్రారంభం కావ డంతో ప్రధానోపాధ్యాయురాలు ఎం.సత్యవతి వస్తువులు ధ్వంసమైనట్లు గుర్తించి నిందితులను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ శోభ


విద్యుద్దీపాల వెలుగుల్లో తహసీల్దార్ కార్యాలయం

నాగులుప్పలపాడు, జూన్ 13 : తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా నాలుగవ సారి ప్రమాణ స్వీకారం చేయడంతో మండల పరిధిలోని గ్రామాలలో ఆనందోత్సాహాలు వెల్లువెత్తాయి. కొత్త ప్రభుత్వ ఏర్పాటుతో మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలను విద్యుద్దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ కాంతులతో ముస్తాబు చేయడం పట్ల ప్రభుత్వం సరికొత్త ఆలోచనా విధానాలపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొత్త ప్రభుత్వానికి స్వాగతం చెబుతున్నారు.

ప్రాథమిక పాఠశాలల్లో 'విద్యాప్రవేశ్'

ఒంగోలు(విద్య), జూన్ 13: జిల్లాలోని ప్రాథమిక పాఠశాలల్లో 1వతరగతి విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయులు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో నిర్వహించబడుతున్న విద్యా ప్రవేశ్ కార్యక్రమాన్ని పాఠశాలల్లో అమలు చేయాలని డీఈవో డి.సుభద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఎంఈవోలు ఇద్దరు, స్కూలు కాంప్లెక్స్ హెచ్‌ఎంలు తప్పనిసరిగా పర్యవేక్షించాలన్నారు. ప్రతిరోజు రెండు గంటల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. శారీరక, జ్ఞానాత్మక, భాషాభివృద్ధి ఉప అంశాలుగా కృత్యాలను నిర్వహించాలని సూచించారు.

కేబినెట్‌లో బీసీలకు అవకాశంపై హర్షం

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 13 : రాష్ట్రమంత్రి వర్గంలో బీసీలకు అత్యధిక ప్రాధాన్యత కల్పించడం పట్ల 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా 164అసెంబ్లీ స్థానాల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించడంలో నూటికి 50శాతంగా ఉన్న బీసీల పాత్రవల్లనే సాధ్యమైందన్నారు. గత ప్రభుత్వం బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకున్నారని, కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ప్రజాస్వామ్యబద్ధంగా పాలన కొనసాగించాలని ఆయన కోరారు.

అవీ..ఇవీ..

ఆవులు, లేగదూడలను సామూహిక వధ చేస్తే చర్యలు

● జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి బేబీరాణి

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 13 : ఈనెల 17వ తేదీన బక్రీదు పండుగ సందర్భంగా జిల్లాలో ఆవులు, లేగదూడల సామూహిక వధ జరిగితే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ కె.బేబీరాణి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇలా ఆవులు, లేగదూడలను వధించటం జంతు హింస నివారణ చట్టం 1960, ఆంధ్రప్రదేశ్ గోవధ నిరోధక చట్టం 1977, పశువుల రవాణా నియామవళి 1978, సుప్రీంకోర్టు, హైకోర్టు ఇచ్చిన వివిధ రకాల ఉత్తర్వులు ప్రకారం చట్ట విరుద్ధమన్నారు. జిల్లాలో ఇలాంటి చర్యలకు ఉపక్రమించినా, సహకరించిన వారందరూ శిక్షార్హులని పేర్కొన్నారు. అందువల్ల దీనిని దృష్టిలో పెట్టుకొని ఎవరూ సామూహిక వధ కోసం పశువులను అమ్మకూడదని, వాటి రవాణాలో పాలు పంచుకోవద్దని ఆమె స్పష్టం చేశారు.

ఆరోగ్య కేంద్రానికి సెంట్రీఫ్యూజ్ బహూకరణ


వైద్యపరికరాన్ని ప్రారంభిస్తున్న దాతలు

ఒంగోలు(కార్పొరేషన్), జూన్ 13: కరవది గ్రామానికి చెందిన సిరిగిరి కృష్ణారావు, సుబ్బరావమ్మ దంపతులు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సెంట్రీఫ్యూజ్ వైద్య యంత్రాన్ని బహూకరించి ప్రారంభించారు. గురువారం జరిగిన కార్యక్రమంలో వైద్యాధికారి సుందర్‌ప్రసాద్ మాట్లాడుతూ కృష్ణారావు దాతృత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ సహకారం, గ్రామస్థుల కృషితో ఆసుపత్రిని అభివృద్ధి చేసుకుందామన్నారు. కార్యకర్మంలో ఫార్మసీ అధికారి శ్రీధర్‌బాబు, స్టాఫ్ నర్సులు జ్యోతి, భానుమతి, ల్యాబ్ టెక్నీషియన్ మహేంద్ర, ఎంఎల్‌హెచ్‌పీలు అశోక్, రవి, ఏఎన్‌ఎం భారతి తదితరులు పాల్గొన్నారు.

బీఫార్మసీ ఫలితాలు విడుదల


ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ అంజిరెడ్డి

ఒంగోలు(విద్య), జూన్ 13: ఒంగోలులోని ఆంధ్రకేసరి యూనివర్సిటీ బీఫార్మసీ మొదటి సెమిస్టర్ ఫలితాలను గురువారం వైస్‌చాన్స్‌లర్ మారెడ్డి అంజిరెడ్డి విడుదల చేశారు. ఈ పరీక్షల్లో కేవలం 49.45శాతం మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. యూనివర్సిటీ పరిధిలో నాలుగు బీఫార్మసీ కళాశాలల నుంచి 275మంది పరీక్షకు హాజరు కాగా 136 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. యూనివర్సిటీ స్థాయిలో మార్కాపురంలోని శామ్యూల్ జార్జి ఫార్మసీ కళాశాల విద్యార్థిని దాసరి స్మైలీ 8.19 పర్సంటైల్‌తో ప్రథమ ర్యాకు సాధించారు. షేక్ మల్లికాన్రీన్ 8.18, కొప్పుల వర్షిత 8.05 పర్సంటైల్‌తో రెండు,మూడు స్థానాల్లో నిలిచారు. ఉత్తమ ప్రతిభ కనపబర్చిన విద్యార్థులను వీసీ అంజిరెడ్డి, రిజిస్ట్రార్ బి.హరిబాబు, సీఈ కేవీఎస్.రాజు తదితరులు అభినందించారు. కార్యక్రమంలో సీటీఏ సోమశేఖర్, ఎస్‌టీపీ ఆర్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

15లోపు టీచర్ల రెగ్యులరైజేషన్ : డీఈవో

ఒంగోలు(విద్య) జూన్ 13: జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నతపాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సర్వీసు రెగ్యులరైజేషన్, ప్రొబేషన్ డిక్లరేషన్ పెండింగ్ ఉంటే ఈనెల 15లోపు పూర్తి చేయించుకోవాలని డీఈవో డి.సుభద్ర గురువారం ఒక ప్రకటనలో కోరారు. సర్వీసు రెగ్యులరైజేషన్, ప్రొబేషన్ డిక్లరేషన్‌కు సంబంధిత పత్రాలతో ప్రతిపాదనలు మండల విద్యాధికారులు, ఉపవిద్యాధికారుల ద్వారా ఈనెల 15వతేదీ ఉదయం పది గంటల లోపు డీఈవో కార్యాలయంలో సమర్పించాలన్నారు. స్థానిక సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలో సర్వీసు రిజిస్టర్లను పరిశీలన చేయించుకోవాలని ఆమె సూచించారు.

అక్రమంగా మద్యం విక్రయించిన ముగ్గురికి జైలు

ఒంగోలు(క్రైం), జూన్13: పుదుచ్చేరి రాష్ట్రం మద్యాన్ని ఒంగోలులో విక్రయిస్తున్న ముగ్గురిపై నేరం రుజువుకావడంతో నిందితులకు ఒక్కొక్కరికి రెండేళ్ళు జైలు, రూ.2లక్షలు జరిమాన విధిస్తూ ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి ఎస్.కోమలవల్లి గురువారం తీర్పు ఇచ్చారు. వివరాలోకి వెళితే.. ఒంగోలు నగరం సీతారామపురంనకు చెందిన శెట్టి శ్రీకాంత్, శెట్టి వంశీ, పోతూరి అమృతరాజుపై 2021 జూలై 25న సెబ్ ఇన్‌స్పెక్టర్ కేసు నమోదు చేశారు. వారు ముగ్గురు స్థానిక సీతారామాపురంలో వీధిలోని ఓ ఇంటిని అద్దెకు తీసుకొని పుదుచ్చేరి మద్యం విక్రయిస్తూ 42ఫుల్ బాటిళ్ల మద్యంతో పట్టుబడ్డారు దీంతో వీరిపై కేసు నమోదు చేసిన సెబ్ ఇన్‌స్పెక్టర్ అప్పటిలో అరెస్టు చేశారు. ఈ కేసును ఎక్సైజ్ కోర్టులో విచారించిన న్యాయమూర్తి ఈమేరకు తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ తరుపున ఏపీపీ శ్రావణ్‌కుమార్ వాదనలు వినిపించారు.

రాజకీయ నాయకుల ఫొటోలున్న కిట్లు వద్దు

● సమగ్రశిక్ష పీడీ శ్రీనివాసరావు

ఒంగోలు(విద్య), జూన్ 13 : పాఠశాల విద్యార్థులకు ఉచితంగా అందజేసే స్టూడెంట్ కిట్స్ బ్యాగులు, ఇతర వస్తువులపై ఎటువంటి రాజకీయ నాయకులు ఫొటోలు ఉండకూడదని, ఎంఈవోలు ఇలాంటి స్టూడెంట్ కిట్లను తీసుకోకుండా తిరస్కరించాలని సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో ఆదేశించారు. పాత స్టూడెంట్ కిట్లుకాని, ఎటువంటి రాజకీయ నాయకుల ఫొటోలు ఉన్న స్టూడెంట్ కిట్లను విద్యార్థులకు ఇవ్వకూడదని ఆయన పేర్కొన్నారు. స్టూడెంట్ కిట్ల వివరాలను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలన్నారు. విద్యార్థులకు మంచి కిట్లు సరఫరా చేసి డ్యామేజి అయిన వాటిని ఎంఆర్‌సీల్లో ఉంచాలని ఆయన సూచించారు.

నందిపాడు సొసైటీ అధ్యక్షుడు రాజీనామా

మద్దిపాడు, జూన్ 13: నందిపాడు సహకార సంఘం అధ్యక్షుడు పోనాటి అప్పారావు తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని సహకార సంఘ ఉన్నతాధికారులకు పంపినట్లు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

జీవనోపాధికి ఆర్థికసాయం

ఒంగోలు(విద్య), జూన్ 13: సూర్యశ్రీ దివ్యాంగుల ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఓ మహిళకు జీవనోపాధి కల్పించారు. స్థానిక అంజయ్యరోడ్‌లో ఏర్పాటుచేసిన కర్రీస్ పాయింట్‌ను గురువారం ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు మండవ మురళీ కృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంగోలులో కార్పెంటర్‌గా పనిచేస్తున్న వీరబ్రహ్మం మూడు నెలల కిందట ప్రమాదంలో చనిపోయాడని, దీంతో అతని కుటుంబం ఇల్లు గడవక తమ ట్రస్ట్‌ను ఆశ్రయించిందన్నారు. ప్రవాస భారతీయులు పవన్ మండవ, మిండి శ్రీనివాసరావుల సహకారంతో రూ.32వేలతో స్థానిక దుర్గా కంటి ఆస్పత్రి వద్ద కర్రీస్ పాయింట్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఛైర్మన్ షహనాజ్, సెక్రటరీ సర్దార్‌బాషా, నేరెళ్ల శ్రీనివాసరావు, కె.శ్రీదేవి, జనసేన నాయకుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సాయిరాం కాలేజీ విద్యార్థులకు ర్యాంకులు

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 13: ఒంగోలులోని శ్రీసాయిరాం కాలేజీ విద్యార్థినులు ఎంసెట్‌లో పలు ర్యాంకులు సాధించారు. కె.పద్మజ 4792, డి.హిమని 10057 ర్యాంకు సాధించారు. అలాగే 20వేల లోపు ర్యాంకులను 18 మంది విద్యార్థులు సాధించారు. నీట్ ఫలితాల్లో డైరెక్టుగా 585 మార్కులతో 96.92 పర్సంటైల్‌తో కె.అమృత, జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో ఎం.నందిని 929 ఆల్‌ఇండియా ర్యాంకులు పొందారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక కళాశాలలో ర్యాంకులు సాధించిన విద్యార్థినులను ప్రిన్సిపాల్ కె.అంజయ్య, కరస్పాండెంట్ కె.మోహనరావు, అధ్యాపకులు అభినందించారు.

నాణ్యమైన పురుగుమందులు తయారుచేయాలి

● జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు

మద్దిపాడు, జూన్ 13: పురుగుమందుల తయారీదారులు నాణ్యమైన ఉత్పత్తులను మాత్రమే తయారు చేయాలని, మందుల్లో నాణ్యతా లోపం ఉంటే సహించేది లేదని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు హెచ్చరించారు. గురువారం మద్దిపాడు మండలం గుండ్లాపల్లి గ్రోత్‌సెంటర్‌లో సదరన్ పెస్ట్ పురుగు మందుల తయారీ కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో టెక్నికల్ ఏవో రమేష్‌బాబు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆచార్య ఎన్‌జీరంగా పురస్కారానికి నవలల ఆహ్వానం

ఒంగోలు(విద్య), జూన్ 13: ఆచార్య ఎన్‌జీరంగా సాహిత్య పురస్కారం కోసం సాహిత్యవేత్తలు తమ నవలలను పంపాలని నాగభైరవ సాహిత్యపీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ గురువారం ఒక ప్రకటనలో కోరారు. పురస్కారం కోసం రచయితలు 2021-23 మధ్య కాలంలో రచించిన నవలలను నాలుగు ప్రతులు పంపాలన్నారు. ఎంపిక చేసిన వాటిలో మొదటి బహుమతిగా రూ.10వేలు, రెండవ బహుమతిగా రూ.5వేలు అందజేస్తామన్నారు. నవలల ప్రతులను డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, 202, శ్రీవెంకటసాయి రెసిడెన్సీ, రామయ్యనగర్, ఒంగోలు-523002 అడ్రసుకు పంపించాలని, మరిన్ని వివరాల కోసం 9849799711 సెల్ నెంబరులో సంప్రదించవచ్చని ఆయన కోరారు.

ఇక... దయచేయండి

● రేషన్ డీలర్లకు అధికారుల ఆదేశాలు

కొండపి, జూన్ 12 : నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని రేషన్ దుకాణాల డీలర్లు వెంటనే తప్పుకోవాలని రెవెన్యూ, ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు మౌఖికంగా ఆదేశాలు జారీ చేస్తున్నట్లు సమాచారం. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో అధికార పార్టీకి చెందిన గ్రామ స్థాయి నాయకులు రేషన్ దుకాణాలను దక్కించుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ క్రమంలో అన్ని మండలాల్లో రెవెన్యూ అధికారులను కలుస్తున్నారు. వచ్చే నెలలో తామే సరకులకు డీడీలు తీస్తామని వారు అధికారులను కోరుతున్నారు. కొన్ని మండలాల్లో రేషన్ దుకాణాల డీలర్‌షిప్‌ల కోసం గ్రామాల్లో పోటీ తీవ్రంగా ఉంది. డీలర్లను నిర్ణయించే వరకు గ్రామ రెవెన్యూ అధికారులతో దుకాణాలు నిర్వహించాలని అధికారులను ఆయా మండలాల నాయకులు కోరుతున్నారు. మొత్తంగా ఆరు మండలాల్లో ఈ తరహా వాతావరణం నెలకొందని సమాచారం. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో దుకాణాలు నిర్వహించిన వారు తిరిగి దక్కించుకునేందుకు యత్నాలు సాగిస్తుండగా, పార్టీ కోసం పని చేసిన యువకులు కూడా రేషన్ దుకాణాల కోసం గ్రామస్థాయిల్లో నాయకులపై ఒత్తిడి తెస్తున్నారు. మొత్తంగా ఈనెలలో కాని, లేదా వచ్చేనెలలోగాని నియోజకవర్గంలోని అన్ని దుకాణాలకు కొత్త డీలర్‌ను నియమించే కార్యక్రమం పూర్తవుతుందని నాయకులు అంటున్నారు.



ఉపాధి పనులు చేపట్టాలని వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ఉపాధి పనులు చేపట్టాలి

కొండపి, జూన్ 13 : గడిచిన పదిరోజులుగా వర్షాలు, ఇతర కారణాలతో జిల్లాలో, మండలంలో నిలిచిపోయిన ఉపాధి హామీ పథకం కూలి పనులను వెంటనే చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కేజీ మస్తాన్, సంఘం మండల కార్యదర్శి పారాబత్తిన శ్రీనివాసులుఎంపీడీవో నాగమణికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవోను కలిసిన నాయకులు వేసవి కారణంగా ప్రస్తుతం వ్యవసాయ పనులు లేవని, కూలీలకు ఉపాధి పనులు చూపించాలని కోరారు.

బాలకృష్ణకు శుభాకాంక్షలు

కొండపి, జూన్ 13 : హిందూపురం శాసనసభ్యుడు, సినీ నటుడు నందమూరి బాలకృష్ణను గురువారం ఉదయం విజయవాడలోని ఫార్చ్యూన్ మురళీపార్క్ హోటల్‌లో రాష్ట్ర మంత్రి, కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దామచర్ల సత్యలు కలిసి శాలువా కప్పి, బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా బాలకృష్ణ మర్రిపూడిలో స్వామి విజయాన్ని కాంక్షిస్తూ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాటి స్మృతులను గుర్తు చేసుకున్నారు.

ఫోన్‌లో మాట్లాడుతూ..లారీని ఢీకొట్టి

బైకిస్టుకి తీవ్ర గాయాలు

అద్దంకిటౌన్, మే 13 : ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఫోన్ రావడంతో మాట్లాడుతూ లా రీని వెనుక వైపు ఢీకొన్న ఘటనలో వ్యక్తికి గా యాలయ్యాయి. గురువారం అద్దంకి- మేదరమెట్ల రోడ్డులో ధేనువకొండ పునరావాస కాలనీ సమీపంలో ఈ ఘటన జరిగింది. అద్దంకికి చెందిన గుంటూరు కరుణాకర్ ధేనుకొండ కాలనీ సమీపంలో ఉన్న కోల్డ్ స్టోరేజీ వద్దకి వచ్చి మరలా తన ద్వి చక్ర వాహనంపై అద్దంకి వెళ్తుండగా ఫోన్ రావడంతో మాట్లాడుతూ రోడ్డు ప క్కన ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో తలకు గాయాలు కాగా 108లో అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ELECTION NOTIFICATION

1.	Name of the Bank		: The Guntur Co- Operative Urban Bank Ltd., Guntur, 3/2, Brodipet, Guntur
2.	Date of Election		: 07-07-2024
3.	No. of Members to be elected to the Managing Committee		: 2 (Two) Only
4.	The area / constituency from which the members to be elected		: General
5.	Term of the members of the Managing Committee		: 2 Directors - Term - 5 years from – 07.08.2024 to 06.08.2029 (as per Section 21(3) of APMACS Act 1995)
6.	Qualifications if any specified in Bye-Laws for eligibility for Membership of the Managing Committee		: 1. Shall have been a voting member of the Bank for at least two years immediately preceding the year of election. : 2. Shall have attended the two general body meetings of the Bank held immediately preceding the elections. : 3. Shall not possess any disqualifications as specified in the Bye-Laws No.21 of the Bank and APMACS Act, 1995
7.	Receipt of Nominations	Date Place Time	: 25-06-2024 (Tuesday) : The Guntur Co.op. Urban Bank Ltd., Administrative Office, 3rd Floor, 3/2, Brodipet, Guntur : 09.00 AM to 01.00 PM
8.	Publication of list of Nominations received	Date Place Time	: 25-06-2024 (Tuesday) : Notice Board of The Guntur Co. op. Urban Bank Ltd., Administrative Office, 3rd Floor, 3/2, Brodipet, Guntur : After 02.00 PM
9.	Scrutiny of Nominations	Date Place Time	: 26.06.2024 (Wednesday) : The Guntur Co. op. Urban Bank Ltd., Administrative Office, 3rd Floor, 3/2, Brodipet, Guntur : 09.00 AM to 11.00 AM
10.	Publication of list of valid nominations	Date Place Time	: 26.06.2024 (Wednesday) : Notice Board of The Guntur Co. op. Urban Bank Ltd.,Administrative Office, 3rd Floor, 3/2, Brodipet, Guntur : After 12.00 Noon
11.	Withdrawal of Nominations	Date Place Time	: 27.06.2024 (Thursday) : The Guntur Co. op. Urban Bank Ltd., Administrative Office, 3rd Floor, 3/2, Brodipet, Guntur : 09.00 AM to 12.00 Noon
12.	Publication of final list of valid nominations and allotment of symbols.	Date Place Time	: 27.06.2024 (Thursday) : Notice Board of The Guntur Co.op. Urban Bank Ltd., Administrative Office, 3rd Floor, 3/2, Brodipet, Guntur : After 01.00 PM
13.	Date, Time and place of Poll	Date Place Time	: 07.07.2024 (Sunday) : Naveena School, 4th Line, Panduranga Nagar, Amaravathi Road, Guntur : 07.00 AM to12.00 Noon
14.	Counting of Votes	Date Place Time	: 07.07.2024 (Sunday) : Naveena School, 4th Line, Panduranga Nagar, Amaravathi Road, Guntur : From 02.00 P.M. onwards
15.	Declaration of Result		: Immediately after counting on 07-07-2024 (Sunday).

Place : GUNTUR
Date : 13-06-2024

(VEMULA PRASAD) Election Officer, The Guntur Co- Operative Urban Bank Ltd., 3/2, Brodipet, Guntur – 522 002. (Regd. Under AP Mutually Aided Co. op. Societies Act, 1995, Reg.No.431)

Note : 1) Nomination fee of Rs.10,000/- (Rupees Ten Thousand Only) to be paid by each candidate at the time of filing the nomination. 2) Candidates contesting in the election should not possess any disqualification as mentioned in the AP Mutually Aided Co. operative Societies Act, 1995 and also as per the bye-laws of the Bank. 3) Voters List is available with Election Officer. 4) Voters List is displayed in the Notice Board of the Bank at Administrative Office, 3rd Floor, 3/2, Brodipet,Guntur.
Note: 1) Voter has to bring any approved ID card viz., Adhaar card or PAN Card or Membership ID card issued by the bank for exercising vote.

నిబద్ధతకు గుర్తింపు!

- రాష్ట్ర మంత్రి వర్గంలో కొండపి ఎమ్మెల్యే డాక్టర్ స్వామికి చోటు
- నాడు దామచర్ల.. నేడు డోలా.. అక్కడి నుంచి ఇద్దరికి మంత్రిగా అవకాశం
- అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి.. ప్రతిపక్షంలో పోరాటంతో స్వామికి గుర్తింపు
- కలిసి వచ్చిన దామచర్ల సత్య పలుకుబడి
- కొండపి నియోజకవర్గంతో పాటు జిల్లా అంతటా హర్షాతిరేకాలు

ఒంగోలు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు నుంచే అత్యధిక రాజకీయ పరిశీలకులు, టీడీపీ శ్రేణులు ఊహించి విధంగానే కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామికి రాష్ట్రమంత్రి వర్గంలో స్థానం దక్కింది. కృష్ణా జిల్లా కేసరిపల్లి వద్ద బుధవారం అట్టహాసంగా ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం జరగ్గా అదే వేదికపై మంత్రిగా డాక్టర్ స్వామి ప్రమాణస్వీకారం చేశారు. రాజకీయాల్లో అడుగుపెట్టినప్పటి నుంచి నిబద్ధతతో పనిచేయడంతో పాటు ప్రతిపక్షంలో పోరాటతత్వం ఆయనకు గుర్తింపు తీసుకు రాగా యువనేత దామచర్ల సత్య పలుకుబడి కలిసి వచ్చింది. ఆ నియోజకవర్గం నుంచి గతంలో రెండుసార్లు దివంగత దామచర్ల ఆంజనేయులు ఉమ్మడి రాష్ట్రమంత్రిగా పనిచేశారు. అక్కడ 1994 నుంచి 2004 వరకు పదేళ్ళు ఎమ్మెల్యేగా పనిచేసిన ఆంజనేయులు రెండు విడతలు మంత్రిగా చంద్రబాబుతో పనిచేశారు. కాగా 2009లో కొండపి స్థానం ఎస్సీ రిజర్వుడ్ కేటగిరిలోకి వెళ్ళడంతో డాక్టర్ స్వామి పోటీ చేశారు.

స్వామిది కూడా దామచర్ల ఆంజనేయులు స్వగ్రామమైన టంగుటూరు మండలం తూర్పునాయుడు పాలెమే. అంతేకాక స్వర్గీయ ఆంజనేయులుకు అత్యంత ఆప్తుడుగా ఉండే గ్రామంలో ప్రముఖ సిద్ధాంతిగా పేరున్న కోటయ్య సిద్ధాంతి కుమారుడు స్వామి. ఆ రకంగా దామచర్ల కుటుంబానికి స్వామి కుటుంబానికి ఆత్మీయ సంబంధాలు ఉండగా 2009లో అక్కడి రిజర్వుడు స్థానం నుంచి దామచర్ల కుటుంబం ప్రోత్సాహంతో స్వామి రంగంలోకి వచ్చారు. విశాఖ మెడికల్‌కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేసిన అనంతరం కొండపి పీహెచ్‌సీలో డాక్టర్‌గా స్వామి పనిచేస్తుండగా ఆ ఉద్యోగానికి రాజీనామా చేసి 2009 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా కొండపి నుంచి పోటీ చేశారు.

ఆ ఎన్నికల్లో 5164 ఓట్లతో ఓటమి పాలైన డాక్టర్ స్వామి అనంతరం ఐదేళ్ళు నిరంతరం కార్యకర్తలతో మమేకమై పనిచేశారు. దీంతో 2014లో జరిగిన ఎన్నికల్లో తిరిగి 5440 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అప్పుడు నవ్యాంధ్రలో టీడీపీ ప్రభుత్వం ఏర్పడి ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు సారథ్యంలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి. ఆ సమయంలో ఎమ్మెల్యేగా ఉన్న డాక్టర్ స్వామి వివిధ పథకాల ద్వారా పెద్ద ఎత్తున నిధులు తెచ్చి అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రధానంగా తాగునీరు, సాగునీరు, రోడ్లు, విద్య, వైద్యం, గ్రామాల్లో అంతర్గత రోడ్లు, వివిధ భవన నిర్మాణాలు భారీగా చేశారు. అవన్నీ 2019 ఎన్నికల్లో కలిసి వచ్చాయి. ఆ ఎన్నికల్లో వైసీపీ రాష్ట్రంలో భారీ మెజార్టీతో అధికారంలోకి రాగా ఆ ప్రభంజనాన్ని తట్టుకొని స్వామి గెలుపొందారు. ఆ ఎన్నికల్లో టీడీపీకి 23 స్థానాలు లభించగా, 32 ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల్లో ఒక్క కొండపి రిజర్వుడ్ స్థానంలో మాత్రమే స్వామి గెలుపొందారు. ఆ రకంగా పార్టీలో గుర్తింపు వచ్చింది. ఇక 2019-24 మధ్య టీడీపీ శాసనసభ పక్ష విప్‌గా, పార్టీ ప్రధానకార్యదర్శిగా స్వామి పనిచేశారు. ఆ సమయంలో అటు శాసనసభలో, ఇటు జిల్లాలో పార్టీ తరుపున పోరాటంలో ముందున్నారు ప్రత్యేకించి వైసీపీ అరాచక పాలనలో విభిన్న అంశాలపై శాసనసభలో ప్రభుత్వాన్ని నిలదీయడంలో స్వామి ముందు వరుసలో నిలిచారు. ఆ రకంగా రాష్ట్రవ్యాప్తంగా పార్టీ నేతలలో గుర్తింపుతో పాటు అధినేత చంద్రబాబునాయుడు, యువనేత లోకేష్‌ల దృష్టిని ఆకర్షించారు. అంతేగాక జిల్లాలో స్థానికంగా వైసీపీ నుంచి ఎదురైన దాడులను ఎదురొడ్డి నిలబడటంతో పాటు బెదిరింపులు, ప్రలోభాలకు అదరక బెదరక ప్రతిపక్ష ఎమ్మెల్యేగా దాటిగా ధీటుగా పనిచేశారు. అలా నిబద్ధతతో పార్టీ అధినాయకత్వంతోనూ నిరంతరం పనిచేశారు. తనకు కొండంత అండగా నిలిచి అధికంగా రాజకీయంగా పూర్తి మద్దతు ఇస్తున్న దామచర్ల కుటుంబంలోని సీనియర్ టీడీపీ నేత పూర్ణచంద్రరావు ఆయన కుమారుడు ప్రస్తుత యువనేత దామచర్ల సత్యలతో కలిసిమెలిసి ముగ్గురిది ఒకటే మాటగా సాగారు. అటు అధినాయకత్వం వద్ద గుర్తింపు, ఇటు సత్య, పూర్ణచంద్రరావులతో సఖ్యతతో నియోజకవర్గ శ్రేణులు స్వామిని పూర్తిగా సొంతం చేసుకున్నాయి. ఇక యువనేత సత్య గత ఐదేళ్ళు కొండపి నియోజకవర్గంలో అనేక కార్యక్రమలను సక్సెస్ చేయడంతో పాటు ఎన్నికలలో పార్టీ క్యాడర్‌ను ఏకతాటిపై కదిలి పనిచేసేలా చేశారు. దీంతో తాజా ఎన్నికల్లో వైసీపీ అధినేత జగన్ కొండపిలో డాక్టర్ స్వామిని టార్గెట్ చేసి ఎలాగైనా ఓడించాలని మంత్రి సురేష్‌ను తెచ్చి పోటికి నిలిపినా 24,756 ఓట్ల భారీ మెజార్టీతో స్వామి ఘన విజయం సాధించారు. అలా ఒక వైపు నిబద్ధత, మరో వైపు అధినాయకత్వంలో ప్రత్యేక గుర్తింపు, ఇంకొక వైపు దామచనర్ల సత్య కుటుంబం అండదండలు, పార్టీ శ్రేణుల బలం అన్ని కలిసి వచ్చాయి. వీటితో పాటు ప్రస్తుత టీడీపీ రాష్ట్ర నాయకత్వంలో రాష్ట్ర స్థాయిలో యువనేతగా దామచర్ల సత్యకు ప్రత్యేక గుర్తింపు ఉంది. అధినేత చంద్రబాబు , యువనేత లోకేష్‌లతో నిత్య సంబంధాలు, ఉత్తరాంధ్రజోన్ ఇన్‌చార్జిగా పూర్తి కాలం పార్టీకి సేవలు అందించడంతో పాటు అధికంగా భారమైనా వెనకడుగు వేయకుండా పని చేస్తుండటంతో రాష్ట్ర పార్టీ ముఖ్యనేతలందరికి తలలో నాలుకలా ఎదిగారు. ప్రస్తుతం ఎస్సీ సామాజిక వర్గంలో మంత్రి పదవికి టీడీపీలో తీవ్ర స్థాయిలో పోటీ ఉన్నప్పటికి పార్టీ పట్ల, అధినాయకత్వంతో స్వామికి ఉన్న నిబద్ధతతో పాటు దామచర్ల సత్యకు పార్టీలో ఉన్న పలుకుబడి బాగా కలిసి వచ్చినట్లు తెలుస్తోంది. కాగా స్వామికి మంత్రి పదవితో కొండపితో పాటు జిల్లా వ్యాప్తంగా టీడీపీ శ్రేణులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు. స్వామి జిల్లాలోని అన్ని ప్రాంతాల నాయకులు, కార్యకర్తలతో సత్సంబంధాలు కొనసాగించడం అందుకు కారణంగా కనిపిస్తున్నది.

మంత్రులను కలిసిన జిల్లా నేతలు

డాక్టర్ స్వామి, గొట్టిపాటిలకు శుభాకాంక్షలు

టంగుటూరు, జూన్ 13 : రాష్ట్ర ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, గనుల శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌లను గురువారం టంగుటూరు టీడీపీ నాయకులు కలసి శుభాకాంక్షలు తెలిపారు. స్వామిని వీరు విజయవాడలో ఉన్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య గృహంలోనూ, రవిని చిలకలూరిపేటలోని ఆయన స్వగృహంలో కలిశారు. కొత్తగా చంద్రబాబు మంత్రివర్గంలో మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన వీరిరువురికి వారంతా శుభాకాంక్షలు తెలిపారు. మంత్రులను కలసిన వారిలో మాజీ సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు, డాక్టర్ బెల్లం సునీల్, మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, మండల పార్టీ అధ్యక్షుడు కామని విజయకుమార్, సీనియర్ నాయకులు బెజవాడ వెంకటేశ్వర్లు, మక్కెన హరి బాబు, కుందేటి వెంకట్రావు ఉన్నారు.



మంత్రి స్వామిని కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ టంగుటూరు మండల నాయకులు

మంత్రి డాక్టర్ స్వామి, దామచర్ల సత్యలకు శుభాకాంక్షలు

రాష్ట్ర ఎస్సీ సంక్షేమ శాఖమంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామిని, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్యలను మండలంలోని కొణిజేడు టీడీపీ నాయకులు గురువారం కలిశారు. వీరు విజయవాడలోని సత్య గృహంలో స్వామి, సత్యలకు గజమాల వేసి శాలువా కప్పి సత్కరించారు. నేతలను కలిసిన వారిలో నాయకులు రామా గోపి, పొనుగుపాటి కళ్యాణ్, మందపాటి సురేష్, మక్కెన రమేష్, బైనేని శ్రీను, బైనేని వేణు, మందపాటి కోటేశ్వరరావు ఉన్నారు.

సముద్రతీరంలో గస్తీ

రామాపురం(చీరాలటౌన్), జూన్ 13 : వాడరేవు, రామాపురంలో గు రు వారం పోలీసులు గస్తీ చేపట్టారు. ఇటీవల కాలంలో వరుసగా ఇద్దరు విద్యార్థులు మునిగేందుకు వచ్చి మృత్యువాత పడడంతో ఆంధ్రజ్యోతిలో బుధ వారం సముద్రతీర పర్యవేక్షణపై కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఈపూరు పాలెం ఎస్సై శివకుమార్ సిబ్బందితో ఆ ప్రాంతా ల్లో కలియ తిరిగారు. పర్యాటకులకు పలు సూచనలు, హెచ్చరికలు జారీ చేశారు. మద్యం సేవించడం, డేంజర్ జోన్‌లలో ఈతకు దిగవద్దని సూ చించారు. దీంతో పర్యాటకులు అప్రమత్తమై జాగ్రత్తలు తీసుకున్నారు.



తీరంలో పర్యటిస్తున్న ఎస్ఐ శివకుమార్

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతి

- తొలుత ఆటో ఢీకొట్టడంతో రోడ్డుపై పడిన దంపతులు
- ఆపై వారి మీదుగా లారీ ఎక్కడంతో దుర్మరణం
- కూతురు ఇంటికి వెళ్లి వస్తుండగా ఘటన

మేదరమెట్ల, జూన్ 13 : జాతీయ రహదారిలో తిమ్మనపాలెం వద్ద పాల ఆటో ఢీకొట్టి కిందపడిన దంపతులపై లారీ ఎక్కడంతో భార్యాభర్తలు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. గురువారం పల్నాడు జిల్లా రొంపిచర్ల గ్రామానికి చెందిన బత్తుల కొండలు (49), బత్తుల లక్ష్మి (41) ఇంకొల్లు మండలం దుద్దుకూరులో ఉన్న కుమార్తె విజయలక్ష్మిని చూడడానికి వెళ్లి తిరిగి వస్తు ఉండగా ఈ ప్రమాదం జరిగింది. నాగులుప్పలపాడులో తిమ్మనపాలెం వద్ద హైవే ఎక్కిన వీరి బైక్‌ను పాల ఆటో పక్కనే తగలడంతో ఇద్దరూ పడిపోయారు. అదే సమయంలో మేదరమెట్ల ప్రైవేట్ వెంచర్‌లో పార్కింగ్ టైల్స్ దించి గ్రోత్ సెంటర్ వైపు ఆపోజిట్ రోడ్డులో వస్తున్న లారీ వీరి శరీరాలపై నుంచి ఎక్కింది. దీంతో వారు అక్కడికి అక్కడే మృతి చెందారు. లారీ టైర్ల కింద పడి మృతి చెందిన వారి మృతదేహాలను చూడడానికి కూడా బయంగా ఉంది. కృష్ణా జిల్లా పమిడిముక్కల మండలం మంటాడా గ్రామానికి చెందిన కంచెర్ల పల్లి మాధవరావు ఈ లారీని నడుపుతున్నాడు. కొండలు దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తెకు వివాహం కాగా చిన్న కూతురు వీరి వద్దనే ఉంది. దుద్దుకూరులో కొలుపులు చూడడానికి కూతురు వద్దకు వచ్చి మృతిచెందారని బంధువులు కన్నీరు మున్నీరవుతున్నారు. అద్దంకి రూరల్ సీఐ శివరామకృష్ణ రెడ్డి, కొరిశపాడు ఎస్ఐ శివయ్య సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న అద్దంకి రూరల్ సీఐ శివరామకృష్ణారెడ్డి

మంత్రి గొట్టిపాటికి అపూర్వ స్వాగతం

- తొలిసారిగా సొంత ఊరు యద్దనపూడి రాక
- తండ్రి, పెదనాన్న సమాధుల వద్ద నివాళి

యద్దనపూడి (మార్టూరు) జూన్ 13 : అద్దంకి ఎమ్మెల్యే, మంత్రి గొట్టిపాటి రవి కుమార్ దంపతులకు గురువారం యద్దనపూడి గ్రామంలో పార్టీనాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. యద్దనపూడి గ్రామానికి చెందిన రవికుమార్ ఎమ్మెల్యేగా 4వసారి విజయం సాధించారు. అంతకు ముందు 2004లో మార్టూరు నియోజకవర్గం నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా అసెంబ్లీలోకి అడుగుపెట్టారు. తాజాగా ఆయన ఐదోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించడంపై యద్దనపూడి మండల ప్రజలు ఆనందంలో మునిగిపోయారు. బుధవారం మంత్రిగా రవికుమార్ ప్రమాణం చేయడంతో కేడర్‌తోపాటు అభిమానులు స్నేహితులు, బంధువులు ఆనందంలో ఉన్నారు. మా ర్టూరు నియోజకవర్గం ఉన్నపుడు యద్దనపూడి గ్రామానికి చెందిన స్వర్గీయ మాజీ మంత్రి గొట్టిపాటి హనుమంతరావు టీడీపీ హయాంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే మంత్రిగా పని చేశారు. ఆయన మరణాంతరం తిరిగి రవికుమార్‌కు చంద్రబాబు హయాంలోనే మంత్రిపదవి దక్కడం హర్షనీయం. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే యద్దనపూడి మండలంపై ప్రత్యేక దృష్టి ఉన్న గొట్టిపాటి మంత్రి అయ్యాక భార్య ఝూన్సీ, ఇద్దరు కుమారులు హర్షవర్ధన్, మహేష్‌తో గ్రామానికి రావడంతో గ్రామస్థుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. రవికుమార్ బాబాయి మాజీ ఎంపీపీ గొట్టిపాటి రాం బాబు దంపతులు గ్రామస్థులతో ఎదురెళ్లి జడ్పీ హైస్కూల్ వద్ద రవికుమార్ దంపతులకు ఘన స్వాగతం పలికారు. అలాగే మహిళలు పూలతో స్వాగతించగా, యువకులు బాణసంచా కాల్చి మంత్రిని గ్రామంలోకి తో డ్కొని వెళ్లారు.



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి గొట్టిపాటి

నాన్న, పెదనాన్న సమాధుల వద్ద నివాళి

యద్దనపూడి వచ్చిన మంత్రి గొట్టిపాటి రవికుమార్ గ్రామ శివారులోని నాన్న శేష గిరిరావు, పెదనాన్న మాజీ మంత్రి గొట్టిపాటి హనుమంతరావు ఘాట్‌ల వద్దకు వెళ్లి నివాళులర్పించారు. వారితోపాటు గొట్టిపాటి రాంబాబు దంపతులు, స్వర్గీయ గొట్టిపాటి కిషోర్ తనయుడు కమల్ కిషోర్ (బాబీ) తదిరుతరులు నివాళులర్పించారు. అనంతరం రవికుమార్ యద్దనపూడి ప్రధాన సెంటర్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి, తర్వాత హనుమంతరావు విగ్రహానికి ఆయన కుమారుడు సోదరసమానుడైన స్వర్గీయ మాజీ ఎమ్మెల్యే గొట్టిపాటి నరసయ్య విగ్రహాలకు రవికుమార్ పూలమాలవేసి నివాళులర్పించారు.

అందరినీ ఆప్యాయంగా పలకరించిన మంత్రి

మంత్రిగా తొలిసారి యద్దనపూడి వచ్చిన గొట్టిపాటిని అభినందించేందుకు గన్నవరం, పోలూరు, యనమదల, చింతపల్లిపాడు, పూనూరు తదితర గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు తరలివచ్చారు. వారిలో కొంతమంది గొట్టిపాటిని శాలువాలు కప్పి అభినందించారు. అద్దంకి, బల్లికురవ, జెపంగులూరు, మార్టూరు మండలాలనుంచి నాయకులు వచ్చి మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. వారందరినీ రవికుమార్ ఆప్యాయంగా పలకరిస్తూ అందరికీ ధన్యవాదాలు తెలిపారు. మండలాన్ని అభివృద్ధి చేయాలని పార్టీ శ్రేణులు, ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

గూడు దగ్ధమై.. నిరాశ్రయులై..


నిరాశ్రయులైన మరియమ్మ, ఆమె కుటుంబం

గిద్దలూరు, జూన్ 13 : రాచర్ల మండలం ఆకవీడు గ్రామంలో రెండు రోజుల క్రితం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మరియమ్మ అనే మహిళ పూరిగుడిసె కాలిపోయింది. ఉన్న ఒక్క గుడిసె కాలిపోవడంతో మరియమ్మతో పాటు ఆమె పిల్లలకు నిలువ నీడ లేకుండా ఉంది. ఇంట్లో ఉన్న ప్రతి వస్తువు, పిల్లల కోసం దాచుకున్న డబ్బు అగ్నికి ఆహుతయ్యాయి. భర్త కొద్దిరోజుల క్రితం మృతిచెందగా ముగ్గురు కుమార్తెలు, కుమారుడిని బతికించుకునేందుకు ఆమె కూలీ పనులు చేస్తూ ఇళ్లు నడిపిస్తోంది. అగ్నిప్రమాదం ద్వారా పూర్తిగా రోడ్డున పడ్డామని, దాతలు సహకరించాలని మరియమ్మ కోరారు.

గుండెపోటుతో కౌన్సిలర్ మృతి


ప్రసాద్

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 13: పట్టణంలోని 23వ వార్డు కౌన్సిలర్ దూదేకుల ఖలీల్ అలియాస్ ప్రసాద్(57) గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. 2021 మున్సిపల్ ఎన్నికలలో వైసీపీ నుంచి 23వ వార్డు కౌన్సిలర్‌గా ప్రసాద్ గెలుపొందారు. ఈయన మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ నాసర్ సాహెబ్‌కు అల్లుడు. ప్రసాద్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రసాద్ మృతదేహాన్ని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, టీడీపీ నాయకులు కందుల రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కేపీ నాగార్జునరెడ్డి, అన్నా రాంబాబు, మున్సిపల్ ఛైర్మన్ బాలమురళీకృష్ణ పలువురు కౌన్సిలర్లు, పురప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు. స్థానిక కంభం కూడలిలోని ముస్లిం ఖబరస్థాన్‌లో ప్రసాద్ అంత్యక్రియలు నిర్వహించారు.

విత్తన దుకాణాల్లో తనిఖీ

- రూ.5లక్షల విలువైన విత్తనాలు సీజ్


తనిఖీ చేస్తున్న ఏడీఏ

ఎర్రగొండపాలెం, జూన్ 13 : ఎర్రగొండపాలెం మండలం కేంద్రంలో దర్శి సబ్‌డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు కె బాలాజీనాయక్ గురువారం విత్తనాల దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేశారు. తనిఖీ చేసిన రెండు దుకాణాల్లో అనుమతి పత్రాలు లేని రూ.5లక్షల విలువైన విత్తనాల విక్రయాలను నిలిపివేశారు. విత్తనాల కొనుగోలు చేసిన ప్రతిరైతుకు బిల్లు ఇవ్వాలని సూచించారు. ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తే వారిపై చట్టప్రకారం కేసులు నమోదు చేస్తామని ఏడీఏ హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఏవో కే.శేషిరెడ్డి పాల్గొన్నారు.

అధికారులకు టీడీపీ నేతల ధన్యవాదాలు

బేస్తవారపేట,జూన్13: గిద్దలూరు నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించినందుకు, అధికారులు టీడీపీ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ప్రజలకు ప్రశాంత వాతవరణంలో ఓటుహక్కు వినియోగించుకునేందుకు అధికారులు శ్రమించినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వేశపోగు బాలు, వేశపోగు భరత్, పూనూరు జగన్మోహన్‌రెడ్డి, బి.సుబ్బరత్నం, అవ్వారి రమణ, దూదెకుల మీరా, సుల్తాన్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువతను మోసం చేసిన జగన్


మాట్లాడుతున్న గౌస్‌బాష

పొదిలి, జూన్ 13 : యువతను గత వైసీపీ ప్రభుత్వం తీవ్రంగా మోసం చేసిందని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి గౌస్ ఆరోపించారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చానని జగన్ అబద్ధాలతో యువతను మోసం చేశాడని విమర్శించారు. పాదయాత్రలో ఇచ్చిన ఏ ఒక్కహామీని జగన్ నెరవేర్చలేక పోయాడన్నారు. ప్రశ్నించే ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థులను భయాందోళనకు గురిచేశాడని విమర్శించారు. చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలో భాగంగా ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే మొట్టమొదటి సంతకం మెగా డీఎస్సీపై చేయడం శుభపరిణామమన్నారు.

విశ్వభారతి పాఠశాలకు అనుమతులు లేవు

- ఎంఈవో వెంకటేశ్వర్లు

గిద్దలూరు టౌన్, జూన్ 13 : పట్టణంలోని శ్రీనివాస థియేటర్ సమీపంలోని విశ్వభారతి ఉన్నత పాఠశాలకు అనుమతులు లేవని మండల విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ ఆదర్శవర్ధన్ ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఆ పాఠశాలను నిర్వహిస్తున్నారన్నారు. ఆ పాఠశాలకు 6 నుంచి 10వ తరగతి వరకు అనుమతులు లేకుండా నిర్వహించడానికి ఎటువంటి అనుమతులు లేవన్నారు. నగర పంచాయతీ శానిటరి ధ్రువీకరణ పత్రం, ఫైర్ సర్టిఫికేట్, ఎన్‌వోసీ లేదని, గతంలో అధికారులు కూడా విచారించి ఆ మేరకు నివేదిక గుంటూరు ఆర్‌జేడీకి అధికారులు నివేదించారన్నారు. పాఠశాల నిర్వహించడానికి అనుమతులు లేవని నిర్ధారించినట్లు తెలిపారు.

కేన్సర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం



మాట్లాడుతున్న డాక్టర్ సావిత్రి

మార్కాపురం రూరల్, జూన్ 13: కేన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మార్కాపురం ప్రభుత్వ వైద్య కళాశాల వైద్యురాలు డాక్టర్ సావిత్రి సూచించారు. జనరల్ హాస్పిటల్‌లో డివిజన్‌లో పనిచేస్తున్న వైద్య సిబ్బందికి కేన్సర్ వ్యాధి లక్షణాలు, వాటి నివారణ చర్యలపై గురువారం శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. రొమ్ము, గర్భాశయ ముఖద్వార కేన్సర్లు, నోటి క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పద్మావతి, డాక్టర్ పి.సావిత్రి, ఎన్‌పీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ భాగీరథి, డాక్టర్ సుబ్బారెడ్డి, ఆంకాలజీ యూనిట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ప్రసన్నా రాణి, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

మట్టి నమూనా సేకరణపై అవగాహన


మట్టినమోనాలు సేకరిస్తున్న అధికారులు

ఎర్రగొండపాలెం, జూన్ 13 : నియోజకవర్గంలోని రైతుభరోసా కేంద్రాల సిబ్బందికి డిజిటల్ గ్రీన్ ఈ మిర్చా సంస్థ ఆధ్వర్యంలో గురువారం మట్టి నమూనా సేకరణపై శిక్షణ ఇచ్చారు. మట్టి నమూనాలను సేకరించే విధానంపై, దాని ప్రాముఖ్యతను వివరించారు. మిరప పంట సాగులో మెళకువలపై వ్యవసాయ సిబ్బంది మొబైల్ ఫోన్ల ద్వారా ఎప్పటిప్పుడు రైతు భరోసా కేంద్రాల సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. ఈ-మిర్చా సంస్థ మిరపతోటల్లో కాయలు కోసిన తర్వాత కాయల్లో నాణ్యత తగ్గకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ ఇస్తుందన్నారు. మట్టి పరీక్షల నివేదికలు తెలుసుకునేందుకు రైతులు రూ.50 చెల్లిస్తే, సెల్‌ఫోన్ ద్వారా నివేదికలు పంపుతామన్నారు. జనరల్ కేటగిరిలకు రూ.50, ఎస్సీ, ఎస్టీ రైతులకు ఉచితంగా సమాచారం తెలియజేస్తామన్నారు. డిజిటల్ గ్రీన్ ఈ-మిర్చా సంస్థ ప్రతినిధి చంద్రశేఖర్, ఉద్యానవన అధికారి ఆదిరెడ్డి, ఐదు మండలాల రైతు భరోసా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

అధ్వానంగా పాములపల్లి రహదారి

రాకపోకలకు తీవ్ర అవస్థలు



గిద్దలూరు-పాములపల్లి రోడ్డు దృశ్యాలు

గిద్దలూరు, జూన్ 13 : గిద్దలూరు మున్సిపాలిటీలో భాగమైన పాములపల్లి గ్రామానికి వెళ్లే తారురోడ్డు అధ్వానంగా తయారైంది. రెండు కిలోమీటర్ల దూరానికి 100కు పైగా గుంతలు ఉన్నాయి. దీంతో రోడ్డు దుస్థితి అర్థం చేసుకోవచ్చు. తారురోడ్డులో చాలాభాగం గుంతలుపడింది. కొన్ని చోట్ల తారులేచి, మరికొన్ని చోట్ల రాళ్లు పైకి తేలి ఉన్నాయి. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా తయారైంది. మోటార్ సైకిళ్లు, ఆటోలు వెళ్లే సమయంలో రాళ్లు ఎగిరి గ్రామానికి నడిచి వెళ్లే వారికి తగిలి గాయపడుతున్నారు. అధ్వానంగా రోడ్డు ఉండడంతో బాడుగ ఎక్కువ ఇస్తామన్నా, ఆటోలు కూడా గ్రామానికి రావడం లేదు. నాడు వైసీపీ ప్రభుత్వం కనీసం గుంతలు పూడ్చి ఉంటే ఆ గుంతలు పెద్దవి కాకుండా ఉండేవని, తారు రోడ్డు ధ్వంసం కాకుండా ఉండేదని గ్రామస్థులు చెబుతున్నారు. అధికారులు, పాలకులు ధ్వంసమైన ఈ రోడ్డుకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సమష్టి కృషితోనే ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణ

- కలెక్టర్ దినేష్‌కుమార్

కొత్తపట్నం(ఒంగోలునగరం) జూన్ 13: సమష్టి కృషితోనే జిల్లాలో ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఆర్వోలు, నోడల్ ఆఫీసర్లు, ఏఆర్వోలు, ఇతర శాఖల జిల్లా అధికారులు, సిబ్బందితో ఆయన గురువారం కొత్తపట్నంలోని నల్లూరిగార్డెన్స్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సార్వత్రిక ఎన్నికలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించామని, అది అందరి కృషి వల్లే సాధ్యపడిందన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన పగడ్బందీ ప్రణాళికను రూపొందించటం, దాని అమలుకు పర్యవేక్షించటం ద్వారా ఎన్నికలను విజయవంతంగా నిర్వహించినట్లు ఆయన చెప్పారు. జిల్లా స్థాయి మొదలుకుని గ్రామస్థాయి వరకు అధికారులకు సిబ్బందికి ఆ దిశగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించటం ద్వారా ఎలాంటి ఆటంకాలు లేకుండా ఎన్నికల ప్రక్రియ ముగియటంతో పాటు పోలింగ్ శాతంలో రాష్ట్రంలోనే ప్రకాశం జిల్లా ప్రథమస్థానంలో నిలిచిందన్నారు. అనంతరం ఎస్పీ గరుడ్‌సుమిత్‌సునీల్ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది, జిల్లా అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేయటం వల్ల శాంతిభద్రతలకు ఎలాంటి ఆటంకం కలుగలేదన్నారు. అనంతరం విధుల్లో పాల్గొన్న అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జేసీ గోపాలకృష్ణ, మార్కాపురం సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో బీజేపీ నాయకుల తనిఖీ


హెచ్ఎంను సమస్యను అడుగుతున్న బీజేపీ నేతలు

గిద్దలూరు టౌన్, జూన్ 13 : ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో బీజేపీ నాయకులు గురువారం ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించారు. పట్టణంలోని జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు భవనాశి వెంకటరామాంజనేయులు బీజేపీ జిల్లా ఎస్సీమోర్చ ప్రధాన కార్యదర్శి మట్టిమల్ల పుల్లయ్య, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి మునగనూరి రామకృష్ణ పరిశీలించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు అందు తున్న పుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకం గురించి ఆరా తీశారు. విద్యార్థులకు అందుతున్న భోజనాన్ని ప్రధాన మంత్రి పోషణ్ అభియాన్‌గా మార్చినట్లు తెలిపారు. విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని ఎంఈవో జింకా వెంకటేశ్వర్లును కలిసి వారు విజ్ఞప్తి చేశారు.

దోర్నాలలో ట్రాఫిక్ సమస్య పరిష్కారమయ్యేనా..?

- ప్రధాన కూడలిలో ఆటోలు, తోపుడుబండ్లు
- రోడ్డు ఆక్రమించి వ్యాపార నిర్వహణ
- పట్టించుకోని అధికారులు


తిమ్మాపురం వెళ్లే రహదారిలో నిలిచిన రాకపోకలు

పెద్ద దోర్నాల, జూన్ 12: దోర్నాలలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు తీవ్రమవుతోంది. దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా తిమ్మాపురం వెళ్లే దారి ఎప్పుడూ రద్దీగా ఉంటూ కాలుతీయలేని పరిస్థితి నెలకొంది. ముఖ్యమైన వస్తువులు లభించే వ్యాపార దుకాణాల ఈ వైపునే ఉండడంతో పాటు తిమ్మాపురం వెళ్లాల్సిన ప్రధాన రహదారి కావడంతో ఎప్పుడూ ప్రజలు తిరుగుతూ ఉంటారు. విద్యార్థులు అధిక సంఖ్యల్లో పాఠశాలలకు వెళ్తూ నడిచేందుకు కూడా వీలుకాని పరిస్థితులు నెలకొంటాయి. కర్నూలు-గుంటూరు జాతీయ రహదారి అయినా వ్యాపార షాపుల ముందు తోపుడు బండ్లు, పల్లెలకు వెళ్లే ఆటోలు నడి రోడ్డుపై సంచరిస్తుండడంతో యాత్రికులు, స్థానిక ప్రజల అవస్థలు వర్ణనాతీతం. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో ఆక్రమణదారులు ఇష్టానురీతిలో వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వ్యాపార షాపుల ముందు ఆక్రమితులను తొలగించాలని, రోడ్డుపై ఎక్కడ పడితే అక్కడ ఆటోలు, తోపుడు బండ్లు నిలపకుండా చూడాలని ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

సాగు మొదలు

గిద్దలూరు, జూన్ 13 : రాష్ట్రంలోని రుతుపవనాలు సకాలంలో ప్రవేశించడంతో వర్షాలు పడుతున్నాయి. దీంతో పొలాలు పదునెక్కాయి. రైతులు పలుపంటల సాగుకు సన్నద్ధమవుతున్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలలో రైతులు నూము సాగు మొదలుపెట్టారు. ఆముదం, కొర్ర, సజ్జలు సాగు చేసుకునేందుకు వీలుగా విత్తనాలను, ఎరువులను సిద్ధం చేసుకుంటున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో గిద్దలూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో ప్రధానంగా కంది, పత్తి పంటలు సాగు చేస్తారు. అయితే పత్తికి ధర తక్కువగా ఉండడంతో ఈ పంట సాగు చేసేందుకు రైతులు ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది. కంది పైరు కూడా ఎక్కువ మొత్తంలో సాగయ్యే అవకాశం ఉంది. కంది, పత్తి పంటల సాగు ఈనెలాఖరు నుంచి మొదలు కానుండగా వాటిని సాగు చేయదలచుకున్న రైతులు తమ పొలాలను సాగుకు సిద్ధం చేసుకుంటున్నారు. రుతుపవనాల కారణంగా కురుస్తున్న వర్షాలతో సాగులో ఉన్న ఆకుకూరల పంటలకు కూడా జీవం పోస్తోంది. గుండ్లమోటు ప్రాజెక్టుకు అడవిలో పడిన నీరు చేరుతుండగా చుట్టుపక్కల ప్రాంతాల్లో ఒట్టిపోయిన బోర్లలో భూగర్భజలాలు పెరిగి అరకొర నీరు రావడం మొదలైంది. సగిలేరు, గుండ్లకమ్మ నదులకు కూడా నల్లమల అడవిలో కురిసిన వర్షం వలన కొద్దికొద్దిగా నీరు చేరడం మొదలైంది.

జనసేనానిని కలిసిన సాధిక్



మార్కాపురం, జూన్ 13: జనసేన జిల్లా కార్యదర్శి సయ్యద్ సాధిక్ గురువారం ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌ను మంగళ గిరిలోని రాష్ట్ర పార్టీ కార్యాల యంలో కలిశారు. రాష్ట్రమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన పవన్ కల్యాణ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మార్కాపురం నియో జకవర్గ ప్రధాన సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు.

పాఠశాలలకు కిట్లు అందజేత


పాఠశాలలకు తరలిస్తున్న కిట్స్

పెద్ద దోర్నాల, జూన్ 13: మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యా యులకు విద్యాకానుకల కిట్లను ఎంఈవో మస్తాన్‌నాయక్ గురువారం అందజే శారు. 2024-25 విద్యా సంవత్సరానికిగానూ పాఠశాలలు పునః ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులకు అందించే స్కూల్ బ్యాగు, బూట్లు, పుస్తకాలు తదితరా లతో కూడిన కిట్లను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. త్వరలోనే విద్యార్థులకు అందించనున్నట్లు ఎంఈవో మస్తాన్ నాయక్ తెలిపా రు. కార్యక్రమంలో ఎంఈవో కొండలరావు, ప్రధానోపాధ్యాయులు మహంత్ నాయక్, రామకృష్ణా నాయక్,ఉపాధ్యాయులు శ్రీనివాస్, సీఆర్‌పీలు కోడి సాయి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో వస్తువుల ధ్వంసంపై ఫిర్యాదు

నాగులుప్పలపాడు, జూన్ 13 : ప్రభుత్వ పాఠశాలలోని తలుపులు, వాషింగ్ షీట్స్‌ను ధ్వంసం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని అమ్మనబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం సత్యవతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాఠశాలలోని బాత్‌రూం తలుపు, మూడు వాషింగ్ షీట్స్‌ను గుర్తు తెలియని వ్యక్తులు వేసవి సెలవులలో పగులగొట్టారు. దీంతో చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నిబద్ధతకు గుర్తింపు!

- రాష్ట్ర మంత్రి వర్గంలో కొండపి ఎమ్మెల్యే డాక్టర్ బాలవీరాంజనేయ స్వామికి చోటు
- ప్రతిపక్షంలో పోరాటంతో గుర్తింపు
- కలిసి వచ్చిన దామచర్ల సత్య పలుకుబడి

ఒంగోలు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు నుంచే అత్యధిక రాజకీయ పరిశీలకులు, టీడీపీ శ్రేణులు ఊహించి విధంగానే కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామికి రాష్ట్రమంత్రి వర్గంలో స్థానం దక్కింది. కృష్ణా జిల్లా కేసరిపల్లి వద్ద బుధవారం అట్టహాసంగా ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం జరగ్గా అదే వేదికపై మంత్రిగా డాక్టర్ స్వామి ప్రమాణస్వీకారం చేశారు. రాజకీయాల్లో అడుగు పెట్టినప్పటి నుంచి నిబద్ధతతో పనిచేయడంతో పాటు ప్రతిపక్షంలో పోరాటతత్వం ఆయనకు గుర్తింపు తీసుకురాగా యువనేత దామచర్ల సత్య పలుకుబడి కలిసి వచ్చింది. ఆ నియోజకవర్గం నుంచి గతంలో రెండుసార్లు దివంగత దామచర్ల ఆంజనేయులు ఉమ్మడి రాష్ట్రమంత్రిగా పనిచేశారు. అక్కడ 1994 నుంచి 2004 వరకు పదేళ్ళు ఎమ్మెల్యేగా పనిచేసిన ఆంజనేయులు రెండు విడతలు మంత్రిగా చంద్రబాబుతో పనిచేశారు. కాగా 2009లో కొండపి స్థానం ఎస్సీ రిజర్వ్‌డ్ కేటగిరిలోకి వెళ్ళడంతో డాక్టర్ స్వామి పోటీ చేశారు. స్వామిది కూడా దామచర్ల ఆంజనేయులు స్వగ్రామమైన టంగుటూరు మండలం తూర్పునాయుడు పాలెమే. అంతేకాక స్వర్గీయ ఆంజనేయులుకు అత్యంత ఆప్తుడుగా ఉండే గ్రామంలో ప్రముఖ సిద్ధాంతిగా పేరున్న కోటయ్య సిద్ధాంతి కుమారుడు స్వామి. ఆ రకంగా దామచర్ల కుటుంబానికి స్వామి కుటుంబానికి ఆత్మీయ సంబంధాలు ఉండగా 2009లో అక్కడి రిజర్వుడు స్థానం నుంచి దామచర్ల కుటుంబం ప్రోత్సాహంతో స్వామి రంగంలోకి వచ్చారు. విశాఖ మెడికల్‌కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేసిన అనంతరం కొండపి పీహెచ్‌సీలో డాక్టర్‌గా స్వామి పనిచేస్తుండగా ఆ ఉద్యోగానికి రాజీనామా చేసి 2009 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా కొండపి నుంచి పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో 5164 ఓట్లతో ఓటమి పాలైన డాక్టర్ స్వామి అనంతరం ఐదేళ్లు నిరంతరం కార్యకర్తలతో మమేకమై పనిచేశారు. దీంతో 2014లో జరిగిన ఎన్నికల్లో తిరిగి 5440 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అప్పుడు నవ్యాంధ్రలో టీడీపీ ప్రభుత్వం ఏర్పడి ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు సారథ్యంలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి. ఆ సమయంలో ఎమ్మెల్యేగా ఉన్న డాక్టర్ స్వామి వివిధ పథకాల ద్వారా పెద్ద ఎత్తున నిధులు తెచ్చి అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రధానంగా తాగునీరు, సాగునీరు, రోడ్లు, విద్య, వైద్యం, గ్రామాల్లో అంతర్గత రోడ్లు, వివిధ భవన నిర్మాణాలు భారీగా చేశారు. అవన్నీ 2019 ఎన్నికల్లో కలిసి వచ్చాయి. ఆ ఎన్నికల్లో వైసీపీ రాష్ట్రంలో భారీ మెజార్టీతో అధికారంలోకి రాగా ఆ ప్రభంజనాన్ని తట్టుకొని స్వామి గెలుపొందారు. ఆ ఎన్నికల్లో టీడీపీకి 23 స్థానాలు లభించగా, 32 ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల్లో ఒక్క కొండపి రిజర్వ్‌డ్ స్థానంలో మాత్రమే స్వామి గెలుపొందారు. ఆ రకంగా పార్టీలో గుర్తింపు వచ్చింది. ఇక 2019-24 మధ్య టీడీపీ శాసనసభ పక్ష విప్‌గా, పార్టీ ప్రధానకార్యదర్శిగా స్వామి పనిచేశారు. ఆ సమయంలో అటు శాసనసభలో, ఇటు జిల్లాలో పార్టీ తరుపున పోరాటంలో ముందున్నారు ప్రత్యేకించి వైసీపీ అరాచక పాలనలో విభిన్న అంశాలపై శాసనసభలో ప్రభుత్వాన్ని నిలదీయడంలో స్వామి ముందు వరుసలో నిలిచారు. ఆ రకంగా రాష్ట్రవ్యాప్తంగా పార్టీ నేతలలో గుర్తింపుతో పాటు అధినేత చంద్రబాబునాయుడు, యువనేత లోకేష్‌ల దృష్టిని ఆకర్షించారు. అంతేగాక జిల్లాలో స్థానికంగా వైసీపీ నుంచి ఎదురైన దాడులను ఎదురొడ్డి నిలబడటంతో పాటు బెదిరింపులు, ప్రలోభాలకు అదరక బెదరక ప్రతిపక్ష ఎమ్మెల్యేగా దాటిగా ధీటుగా పనిచేశారు. అలా నిబద్ధతతో పార్టీ అధినాయకత్వంతోనూ నిరంతరం పనిచేశారు. తనకు కొండంత అండగా నిలిచి అధికంగా రాజకీయంగా పూర్తి మద్దతు ఇస్తున్న దామచర్ల కుటుంబంలోని సీనియర్ టీడీపీ నేత పూర్ణచంద్రరావు ఆయన కుమారుడు ప్రస్తుత యువనేత దామచర్ల సత్యలతో కలిసిమెలిసి ముగ్గురిది ఒకటే మాటగా సాగారు. అటు అధినాయకత్వం వద్ద గుర్తింపు, ఇటు సత్య, పూర్ణచంద్రరావులతో సఖ్యతతో నియోజకవర్గ శ్రేణులు స్వామిని పూర్తిగా సొంతం చేసుకున్నాయి. ఇక యువనేత సత్య గత ఐదేళ్లు కొండపి నియోజకవర్గంలో అనేక కార్యక్రమలను సక్సెస్ చేయడంతో పాటు ఎన్నికలలో పార్టీ క్యాడర్‌ను ఏకతాటిపై కదిలి పనిచేసేలా చేశారు. దీంతో తాజా ఎన్నికల్లో వైసీపీ అధినేత జగన్ కొండపిలో డాక్టర్ స్వామిని టార్గెట్ చేసి ఎలాగైనా ఓడించాలని మంత్రి సురేష్‌ను తెచ్చి పోటికి నిలిపినా 24,756 ఓట్ల భారీ మెజార్టీతో స్వామి ఘన విజయం సాధించారు. అలా ఒక వైపు నిబద్ధత, మరో వైపు అధినాయకత్వంలో ప్రత్యేక గుర్తింపు, ఇంకొక వైపు దామచనర్ల సత్య కుటుంబం అండదండలు, పార్టీ శ్రేణుల బలం అన్ని కలిసి వచ్చాయి. వీటితో పాటు ప్రస్తుత టీడీపీ రాష్ట్ర నాయకత్వంలో రాష్ట్ర స్థాయిలో యువనేతగా దామచర్ల సత్యకు ప్రత్యేక గుర్తింపు ఉంది. అధినేత చంద్రబాబు , యువనేత లోకేష్‌లతో నిత్య సంబంధాలు, ఉత్తరాంధ్రజోన్ ఇన్‌చార్జీగా పూర్తి కాలం పార్టీకి సేవలు అందించడంతో పాటు అధికంగా భారమైనా వెనకడుగు వేయకుండా పని చేస్తుండటంతో రాష్ట్ర పార్టీ ముఖ్యనేతలందరికి తలలో నాలుకలా ఎదిగారు. ప్రస్తుతం ఎస్సీ సామాజిక వర్గంలో మంత్రి పదవికి టీడీపీలో తీవ్ర స్థాయిలో పోటీ ఉన్నప్పటికి పార్టీ పట్ల, అధినాయకత్వంతో స్వామికి ఉన్న నిబద్ధతతో పాటు దామచర్ల సత్యకు పార్టీలో ఉన్న పలుకుబడి బాగా కలిసి వచ్చినట్లు తెలుస్తోంది. కాగా స్వామికి మంత్రి పదవితో కొండపితో పాటు జిల్లా వ్యాప్తంగా టీడీపీ శ్రేణులు ఆనందోత్సవాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రతిపక్షంలో ప్రస్తుత జిల్లాలో టీడీపీ తరుపున ఏకైక ఎమ్మెల్యేగా ఉన్న స్వామి జిల్లాలోని అన్ని ప్రాంతాల నాయకులు, కార్యకర్తలతో సత్సంబంధాలు కొనసాగించడం అందుకు కారణంగా కనిపిస్తున్నది.

అవీ..ఇవీ..

బండలాగుడు పోటీలు

గిద్దలూరు, జూన్ 13 : మండలంలోని బురుజుపల్లి గ్రామంలో శ్రీవరసిద్ధి వినాయక, శ్రీ అభయాంజనేయ, షిర్డిసాయిబాబా దేవస్థాన 13వ వార్షికోత్సవ వేడుకలు ఈ నెల 16న జరుగనున్నాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు హోమాలు, సామూహిక భజన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వార్షికోత్సవ వేడుకల సందర్భంగా ఈ నెల 16న బండలాగుడు పోటీలు సీనియర్స్ విభాగంలో నిర్వహించి విజేతలకు వరుసగా రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు నగదు బహుమతులు అందజేస్తామని, రూ.700 ఎంట్రీ ఫీజు చెల్లించి 9912056207, 9666166510 సంప్రదించాలని కమిటీ తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే


చిన్నారులతో సూపర్‌వైజర్, అంగన్‌వాడీలు

త్రిపురాంతకం, జూన్ 13: అంగన్‌వాడీలలో పూర్వ విద్యను అభ్యసించిన చిన్నారులతో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ధ్రువీకరణ పత్రాల పంపిణీ నిర్వహించారు. మండలంలోని మేడపి సచివాలయంలో అన్ని కేంద్రాలు కలిపి సూపర్‌వైజర్ మరియకుమారి ఆధ్వర్యంలో చిన్నారులకు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పరిశీలకుడు వెంకట్రావు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రైతులకు శిక్షణ కార్యక్రమం

గిద్దలూరు, జూన్ 13 : రాచర్ల రైతుభరోసా కేంద్రంలో జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి ఎశైలజరాణి మాట్లాడుతూ వ్యవసాయంలో జీవన ఎరువులు, సేంద్రీయ ఎరువుల ప్రాముఖ్యత, వాటి ఉపయోగాల గురించి వివరించారు. మరో వ్యవసాయాధికారి వెంకటశేషమ్మ మాట్లాడుతూ ప్రధాన పంటలకు ఆశించే పురుగులు, తెగుళ్లు, నివారణ చర్యలను గురించి వివరించారు. ఈవిషయంగా రైతులు అడిగిన సందేహాలకు సమాధానాలు చెప్పారు. స్థానిక వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్‌రఫీ మాట్లా డుతూ 50శాతం రాయితీతో పచ్చిరొట్ట విత్తనాలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఉద్యానవనశాఖధికారి విష్ణుప్రియ మాట్లాడుతూ ఉద్యానవన పంటల్లో యాజమాన్య పద్ధతులు, డ్రిప్ వాడకంపై అవగాహన కల్పించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 13: మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఈ నెల 15న మార్కాపురం ప్రెస్‌క్లబ్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి మార్కాపురం శాఖ అధ్యక్షులు మొఘల్ జాబీర్ హుస్సేన్‌బేగ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సహకారంతో కర్నూల్‌కు చెందిన శాంతిరామ్ కంటివైద్యశాల ఆధ్వర్యంలో రోగులను పరీక్షిస్తారని తెలిపారు. ఈహెచ్ఎస్ హెల్త్‌కార్డు ద్వారా శుక్లం ఆపరేషన్ ఉచితంగా చేస్తారని, ఆరోగ్యశ్రీ కార్డు ఉన్నవారికి కంటి ఆపరేషన్ ఉచితంగా చేస్తారని తెలిపారు. కంటి పరీక్ష కోసం వచ్చే రోగులు ఆరోగ్యశ్రీ కార్డు, ఆధార్ కార్డు తీసుకురావాలన్నారు. కంటి ఆపరేషన్‌కు ఎంపికైన వారిని క్యాంపు రోజే కర్నూలు ఆసుపత్రికి తీసుకెళ్లారని తెలిపారు. ఉచిత కంటి వైద్యశిబిరం ఉపయోగించుకోదలచిన వారు 9703195747, 9390053731 నంబర్లకు సంప్రదించాలన్నారు. ఎంహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఫారూక్ షుబ్లీ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు


విత్తనాలు అందజేస్తున్న ఏవో బుజ్జిబాయ్

పెద్దారవీడు, జూన్ 13: రైతులకు ప్రభుత్వం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు అందజేయనున్నట్లు ఏవో బుజ్జిబాయ్ తెలిపారు. మండలంలోని దేవరాజుగట్టు రైతుభరోసా కేంద్రంలో గురువారం రాయితీపై మంజూరైన పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకూ 6 క్వింటాల పిల్లిపెసెర, 4 క్వింటాల జీలుగలు 50 శాతం రాయతీపై అందజేయనున్నట్లు తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాలు కావాల్సిన రైతులు రైతుభరోసా కేంద్రంలో సంప్రదించాలన్నారు. పొలం పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, ఫోన్‌నంబరు ఆర్‌బీకేలలో అందజేయాలన్నారు. రాయితీపోను మిగిలిన డబ్బు చెల్లించాలన్నారు. జనుములు 50 శాతం రాయితీపై కేజీ రూ.44లు, పెసర్లు రూ.67లకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన అశోక్‌రెడ్డి


మంత్రులతో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, జూన్ 13 : మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన గొట్టిపాటి రవి, అనగాల సత్యప్రసాద్‌ను గురువారం విజయవాడలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. నూతనంగా మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన వారికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. గిద్దలూరు నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి వారికి విజ్ఞప్తి చేశారు.



చిల్లచెట్లలో అసంపూర్తిగా ఉన్న అన్న క్యాంటీన్

అన్న క్యాంటీన్ భవనానికి మోక్షం

- ఐదేళ్లుగా నిరుపయోగం
- చుట్టూ చిల్లచెట్లతో నిండిన వైనం

దర్శి, జూన్ 13: ఐదేళ్లుగా నిరుపయోగంగా ఉన్న అన్న క్యాంటీన్ భవనానికి మోక్షం లభించనుంది. పేదలకు పట్టెడన్నం పెట్టాలన్న సదుద్దేశంతో టీడీపీ ప్రభుత్వంలో అన్ని ప్రధాన పట్టణాల్లో అన్న క్యాంటీన్లను ఏర్పాటుచేసిన విషయం తెలిసిందే. అందులోభాగంగా దర్శిలో రూ.30 లక్షల వ్యయంతో భవన నిర్మాణం చేపట్టారు. 80 శాతం పనులు పూర్తయ్యాయి. ఇంతలో 2019 ఎన్నికలు రావటంతో నిర్మాణం నిలిచిపోయింది. ఆతర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లను రద్దు చేసిన విషయం తెలిసిందే. దీంతో దర్శిలో నిర్మించిన భవనం మూలన పడింది. ఆ భవనం గురించి పట్టించుకోకపోవటంతో చిల్లచెట్లు పెరిగి నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో భవన నిర్మాణం పూర్తయ్యే అవకాశం వచ్చింది. సీఎం చంద్రబాబు అన్న క్యాంటీన్లను పునరుద్ధరిస్తూ గురువారం సంతకం చేశారు. దీంతో మిగిలిన నిర్మాణం పనులు త్వరలో చేపట్టే అవకాశం ఉంది. పేదలకు భవన నిర్మాణం పూర్తయిన తర్వాత భోజనం సమకూర్చటం జరుగుతుందని టీడీపీ నాయకులు తెలిపారు.

ప్రారంభమైన నాగారపప్పమ్మ కొలుపులు



హోమంలో పాల్గొన్న భక్తులు

పామూరు జూన్ 13: మండంలోని మోడవాడ గ్రామంలోని డొడ్డా వంశస్థుల ఆరాధ్యదైవం శ్రీనాగారపప్పమ్మ తల్లి కొలుపులను గురువారం ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా నూతనంగా తయారుచేయించిన అమ్మవార్ల విగ్రహాలను అర్చకులు కొల్లు రవికిరణ్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. శని, ఆది, సోమవారాల్లో తిరునాళ్లతో పాటు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేసినట్లు నిర్వాహకులు డొడ్డా నాగభూషణం, కోటిలింగం తెలిపారు.

నిరుపయోగంగా జనరేటర్



ఎంపీడీవో కార్యాలయంలో వృథాగా పడిఉన్న జనరేటర్

పామూరు, జూన్ 13: పామూరు తహసీల్దార్ కార్యాలయానికి సంబంధించిన జనరేటర్ గత కొన్నేళ్ళుగా ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో వృథాగా పడిఉంది. ప్రస్తుతం తుప్పుబట్టిపోతున్నది. విద్యుత్ సరఫరా నిలిచినప్పుడు, వీడియో కాన్ఫరెన్స్‌కు ఇబ్బందిగా ఉంటుందనే ఉద్దేశంతో గత ప్రభుత్వం ప్రతి తహసీల్దార్ కార్యాలయానికి జనరేటర్‌ను మంజూరు చేసింది. అయితే, అధికారులు సక్రమంగా ఉపయోగించుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. జనరేటర్‌కు తహసీల్దార్ కార్యాలయంలో తగినంత స్థలం లేకపోవడంతో ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటుచేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జనరేటర్‌ను మరమ్మతులు చేయించి వాడుకలోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.

చప్టాపై ప్రవహిస్తున్న మురుగు నీరు

- దుర్గంధంతో ప్రయాణికుల ఇబ్బందులు



తాళ్లూరు-కొత్తపాలెం గ్రామాలమధ్య చప్టాపై ప్రవహిస్తున్నమురుగు నీరు

తాళ్లూరు, జూన్ 13: తాళ్లూరు శివారున గల చప్టాపై ప్రవహిస్తున్న దుర్గంధం నీటితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు మాత్రం తమకేమి పట్టనట్టుగా వ్యవహరిస్తుండటంపై ప్రజలు విమర్శిస్తున్నారు. గేదెల షెడ్‌ల నుంచి వచ్చే వ్యర్థపు నీటిని వాగులోకి వదులుతున్నారు. ఆ వ్యర్థపు నీరు కాలువ ద్వారా చప్టాపై ప్రవహిస్తున్నది. ఈ మురుగు నీరు అక్కడ నిల్వ ఉండటంతో దుర్గంధం వెదజల్లుతుండటంతో తాళ్లూరు - కొత్తపాలెం గ్రామాల మధ్య రాకపోకలు సాగించే ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చప్టాపై నిల్వఉన్న మురుగునీటిని తొలగించేలా చర్యలు తీసుకొని ప్రయాణికుల ఇబ్బందులను తొలగించాల్సిన అవసరం ఉంది.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతి

మేదరమెట్ల, జూన్ 13: జాతీయ రహదారిలో తిమ్మనపాలెం వద్ద పాల ఆటో ఢీకొట్టి కిందపడిన దంపతులపై లారీ ఎక్కడంతో భార్యాభర్తలు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. గురువారం పల్నాడు జిల్లా రొంపిచర్ల గ్రామానికి చెందిన బత్తుల కొండలు (49), లక్ష్మి (41) ఇంకొల్లు మండలం దుద్దుకూరులో ఉన్న కుమార్తె విజయలక్ష్మిని చూడడానికి వెళ్లి తిరిగివస్తూ ఉండగా ఈ ప్రమాదం జరిగింది. తిమ్మనపాలెం వద్ద హైవే ఎక్కిన వీరి బైక్‌ను పాల ఆటో పక్కనే తగలడంతో ఇద్దరూ పడిపోయారు. అదే సమయంలో మేదరమెట్ల ప్రైవేట్ వెంచర్‌లో పార్కింగ్ టైల్స్ దించి గ్రోత్ సెంటర్ వైపు ఆపోజిట్ రోడ్డులో వస్తున్న లారీ వీరిపై ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందారు. కొండలు దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తెకు వివాహం కాగా, చిన్న కూతురు వీరి వద్దనే ఉంది. దుద్దుకూరులో కొలుపులు చూడడానికి కూతురు వద్దకు వచ్చి మృతిచెందారని బంధువులు కన్నీరు మున్నీరవుతున్నారు. అద్దంకి రూరల్ సీఐ శివరామకృష్ణారెడ్డి, కొరిశపాడు ఎస్ఐ శివయ్య సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

టీడీపీ కూటమి విజయోత్సవ ర్యాలీ

పీసీపల్లి, జూన్ 13: మండలంలోని పెదయిర్లపాడులో గురువారం రాత్రి టీడీపీ కూటమి ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కనిగిరి ఎమ్మెల్యేగా డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి విజయం సాధించడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా కూటమి ఘన విజయం సాధించిన సందర్భంగా సంబరాలు జరుపుకున్నారు. పెదయిర్లపాడు పంచాయతీలోని గ్రామాలతో పాటు లక్ష్మక్కపల్లి పంచాయతీలోని అడివిలోపల్లి గ్రామాల్లో కూటమి నేతలు, కార్యకర్తలు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ముందుగా పెదయిర్లపాడు సెంటరులో కేకు కట్‌చేసి కూటమి నేతలకు, కార్యకర్తలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనంలో పాగా

- హెల్త్ క్లీనిక్ సెంటర్‌లో పాల సేకరణ
- పట్టించుకోని అధికారులు
- గత ప్రభుత్వంలో ఇష్టారాజ్యం



అమూల్ పాల సేకరణకు ఉపయోగిస్తున్న పోతవరంలోని హెల్త్ క్లీనిక్ సెంటర్

దర్శి, జూన్ 13: అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ కార్యాలయాలు దుర్వినియోగం అవుతున్నాయి. ప్రజల అవసరాల కోసం నిర్మించిన భవనాలను వైసీపీ పాలకుల బరితెగింపు వలన ప్రైవేట్ వ్యక్తుల పరమయ్యాయి. మండలంలోని పోతవరంలో నిర్మించిన హెల్త్‌క్లీనిక్‌లో అమూల్ పాల సేకరణ కేంద్రంగా మారింది. గత రెండు సంవత్సరాలుగా హెల్త్‌క్లీనిక్ సెంటర్ అమూల్ సంస్థ పాలు సేకరిస్తున్నప్పటికీ వైద్యశాఖ అధికారులు పట్టించుకోలేదు. కనీసం ప్రారంభోత్సవం గురించి కూడా ఆలోచన చేయలేదు.

గ్రామస్థుల కథనం ప్రకారం.. 2021 అక్టోబరులో పోతవరంలో రూ.22 లక్షలతో హెల్త్‌క్లీనిక్ నిర్మాణం చేపట్టారు. 2022లో నిర్మాణం పూర్తయింది. నిబంధనల ప్రకారం హెల్త్‌క్లీనిక్ సెంటర్‌ను ప్రారంభించి ప్రజలకు వైద్య సేవలు అందించాల్సి ఉంది. వైసీపీ నేతల ఒత్తిడి మేరకు అధికారులు ఆ భవనంను వైద్యశాఖకు అప్పగించలేదు. నిర్మించిన భవనంలో అమూల్ డెయిరీ ద్వారా పాలు సేకరిస్తున్నారు. రాత్రిపూట ఈ క్లీనిక్ సెంటర్ అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారింది. కొంతమంది పేకాడుతూ అక్కడే మద్యం సేవిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. హెల్త్ క్లీనిక్ సెంటర్‌ను వైద్యాధికారులకు అప్పగించకపోవటంతో వైద్యులు సచివాలయాల్లో ప్రజలకు వైద్య సేవలందిస్తున్నారు. ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో ఇప్పటికైనా పరిస్థితులు మారుతాయని ప్రజలు భావిస్తున్నారు. హెల్త్‌క్లీనిక్ సెంటర్‌ను ఆశాఖకు అప్పగించి అక్కడ నుండి వైద్యసేవలు నిర్వహించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మూతబడిన ఎయిడెడ్ పాఠశాల

- ప్రత్యామ్నాయ ఏర్పాట్లను పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ఒబ్బాపురం కాలనీ విద్యార్థులు
- ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు

దొనకొండ, జూన్ 13: దొనకొండలోని ఒబ్బాపురంలో గొన్ని సంవత్సరాలు గా కొనసాగుతున్న ఎయిడెడ్ పాఠశాలను గత ఏడాది మూసేశారు. గత వైసీపీ ప్రభుత్వ పాలకులు, అధికారులు ఒబ్బాపురం ఎస్సీ కాలనీలో ప్రత్యా మ్నాయంగా ప్రభుత్వ పాఠశాల ఏర్పాటుకు ఏడాదిగా ఎటువంటి చర్యలు చేపట్టలేదు. ఫలితంగా ప్రభుత్వ పాఠశాల లేకపోవటంతో ఈ ప్రాంతానికి చెందిన విద్యార్థులు సుదూర ప్రాంతంలో ఉన్న జడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లాల్సివచ్చింది. జడ్పీ ఉన్నత పాఠశాల రైల్వే ట్రాక్ అవతల సుమారు రెం డు కిలోమీటర్లు దూరంలో ఉంది. విద్యార్థులు ప్రతిరోజు పాఠశాలకు రైల్వే ట్రాక్ దాటి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

గత కొన్నిసంవత్సరాలుగా ఒబ్బాపురంలో కొనసాగుతున్న ఎయిడెడ్ పా ఠశాల తమ పిల్లల విద్యాభివృద్ధికి ఎంతో సౌకర్యవంతంగా ఉండేదని తల్లి దండ్రులు పేర్కొంటున్నారు. ఆటువంటి పాఠశాలను మూసివేయడంతో త మ పిల్లలకు ఇబ్బందులు ఎదురయ్యాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒ బ్బాపురంలో ప్రాథమిక పాఠశాల సహితం లేకపోవటంతో చిన్నపిల్లలను సుదూరంలో ఉన్న పాఠశాలకు పంపేందుకు తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. స్థానికంగా ఉన్న ప్రైవేట్ పాఠశాలలో వేలకువేలు ఫీజులు చెల్లించి చదివించే ఆర్థికస్థోమత లేక పలువురు పేద కుటుంబాలకు చెం దిన తల్లిండ్రులు వారి పిల్లల చదువుకోసం ఆందోళన చెందుతున్నారు.

ఒబ్బాపురం ఎస్సీ కాలనీలో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటుచేయాలని అప్పటి అధికారులకు, పాలకులకు వినతిపత్రాలు అందించినా ఎటువంటి ప్రయోజనం చేకూరలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధి కారులు స్పందించి ఒబ్బాపురంలో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- డిప్యూటీ డీఎంహెచ్‌వో సృజన



కనిగిరి: ర్యాలీలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో సృజన

కనిగిరి, జూన్ 13: సీజనల్ వ్యాధులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సృజన అన్నారు. ప్రపంచ మలేరియా నివారణ మాసోత్సవాల సందర్భంగా గురువారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమకాటు ద్వారా వ్యాప్తిచెందే మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, బోధకాలు, మెదడువాపు వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. చలి, జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పులతో పాటు నీరసంగా ఉంటే వైద్యులను సంప్రదించాలన్నారు. ప్రతి ఒక్కరూ దోమలు నుంచి రక్షణగా దోమతెరలు వాడటంతోపాటు నీటి నిల్వ మురుగు గుంతలు లేకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి రామాంజనేయులు, టీబీ యూనిట్ అధికారి బాబూరావు, హెల్త్ సూపర్వైజర్ ఉమామహేశ్వరరావు, రమేష్‌బాబు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియా రహిత సమాజ నిర్మాణానికి కృషిచేయాలి



పామూరులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

పామూరు జూన్ 13: మలేరియా రహిత సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆరోగ్య విస్తరణాధికారి పి.శ్రీధర్ అన్నారు. దోమకాటు ద్వారా వ చ్చే వ్యాధులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గురువారం వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహిం చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమకాటు ద్వారా మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, మెదడువాపు, బోధకాలు లాంటి ప్రమాదకర వ్యాధులు ప్రబలకుండా రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు.

కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, ఎ.నిర్మల, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో నగర పంచాయతీ అస్తవ్యస్తం

- సిబ్బంది నియామకంలో నిర్లక్ష్యం
- టీడీపీ ప్రభుత్వంలో మంచి రోజులు
- చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య



దర్శి నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశంలో ప్రతిపాదిత పనులను వివరిస్తున్న సిబ్బంది

దర్శి, జూన్ 13: గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యంతో నూతనంగా ఏర్పాటైన దర్శి నగర పంచాయతీ పరిస్థితి అస్తవ్యస్తంగా మారిందని చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ అన్నారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో గురువారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం నగర పంచాయితీని ఏర్పాటుచేసిందే కాని గత నాలుగు సంవత్సరాలుగా సిబ్బంది నియామకం గూర్చి పట్టించుకోలేదన్నారు.

టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని నగరపంచాయతీ చైర్మన్ పిచ్చయ్య అన్నారు. వెంటనే పోస్టులు మంజూరు, సిబ్బంది నియామకం జరిగే విధంగా కృషి చేస్తామన్నారు. దర్శి పంచాయతీ వార్షిక ఆదాయం నాలుగు కోట్ల రూపాయలు పైగా ఉన్నందున మున్సిపాల్టీగా అప్‌గ్రేడ్ అయ్యే అర్హత కూడా ఉందన్నారు. పురపాలక శాఖ నూతన మంత్రికి దర్శి నగర పంచాయతీ గురించి వివరించి అప్‌గ్రేడ్‌కు కృషి చేస్తామని చెప్పారు. నగర పంచాయతీలో ప్రస్తుతం చేపట్టిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దర్శి నగర పంచాయతీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.121 కోట్లు త్వరలో విడుదల అయ్యే అవకాశం ఉందన్నారు. ఆ నిధులు రాగానే పూర్తిస్థాయిలో సిబ్బందిని సమకూర్చుకొని దర్శి నగర పంచాయతీని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామని చెప్పారు. అధికారులు ప్రతిపాదించిన పనులకు సభ్యులు ఆమోదం తెలిపారు. సమావేశంలో నగర పంచాయతీ కమిషనర్ వై.మహేశ్వరరావు, వైస్‌చైర్మన్లు జి.స్టీవెన్, తలారి కోటయ్య, సభ్యులు పాల్గొన్నారు.

'తాళ్లూరు' అభివృద్ధికి కృషి

- ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు



సీఎం చంద్రబాబు ప్రమాణస్వీకారం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న టీడీపీ శ్రేణులు

తాళ్లూరు, జూన్ 13: టీడీపీ కూటమి ప్రభుత్వ సహకారంతో మండల అభివృద్ధికి శక్తివంచనలేకుండా కృషి చేస్తానని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం తన చాంబర్‌లో భారీ కేక్‌ను కట్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను అందరికి అందుబాటులో ఉంటానని చెప్పారు. గ్రామాల్లో సమస్యలను తమ దృష్టికి తీసుక వస్తే మండల కీలక నేతలు, ప్రభుత్వ పెద్దలతో సంప్రదించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని చెప్పారు. టీడీపీ మండల అధ్యక్షుడు బొమ్మిరెడ్డి ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీకి చెందిన వ్యక్తి ఎంపీపీగా ఉన్నందున మండలంలో కావాల్సిన అభివృద్ధి పనులను చేయించుకునే అవకాశం ఉందన్నారు. ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రానున్న కాలంలో టీడీపీని మరింత బలోపేతం చేయాలన్నారు.

ఈసందర్భంగా మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి శ్రేణులు ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావును దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ముందుగా మండల కాంప్లెక్స్ వద్ద టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ విగ్రహానికి ఎంపీపీ శ్రీనివాసరావు, టీడీపీ అధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి పూల మాలవేసి నివాళులర్పించారు.

కార్యక్రమంలో మానం రమేష్‌బాబు, శాగం కొండారెడి, వల్లభనేని సుబ్బయ్య, మేడగం వెంకటేశ్వరరెడ్డి, షేక్ కాలేషావలి, గోపిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, షేక్ కాశీంసైదా, షేక్ మీరామొహిద్దీన్, చెన్నపురెడ్డి వీరనాగిరెడ్డి, ఇడమకంటి శ్రీనివాసరెడ్డి, కె.రామకోటిరెడ్డి, జనసేన నేతలు కూటాల ప్రసాద్, మారిశెట్టి హనుమంతరావు, బ్రహ్మయ్య దగ్గుపాటి సుబ్బారావు, మారా బత్తుల సుజాత, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే సుపరిపాలన



చంద్రబాబు ఐదు సంతకాలపై హర్షం వ్యక్తం చేస్తున్న టీడీపీ శ్రేణులు

పామూరు, జూన్ 13: ముఖ్యమంత్రిగా గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించిన నారా చంద్రబాబునాయుడు రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయేలా ఒకేసారి ఐదు హామీలపై సంతకాలు చేయడం పట్ల టీడీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి హోదాలో తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల్లో భాగంగా తొలి సంతకం మెగా డీఎస్సీ, రెండవ సంతకం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌రద్దు, మూడవ సంతకం అన్న క్యాంటీన్‌ల పునురుద్ధరణ, నాలుగో సంతకం సామాజిక పింఛన్లు రూ.4 వేలకు పెంపు, ఐదో సంతకం వృత్తి నైపుణ్యగణన హామీలపై చేయడం చంద్రబాబుకు దక్కిందన్నారు. చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యమని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు అన్నారు.

ఐదు హామిలపై ఒకేసారి సంతకాలు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేసిన వారిలో ఏలూరి వెంకటేశ్వర్లు, భైరెడ్డి జయరామిరెడ్డి, బోయిళ్ల నారాయణ రెడ్డి, యారవ శ్రీను, బొల్లా నరసింహారావు, ఆకుపాటి వెంకటేష్, షేక్ షంషూర్, డీవీ మనోహర్, కావిటి సుబ్బయ్య, షేక్ ఖాజారహంతుల్లా, యారవ ప్రసాద్‌రెడ్డి, జనసేన నాయకులు వై.రహీముల్లా, దరిశి ఏడుకొండలు, వెంగలశెట్టి బాబురావు, షేక్ సందాని బాషా తదితరులు ఉన్నారు.

రేపు వెలిగండ్ల మండల సర్వసభ్య సమావేశం

వెలిగండ్ల, జూన్ 13: వెలిగండ్ల మండల సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని ఎంపీడీవో రామచంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ రామన మహాలక్ష్మి అధ్యక్షతన సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. సమావేశానికి మండలస్థాయి అధికారులు శాఖలవారీగా పూర్తి సమాచారంతో రావాలని ఎంపీడీవో రామచంద్రరావు తెలిపారు.



అమరావతి శిల్పికి.. అఖండ స్వాగతం







ముఖ్యమంత్రి చంద్రబాబుకు పూలతో స్వాగతం పలుకుతున్న రాజధాని గ్రామాల ప్రజలు



- ముఖ్యమంత్రి చంద్రబాబుకు రైతుల నీరాజనాలు
- హారతులు, పూలవర్షంతో రాజధాని మహిళల ఆహ్వానం
- పూలతో నిండిన సీడ్ యాక్సిస్, రాజధాని రహదారులు
- జై చంద్రబాబు.. జయహో అమరావతి.. అంటూ నినాదాలు

తుళ్లూరు/ గుంటూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నాడు పోలీసు పహారాలో కర్ఫ్యూ వాతావరణం.. పరదాలతో జగన్ కాన్వాయ్ సాగగా.. నేడవే రాజధాని రోడ్లు అమరావతి జయజయధ్వానాలతో, రైతులు.. మహిళలు నినాదాలతో హోరెత్తాయి. జయహో అమరావతి.. జై చంద్రబాబు అంటూ రాజధాని రైతులు, మహిళలు అమరావతి శిల్పి.. ముఖ్యమంత్రి చంద్రబాబుకు అఖండ స్వాగతం పలికారు. చంద్రబాబు కాన్వాయ్ వెళ్లే రాజధాని రహదారులపై టన్నుల కొద్దీ పూలతో నింపి పూలదారులుగా మార్చేశారు. ప్రమాణ స్వీకారం అనంతరం తొలిసారిగా చంద్రబాబు ముఖ్యమంత్రి హోదాలో గురువారం సచివాలయంలో అడుగుపెట్టారు. ఉండవల్లిలోని నివాసం నుంచి బయలుదేరిన చంద్రబాబు కరకట్ట మీదగా వెంకటపాలెం, తాళ్లాయపాలెం, మందడం మీదగా వెలగపూడి సచివాలయానికి వచ్చారు. సచివాలయానికి చంద్రబాబు వస్తున్నారని అమరావతి రైతులకు గురువారం ఉదయమే తెలిసింది. దీంతో టన్నుల కొద్దీ బంతి, గులాబీ పూలు తెప్పించి రైతు శిబిరాల్లో వాటిని రాజధాని మహిళలు వలిచారు. అనంతరం ఆ పూలను మధ్యాహ్నం మూడు గంటల నుంచి వెంకటపాలెం సీడ్ రోడ్డు మొదలు సచివాలయం వరకు రోడ్డుపై పరిచి చంద్రబాబుకు అపూర్వ స్వాగతం పలికారు. ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మని దర్శించుకుని సచివాలయానికి బయలుదేరిన చంద్రబాబు రాజధాని గ్రామాలకు చేరుకోవడానికి గంటకుపైగా ఆలస్యమైంది. అయినా మధ్యాహ్నం నుంచే వేలాది మంది రైతులు, మహిళలు రోడ్లపైకి వచ్చి చంద్రబాబు రాక కోసం ఎదురు చూశారు. చంద్రబాబు కాన్వాయ్ కరకట్ట రోడ్డులోంచి సీడ్ యాక్సిస్ రోడ్డులోకి ప్రవేశించగానే పూలవర్షం కురిపించారు. ముహూర్తం లోపు సచివాలయానికి వెళ్లాల్సి రావడంతో కాన్వాయ్‌ను ఒకింత వేగంగా వెళ్లేందుకు ప్రయత్నించినా అది సాధ్యం కాలేదు. వెంకటపాలెం, మందడం గ్రామాల మధ్య వందలాది మంది ప్రజలు రోడ్లపై నిలబడి చంద్రబాబు కాన్వాయ్‌కు అడ్డుపడ్డారు. జై చంద్రబాబు, జయహో అమరావతి.. బిల్డ్ అమరావతి.. సేవ్ ఆంధ్రప్రదేశ్ నినాదాలు చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కాన్వాయ్‌కు అడ్డుపడి మరీ మహిళలు హారతులు ఇచ్చారు. దారి పొడవునా పూలవర్షం కురిపించారు. వెంకటపాలెం నుంచి మందడం వరకు వందలాది వాహనాలతో రైతులు కాన్వాయ్ వెంట ర్యాలీ తీశారు. దీంతో చాలా చోట్ల కాన్వాయ్ ఆగుతూ ముందుకు సాగాల్సిన పరిస్థితి వచ్చింది. ఏ ఒక్కరినీ నిరాశ పరచకుండా ఓపెన్ టాప్ కారులో నిలబడి అభివాదం చేస్తూ చంద్రబాబు ముందుకు సాగారు. తాడికొండ మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి రాజధాని మహిళలతో కలిసి సందడి చేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో రాష్ట్రానికి మంచి భవిషత్ వచ్చిందని టీడీపీ తుళ్లూరు మండల అధ్యక్షుడు ధనేకుల సుబ్బారావు తెలిపారు.

న్యాయం గెలిచింది.. అధర్మం ఓడింది

అమరావతిని కాదని మూడు రాజధానులని ఐదు కోట్ల మంది తెలుగు ప్రజలను మోసం చేసిన మాజీ సీఎం జగన్‌రెడ్డి అధర్మం ఓడిందని రాజధాని మహిళలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విజయంతో న్యాయం గెలిచిందన్నారు. మందడం సీడ్ రోడ్డు పక్కన న్యాయదేవత విగ్రహం పెట్టి మహిళలు పూజలు చేశారు. న్యాయం గెలిచింది అన్యాయం ఓడిందంటూ నినాదాలు చేశారు.

జగన్‌కు నిరసనలు.. చంద్రబాబుకు హారతులు

మూడు రాజధానుల పేరుతో అమరావతిని చిదిమేయాలని చూసిన గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కాన్వాయ్ రైతుల నిరసనలు ఎదుర్కోగా, నేడు చంద్రబాబు కాన్వాయ్ పూలవర్షంలో తడిసిపోయింది. జగన్ సచివాలయానికి వెళ్లే సమయంలో రాజధాని మొత్తం కర్ఫ్యూ వాతావరణం నెలకొనగా నేడదే గ్రామాల్లో వేలాదిమంది రోడ్లమీదకు వచ్చి సంబరాలు చేసుకున్నారు. జగన్‌రెడ్డి సచివాలయానికి వెళ్లే సమయంలో రాజధాని గ్రామాలన్నీ పోలీసు పహారాలో ఉంటే.. నేడు రైతుల మాన వహారాలతో నిండిపోయాయి. నాడు జగన్ కాన్వాయ్ పరదాల మధ్య సాగగా నేడు అవే రోడ్లు పూలదారులై చంద్రబాబుకు స్వాగతం పలికాయి.



సచివాలయం వద్ద...


ప్రాజెక్టులకు.. పునరుజ్జీవం

- టీడీపీకి మళ్లీ అధికారంతో రైతుల్లో ఆశలు
- వైసీపీ పాలనలో పడకేసిన సాగునీటి రంగం
- టీడీపీ ప్రారంభించిన వాటిని పాడుబెట్టిన వైనం
- కూటమికి అధికారంతో పనులు ప్రారంభౌమతాయని భావన

గోదావరి - పెన్నా నదుల అనుసంధానం.. గుంటూరు ఛానల్ పొడిగింపు.. ఆధునికీకరణ.. నల్లమడ డ్రెయిన్ ఆధునికీకరణ.. బుగ్గవాగు రిజర్వాయర్ సామర్థ్యం పెంపు.. వరికపూడిశెల ఎత్తిపోతల పథకం.. ఇలా ఉమ్మడి గుంటూరు జిల్లాలో సాగు, తాగునీటి అవసరాలు తీర్చే ప్రాజెక్టులపై వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లుగా నిర్లక్ష్యం వహించింది. సాగునీరు లేక లక్షల ఎకరాలు బీళ్లుగా మారినా.. తాగునీరు లేక ప్రజలు అల్లాడినా పాలకులు ఆలకించలేదు. టీడీపీ హయాంలో శంకుస్థాపనలు జరిగాయి.. మేమెందుకు వాటిని చేయాలన్న ధోరణితోనే ముఖ్యమంత్రి జగన్ పాలన సాగింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో జరిగిన సభల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి జగన్ పేరుకు ఆయా ప్రాజెక్టులపై ప్రస్తావించారే కాని పనులు ప్రారంభానికి అవసరమైన నిధులు విడుదలను మరిచారు. వరికపూడిశెల ఎత్తిపోతల పథకానికి సీఎం జగన్ ఎన్నికలకు ముందు శంకుస్థాపన చేశారే కానీ పనులు ప్రారంభంపై ఆలోచన చేయలేదు. ఈ పరిస్థితుల్లో కూటమి అధికారంలోకి రావడంతో ఆయా ప్రాజెక్టుల పునరుజ్జీవంపై రైతులు, ప్రజలు ఆశగా ఉన్నారు.

(నరసరావుపేట, గుంటూరు - ఆంధ్రజ్యోతి)


చంద్రబాబు నేతృత్వంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో జగన్‌రెడ్డి పాలనలో అభివృద్ధికి పట్టిన గ్రహణం వీడింది. అభివృద్ధిపై ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి. 2019కి ముందు టీడీపీ హయాం లో చేపట్టి నిలిచిన సాగు, తాగునీటి ప్రాజెక్టుల్లో కదలిక రానుంది. మళ్లీ టీడీపీ ప్రభుత్వం ఏర్పడటంతో నిలిచిపోయిన నీటి పారుదల ప్రాజెక్టుల పనులు తిరిగి ప్రారంభం అవుతాయని రైతులు కోటి ఆశలతో ఉన్నారు. గోదావరి, కృష్ణా నదుల అనుసంధానం.. వరికపూడిశెల ప్రాజెక్టుల పూర్తికి చంద్రబాబు తొలి ప్రాధాన్యం ఇస్తారని రైతులు ఆశిస్తున్నారు. 2014 నుంచి 19 మధ్య టీడీపీ ప్రభుత్వం ఉమ్మడి గుంటూరు జిల్లాలో సాగునీటి రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చింది. కేవలం ఏడాది వ్యవధిలోనే అప్పట్లో రికార్డు సమయంలో పట్టిసీమ ఎత్తిపోతల పథకాన్ని నిర్మించి గోదావరి మిగులు జలాలను కృష్ణా డెల్టాకు తరలించింది. దాంతో రైతులు సకాలంలో పంటల సాగు చేపట్టగలిగారు. ఏటా జూన్‌లోనే పట్టిసీమ ద్వారా నీరు కృష్ణా డెల్టా కాలవల్లో ప్రవహించేది. అప్పట్లో దిగుబడి కూడా అధికంగా వచ్చేది. ఆ ప్రాజెక్టుని చంద్రబాబు నిర్మించారన్న అక్కసుతో వైసీపీ ప్రభుత్వంలో సీఎం జగన్ రెండు, మూడేళ్ల పాటు పట్టిసీమ ఎత్తిపోతల పంపులనే ఆన్ చేయనివ్వలేదు. గత ఏడాది తీవ్ర నీటికొరత ఏర్పడటంతో దిక్కులేని స్థితిలో పట్టిసీమ ద్వారా కొంతనీటిని డెల్టాకు తరలించారు. టీడీపీ హయాంలో 70శాతం పైగా పూర్తి అయిన పోలవరం ప్రాజెక్టుని పూర్తిచేసి ఉంటే ఈ పాటికే గ్రావిటీపై గోదావరి జలాలను డెల్టాకు తీసుకురావడం సాధ్యమయ్యేది. అయితే ఆ ప్రాజెక్టు ఏజెన్సీని మార్చుచేసి రివర్స్ టెండరింగ్ అంటూ మోసం చేసి దానిని కూడా ఎప్పటికి పూర్తి అవుతుందో చెప్పలేని స్థితిలోకి తీసుకెళ్లింది. వరికపూడిశెల ఎత్తిపోతల పథకానికి నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవ రాయలు కేంద్ర ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు తెచ్చినా వైసీపీ ప్రభుత్వం పనులు చేపట్టడానికి నిధులు విడుదల చేయలేదు. ఈ పనులన్నింటిని పూర్తిచేస్తామని ఇప్పటికే చంద్రబాబు హామీ ఇచ్చారు. దీంతో సాధ్యమైనంత త్వరగా ఆయా పనులు ప్రారంభం కావాలని రైతులు కోరుకుంటున్నారు.



అమరావతి మండలంలోని లింగాపురంలో పంపుహౌస్ నిర్మాణం కోసం జరిగిన మట్టి పని

పేరు మార్చి పాడుబెట్టారు

గోదావరి-పెన్నా నదుల అనుసంధానంలో భాగంగా కృష్ణానదిలో ప్రకాశం బ్యారేజీ ఎగువన ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణానికి 2018 సెప్టెంబరు 5న టీడీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గుంటూరు, పల్నాడు, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో 9,61,231 ఎకరాలకు సాగునీరు, 679 చెరువులకు తాగునీరు అందించేందుకు ప్రణాళిక రూపొందించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణ పనులను రెండు ప్యాకేజీలుగా విభజించిన చంద్రబాబు ప్రభుత్వం రూ.6,020.15 కోట్లు మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టు కోసం తొలి విడతలో ప్రభుత్వ భూములను జలవనరులశాఖకు స్వాధీనం చేశారు. ప్రైవేటు భూమి అవసరమైన చోట భూసేకరణ నోటిఫికేషన్లు జారీ చేశారు. ప్యాకేజీ 1 కింద పంపుహౌస్ల నిర్మాణానికి లింగాపురంలో 5,32,000 క్యూబిక్ మీటర్లు, క్రోసూరులో 5,77,496 క్యూబిక్ మీటర్ల మట్టిపనిని పూర్తి చేశారు. నీటి పంపింగ్‌కు పైపులను అమర్చే పనిని చేపట్టారు. 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఎక్కడి పనులు అక్కడ ఆగిపోయాయి. భూసేకరణ చేపట్టలేదు. చేసిన పనులకు సంబంధించి ప్యాకేజీ 1లో రూ.201.96 కోట్లు, ప్యాకేజీ 2లో రూ.208.52 కోట్లు చెల్లించాల్సి ఉంది. చేసిన పనులకు బిల్లులు రాక కాంట్రాక్టు సంస్థలు ఎక్కడిపనులు అక్కడ నిలిపేసి యంత్రసామగ్రిని కూడా తరలించేశాయి. ఈ ప్రాజెక్టు పేరును వైఎస్ఆర్ పల్నాడు కరువు దుర్భిక్ష నివారణ ప్రాజెక్టుగా మార్చడంలో జగన్ సర్కారు చూపిన శ్రద్ధ, నిధులు కేటాయించడంలో చూపలేదు. మళ్లీ చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టడంతో గోదావరి జలాలు సాగర్‌కు తరలించే ఈ పథకంపై రైతుల్లో ఆశలు చిగురించాయి.



బుగ్గవాగు

అటకెక్కిన వరికపూడిశెల


వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో వరికపూడిశెల ఎత్తిపోతల పథకాన్ని అటకెక్కించింది. ఎన్నికల ముందు నిధులు విడుదల చేయకుండానే హడావుడిగా ఈ ప్రాజెక్టుకు జగన్ శంకుస్థాపన చేశారు. వరికపూడిశెల నిర్మాణం వైసీపీ పాలనలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఎత్తిపోతల నిర్మాణానికి అటవీ, వన్యప్రాణి సంరక్షణ శాఖల నుంచి అనుమతులు వచ్చాయే కాని పనుల ప్రారంభానికి వైసీపీ ప్రభుత్వం నిధులు విడుదల చేయకుండా మాటలతో పబ్బంగడిపింది. ఈ ప్రాజెక్టు మొదటి దశలో వెల్దుర్తి మండలంలోని 24,900 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు ఇవ్వడం లక్ష్యంగా డిజైన్ చేశారు. రెండో దశలో దుర్గి, బొల్లాపల్లి మండలాల్లో మరో 47,876 ఎకరాలు సాగునీరు ఇవ్వాల్సి ఉంటుంది. ఇలా మొత్తం 72,776 ఎకరాలకు సాగునీరు అందించవచ్చు. ఆయా ప్రాంతాల్లో తాగు నీటి సమస్యలు పరిష్కారం అవుతాయి. తొలి దశలో పనులకు రూ.340.26 కోట్ల ఖర్చు అవుతుందని అంచనా వేశారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఎలాంటి నిధులు కేటాయించిన దాఖలాలు లేవు. ఈ పరిస్థితుల్లో సీఎం చంద్రబాబు ఈ ఏడాదిలోనే వరికపూడిశెల తొలి దశ పనులు పూర్తి చేస్తారని ఆ ప్రాంతవాసులు విశ్వసిస్తున్నారు.



గుంటూరు చానల్

అనుమతుల్లోనే ఆధునికీకరణ

గుంటూరు ఛానల్ ఆధునికీకరణ, పొడిగింపు గురించే ఐదేళ్ల పాలనలో జగన్ మరిచారు. తొలుత ఛానల్‌లో 0 నుంచి 47వ కిలోమీటర్ వరకు ఆధునికీకరణ చేపట్టాలని నిర్ణయించారు. 0 కిలోమీటర్ వద్ద 750 క్యూసెక్కుల డిశ్చార్జి, 47వ కిలోమీటర్ వద్ద 350 క్యూసెక్కుల డిశ్చార్జి ఉండేలా డిజైన్స్ కూడా ఆమోదం పొందాయి. ఇందుకోసం రూ.378.258 కోట్లకు ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరు చేసి బడ్జెట్‌లో కూడా పొందుపరిచింది. అలానే గుంటూరు ఛానల్ పొడిగింపు కోసం మరో రూ.280 కోట్లను మంజూరు చేసి ప్రత్తిపాడు, పెదనందిపాడు, పర్చూరు మండలాల్లో సుమారు 50 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. నల్లమడ డ్రెయిన్ ఆధునికకీరణకు కూడా అప్పట్లో పరిపాలన అనుమతులు వచ్చాయి. తిరిగి చంద్రబాబు ముఖ్యమంత్రి అయినందున గుంటూరు ఛానల్ ఆధునికీకరణపై ప్రత్యేక దృష్టి సారిస్తారని రైతులు ఆశిస్తున్నారు.



వరికపూడిశెల ఎత్తిపోతల నిర్మించే ప్రదేశం

ప్రజా సంక్షేమమే లక్ష్యం

- సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తా
- కమ్యూనికేషన్స్ సహాయ మంత్రి పెమ్మసాని బాధ్యతల స్వీకరణ



కేంద్ర సహాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): 'ప్రజా సంక్షేమమే లక్ష్యం. వారి అంచనాలకు తగినవిధంగా పనిచేస్తాను. ప్రజా సమస్యలను పరిష్కరించే ఏ ఒక్క అవకాశాన్ని కూడా వదిలిపెట్టను..' అని కేంద్ర సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఢిల్లీలోని సంచార్‌భవన్‌లో కమ్యూనికేషన్స్‌శాఖ సహాయమంత్రిగా గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. తొలుత పెమ్మసానికి సంబంధిత అధికారులు ఆత్మీయంగా ఆహ్వానించారు. బాధ్యత స్వీకరణ అనంతరం కార్యాలయ, శాఖాపరమైన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేసే క్రమంలో అందరి సహకారం ఉండాలని అధికారులకు సూచించారు. మన మేథస్సును రాష్ట్రాన్ని, దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఉపయోగించాలని తెలిపారు. తనను నమ్మి ఇంతటి బాధ్యతను అప్పగించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రతిభావంతులైన జ్యోతిరాధిత్య సింధియా, శివరాజ్ సింగ్ చౌహాన్‌లతో కలిసి పనిచేయడం ఎంతో గర్వంగా ఉందన్నారు. రాష్ట్ర, దేశ ఖ్యాతిని ఇనుమ డింప చేసేలా తన పనితీరు ఉంటుం దని ఆయన చెప్పారు.

47 ఏళ్ళ తర్వాత అవకాశం

గుంటూరు లోక్‌సభ స్థానం నుంచి గెలుపొందిన ఎంపీకి 47 ఏళ్ల తర్వాత కేంద్ర మంత్రివర్గంలో చోటు లభించింది. గతంలో ఇక్కడి నుంచి ఐదు సార్లు గెలుపొందిన కొత్త రఘురామయ్య 1957నుంచి 1977వరకు కేంద్ర మంత్రిగా వ్యవహరించారు. ఆయన ఎంపీగా 1952లో తెనాలి లోక్‌సభ స్థానం నుంచి గెలుపొంది పార్లమెంటులోకి అడుగు పెట్టారు. ఆ తర్వాత 1957లో గుంటూరు నుంచి రెండోసారి విజయం సాధించి నెహ్రూ కేబినెట్‌లో రక్షణశాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత కార్మిక, పౌర సరఫరాల శాఖలను కూడా చేపట్టి 1964 వరకు మంత్రిగా ఉన్నారు. లాల్‌బహదూర్‌శాస్త్రి కేబినెట్‌లో 1964 -66 వరకు పౌరసరఫరాలు, సాంకేతిక శాఖల మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత ప్రధాని ఇందిర కేబినెట్‌లో 1966-77 వరకు న్యాయ, పెట్రోలియం, పార్లమెంటరీ వ్యవహారాలు, నౌక రవాణా, పర్యాటకశాఖల మంత్రిగా వ్యవహరించారు. రెండు దశాబ్దాలు కేంద్రంలో మంత్రిగా ఉండి చరిత్ర సృష్టించిన రఘురామయ్య 1979లో మరణించారు.

మనోహర్‌కు ఘన స్వాగతం



ఎన్డీఏ కూటమిలో మంత్రిగా ప్రమాణస్వీకారం చేసి తొలిసారిగా తెనాలి వచ్చిన నాదెండ్ల మనోహర్‌కు కూటమి శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. మహిళలు హారతులు పట్టి స్వాగతం పలికారు.

మెగా డీఎస్సీతో.. వెయ్యికిపైగా పోస్టులు

ఉమ్మడి గుంటూరు జిల్లా నిరుద్యోగ ఉపాధ్యాయుల్లో హర్షం

గుంటూరు(విద్య), జూన్ 13: డీఎస్సీపై ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం తొలిసంతకం చేయడంతో ఉత్తర్వులు జారీకి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. దీంతో ఉమ్మడి జిల్లాలో నిరుద్యోగ ఉపాధ్యాయుల్లో హర్షాతిరేకం వ్యక్తం అవుతోంది. మెగా డీఎస్సీ ద్వారా ఉమ్మడి గుంటూరు జిల్లాలో దాదాపు వెయ్యికిపైగా పోస్టులు వచ్చే అవకాశం ఉందని సీనియర్ ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఇందులో ఎస్‌జీటీలు 520, స్కూల్ అసిస్టెంట్స్, టీజీటీ, పీజీటీ ప్రిన్సిపాల్ పోస్టులు మరో 500పైగా ఉంటాయని అంచనా. జీవో 117 రద్దు చేస్తే పోస్టులు పెరుగుతాయని చెపుతున్నారు. ఉపాధ్యాయ పోస్టుల కోసం ఏళ్ల తరబడి నిరుద్యోగ ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే అనేక మంది డీఈడీ, బీఈడీ పూర్తి చేసి శిక్షణ కూడా తీసుకున్నారు. గత ప్రభుత్వం ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకు ముందు డీఎస్సీని ప్రకటించగా ఎన్నికల కమిషన్ నిలిపివేసింది. అనేక పాఠశాలల్లో ఖాళీగా పోస్టులు న్నా కనీసం విద్యా వలంటీర్లగా నిరుద్యోగ ఉపాధ్యాయులకు అవకాశం లేకుండా చేశారు. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు ఇచ్చిన హామీ వారిలో కొత్త ఉత్సాహం తెచ్చింది. తాజా అది కార్యరూపం దాల్చడంలో నిరుద్యోగ ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.





తీరంలో వేటకు సిద్ధంగా ఉన్న బోట్లు

వేటకు వేళాయె..!

● నేటితో ముగియనున్న సంధికాలం

● భత్యం సొమ్ము కోసం లబ్ధిదారుల ఎదురుచూపులు

చీరాల, జూన్ 13 : సముద్రంలో వేటకు సంధికాలం నేటితో ముగియనుంది. మత్స్యకారులు ముందస్తుగా సగెనపు బోటుకు వేటకు పంపుతున్నారు. ఆ బోటు తిరిగి వచ్చాక మంచిరోజు చూచుకుని అందరూ వేట ప్రారంభిస్తారు. అందుకోసం సారంగులు (బోటు యజమానులు), సారంగుల మధ్య ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ప్రభుత్వ పరంగా అందాల్సిన సంధికాలపు భత్యం కోసం పలువురు ఎదురు చూస్తున్నారు.

వేట వారికి జీవనాధారం. కష్టపడే తత్వం వారి సొంతం. గంగమ్మతల్లి ముద్దు బిడ్డలు సముద్రంలో తెరచాపలు. మత్స్యకారుల కోరస్ గీతాలను షురూ చేస్తున్నారు. ఏప్రిల్ 15వ తేదీ నుంచి జూన్ 14వ తేదీ వరకు సముద్రంలో మత్స్య సంపద పునరుత్పత్తి జరిగే సమయం. దీంతో ఆ రెండు నెలలను సంధికాలంగా పేర్కొంటారు. ఆ సమయంలో సముద్రంలో వేట నిషేధం. నేటితో సంధికాలం ముగుస్తోంది. దీంతో మత్స్యకారులు తిరిగి సమాయత్తమవుతున్నారు. సారంగులు, కళాసీల మధ్య పూర్తయిన ఒప్పందాలు.

సాధారణంగా ఒక్కో బోటుకు ఆరుగురు వ్యక్తులు ఉంటారు. బోటు యజమానులను సారంగులు అంటారు. వేటాడేవారిని కళాసీలు అంటారు. సంధికాలం పూర్తయిన తరువాత వేట పునఃప్రారంభానికి ముందస్తుగా సారంగులు, కళాసీల మధ్య వేటకు సంబంధించి ముందస్తుగా ఒప్పందాలు కుదుర్చుకుంటారు. ఆ ప్రక్రియ ప్రస్తుతం పూర్తయింది. కుదుర్చుకున్న ఒప్పందం తిరిగి సంధికాలం వరకు కొనసాగుతుంది.

సగెనపు బోటులు

మత్స్యకారులు సంధికాలం పూర్తయ్యేవరకు ఒకటి రెండు రోజులు ముందు సముద్రంలో సగెనపు బోటును పంపుతారు. ఆ బోటులో ఉన్నవారు సముద్రం తీరు తెన్నులను మత్స్య సంపద వలకు చిక్కేందుకు అనుకూల వాతావరణం ఉందా లేదా తదితర అంశాలను పరిశీలిస్తారు. ఆ బోటు తిరిగి వచ్చాక సక్రమంగా ఉంటే మంచిరోజు చూచుకుని అందరూ తమతమ బోట్లతో సముద్రంలోకి వేటకు వెళతారు.

సముద్రపు పూజలు

రేపు పండుగ పేరుతో మత్స్యకారులు ముందస్తుగా రేపు పండుగను నిర్వహిస్తారు. తీరంలో జరిగే ఈ పండుగ కు మత్స్యకారులు హాజరవడం ఆనవాయితీ. ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. తమను ఏడాది పాటు చల్లగా చూడాలని వేడుకుంటారు.

సంధికాలపు భత్యం కోసం ఎదురు చూపులు

సముద్రంలో వేట విరామం సమయంలో మత్స్యకారుల భృతికి అందాల్సిన భత్యం సొమ్ము ప్రభుత్వ పరంగా పలువురికి పంపిణీ కాలేదు. తమ బ్యాంక్ అకౌంట్‌లలో భత్యపు సొమ్ము జమ కాలేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వెంటనే భత్యం సొమ్మును అందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.



బాలకృష్ణను కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న మంత్రి స్వామి, సత్య

16న మంత్రి స్వామి జిల్లాకు రాక

భారీ ర్యాలీతో స్వాగత ఏర్పాట్లలో టీడీపీ శ్రేణులు, అభిమానులు

బాలయ్యను కలిసి కృతజ్ఞతలు

శుభాకాంక్షలు తెలుపుతున్న పలువురు

ఒంగోలు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రమంత్రివర్గంలో చోటు దక్కించుకున్న కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి ఈనెల 16న జిల్లాకు రానున్నారు. ఆ రోజు మధ్యాహ్నం అమరావతి నుంచి బయలుదేరి ఉమ్మడి జిల్లా సరిహద్దు బొప్పూడి వద్ద ఉన్న ఆంజేయస్వామి గుడిలో తొలుత పూజలు నిర్వహిస్తారు. అక్కడి నుంచి నేరుగా కొండపి నియోజకవర్గం ముఖద్వారమైన వల్లూరమ్మ గుడి వద్దకు చేరుకుని పూజలు చేస్తారు. అనంతరం స్వగ్రామమైన తూర్పునాయుడుపాలెంలో అంబేడ్కర్, ఎన్‌టీఆర్, దామచర్ల ఆంజనేయులు విగ్రహాలకు నివాళులర్పిస్తారు. తదనంతరం నాయుడుపాలెంలో అభినందన సభ జరగనుంది. ఆ సభలో ఉమ్మడి జిల్లాకు చెందిన టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఇతర ముఖ్యనాయకులు పాల్గొననున్నారు. ఆ మేరకు కొండపి నియోజకవర్గ పార్టీ బాధ్యతలు చూస్తున్న పార్టీ యువనేత దామచర్ల సత్యలు ముఖ్యనేతలతో చర్చించి షెడ్యూల్ రూపొందించినట్లు సమాచారం. మంత్రివర్గంలో స్థానం దక్కించుకొని తొలిసారి జిల్లాకు వస్తున్న డాక్టర్ స్వామికి ఘనస్వాగతం పలికేందుకు టీడీపీ శ్రేణులు, అభిమానులు, భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇదిలాఉండగా కేసరిపల్లి సభలో రాష్ట్రమంత్రిగా బుధవారం ప్రమాణస్వీకారం చేసిన డాక్టర్ స్వామి రాత్రి వరకు ముఖ్యమంత్రి చంద్రబాబు వెంట ఉన్నారు. ఇక గురువారం ఉదయం నుంచి తాడేపల్లి, విజయవాడ సెక్రటేరియట్‌లలో బిజీబిజీగా గడిపారు. ఎన్నికల ప్రచారంలో కొండపి నియోజకవర్గానికి వచ్చిన సినీహీరో, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను గురువారం ఉదయం విజయవాడలోని హోటల్ ఫార్చ్యూన్ మురళిలో మంత్రి స్వామి, యువనేత సత్యలు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మధ్యాహ్నం వరకు తను బసచేసిన తాడేపల్లిలోని ఫ్లాట్‌లోనూ అలాగే కోనూరులోని దామచర్ల సత్య నివాసంలోనూ టీడీపీ శ్రేణులకు అందుబాటులో ఉండగా నియోజకవర్గంతోపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు అలాగే వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సాయంత్రం సచివాలయంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు బాధ్యతలు స్వీకరణ కార్యక్రమానికి హాజరైన స్వామి రాత్రి వరకు సచివాలయంలోనే గడిపారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతి

● తొలుత ఆటో ఢీకొట్టడంతో రోడ్డుపై పడిన దంపతులు

● ఆపై వారి మీదుగా లారీ ఎక్కడంతో దుర్మరణం

మేదరమెట్ల, జూన్ 13 : జాతీయ రహదారిలో తిమ్మనపాలెం వద్ద పాల ఆటో ఢీకొట్టి కిందపడిన దంపతులపై లారీ ఎక్కడంతో భార్యాభర్తలు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. గురువారం పల్నాడు జిల్లా రొంపిచర్ల గ్రామానికి చెందిన బత్తుల కొండలు (49), బత్తుల లక్ష్మి (41) ఇంకొల్లు మండలం దుద్దుకూరులో ఉన్న కుమార్తె విజయలక్ష్మిని చూడడానికి వెళ్లి తిరిగి వస్తు ఉండగా ఈ ప్రమాదం జరిగింది. నాగులుప్పలపాడులో తిమ్మనపాలెం వద్ద హైవే ఎక్కిన వీరి బైక్‌ను పాల ఆటో పక్కనే తగలడంతో ఇద్దరూ పడిపోయారు. అదే సమయంలో మేదరమెట్ల ప్రైవేట్ వెంచర్‌లో పార్కింగ్ టైల్స్ దించి గ్రోత్ సెంటర్ వైపు ఆపోజిట్ రోడ్డులో వస్తున్న లారీ వీరి శరీరాలపై నుంచి ఎక్కింది. దీంతో వారు అక్కడికి అక్కడే మృతి చెందారు. లారీ టైర్ల కింద పడి మృతి చెందిన వారి మృతదేహాలను చూడడానికి కూడా బయంగా ఉంది. కృష్ణా జిల్లా పమిడిముక్కల మండలం మంటాడా గ్రామానికి చెందిన కంచెర్ల పల్లి మాధవరావు ఈ లారీని నడుపుతున్నాడు. కొండలు దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తెకు వివాహం కాగా చిన్న కూతురు వీరి వద్దనే ఉంది. దుద్దుకూరులో కొలుపులు చూడడానికి కూతురు వద్దకు వచ్చి మృతిచెందారని బంధువులు కన్నీరు మున్నీరవుతున్నారు.



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న అద్దంకి రూరల్ సీఐ శివరామకృష్ణారెడ్డి

మొదటిరోజే స్టూడెంట్ కిట్లు పంపిణీ

తొలిరోజు హాజరు తక్కువే

నాడు-నేడు పనులు అరకొరే ..

అసంపూర్తిగా చాలా భవనాలు

వసతులు అంతంతమాత్రమే

విద్యార్థుల బడిబాట!

వేసవి సెలవుల అనంతరం గురువారం బడిగంటలు మోగాయి. నిన్నటివరకు ఆటపాటలతో సరదాగా గడిపిన విద్యార్థులు భుజాలకు స్కూలు బ్యాగులు తగిలించుకొని పాఠశాలల బాట పట్టారు. పాఠశాలల్లో మొదటిరోజు విద్యార్థుల హాజరు తక్కువగానే ఉంది. ప్రైవేటు పాఠశాలలు కూడా గురువారం నుంచే ప్రారంభమయ్యాయి. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రైవేటు పాఠశాలలు మొదటిరోజు ఒంటిపూట మాత్రమే తరగతులు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు మాత్రం రెండు పూటల తరగతులు జరిగాయి. కోట్లాది రూపాయల వ్యయంతో నాడు-నేడు పేరుతో పనులు చేపట్టినా కొన్ని పాఠశాలల్లో విద్యార్థులకు సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు.



ఒంగోలు(విద్య), జూన్ 13: పాఠశాలల గురువారం పునఃప్రారంభమయ్యాయి. విద్యార్థులు తొలిరోజు పలుచగా హాజరయ్యారు. నాడు-నేడు పథకంతో పాఠశాలలు అద్భుతంగా తీర్చిదిద్దామని గత వైసీపీ ప్రభుత్వం ఆర్భాటం చేసిన విషయం తెలిసిందే. అయితే అదంతా ఉత్తుత్తిదే అని స్పష్టమైంది. ఎక్కడా పనులు పూర్తికాలేదు. అసంపూర్తి భవనాలు, అరకొర పనులతో తొలిరోజే విద్యార్థులకు సమస్యలు స్వాగతం పలికాయి. కాగా ఈ రోజే విద్యార్థులకు అందుబాటులో ఉన్నంత వరకు స్టూడెంట్ కిట్లను పంపిణీ చేశారు. 1 నుంచి 10 తరగతి వరకు 1,93,440 మంది విద్యార్థులకుగాను 1,37,630 మందికి మాత్రమే బ్యాగులు వచ్చాయి. నోట్ పుస్తకాలు 10,80,628 అవసరం కాగా మొత్తం అందుబాటులోకి వచ్చాయి. స్టూడెంట్ కిట్‌లోని యూనిఫాంలు, షూలు, డిక్షనరీలు రాలేదు. 1 నుంచి 10 తరగతులకు 16,30,676 పాఠ్యపుస్తకాలు అవసరం కాగా ఇప్పటివరకు 71శాతం అందుబాటులో ఉన్నాయి. అందుబాటులో ఉన్నంతవరకు పంపిణీ చేశారు.

అరకొర వసతులు

కొన్ని పాఠశాలల్లో అరకొర వసతులు విద్యార్థులను వేధిస్తున్నాయి. నాడు-నేడులో కొన్ని పాఠశాలలు సర్వాంగ సుందరంగా కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా అభివృద్ధి చేస్తున్నట్లు ప్రకటించిన గత ప్రభుత్వం కొన్ని పాఠశాలలను గాలికి వదిలేసింది. కొన్ని పాఠశాలల్లో భవనాల పైకప్పు పెచ్చులు ఊడిపడుతుండటంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ పాఠశాలల్లో తరగతి గదుల్లో కూర్చుంటున్నారు. ఒంగోలు రామనగర్ హైస్కూలు ఆవరణలోని ప్రాథమిక పాఠశాలలో శ్లాబు పెచ్చులు పడుతున్నాయి. దీంతో విద్యార్థులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఒంగోలు సత్యనారాయణపురంలోని పాఠశాలలో పరిస్థితి ఇదేవిధంగా ఉంది. ఇలా అనేక పాఠశాలల్లో పరిస్థితి ఇదేవిధంగా ఉండగా 1 నుంచి 5 తరగతులు విద్యార్థులు ఒకే షెడ్‌లో కూర్చోవాల్సి రావడంతో తొలిరోజే ఇబ్బందులు పడ్డారు.

సెయింట్ థెరిస్సా హైస్కూలు మూత

స్థానిక మార్కెట్ సెంటర్‌లోని సెయింట్ థెరిస్సా హైస్కూలును మూసివేయడంతో విద్యార్థులు వెనుతిరిగి వెళ్లారు. ఈ పాఠశాలను యాజమాన్యం ప్రభుత్వంలో విలీనం చేసింది. ఇక్కడి టీచర్లను ప్రభుత్వానికి అప్పగించిన యాజమాన్యం ప్రభుత్వ గ్రాంట్‌ను వదులుకుంది. గతేడాదే ఇది జరగగా విద్యార్థుల తరపున కొందరు హైకోర్టును ఆశ్రయించారు. అయితే కోర్టు యాజమాన్యానికి, ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పును వెలువరించింది. దీంతో ఈ ఏడాది ఏప్రిల్ వరకు జరిగిన పాఠశాల ప్రస్తుతం మూతబడింది. విద్యార్థులు ఈ పాఠశాలల నుంచి టీసీలు తీసుకుని ఇతర పాఠశాలల్లో చేరాల్సి ఉంది.



కొత్తపట్నం బస్టాండ్ రైతుబజార్ వద్ద అన్నక్యాంటిన్

విభిన్న వర్గాలకు లబ్ధి చేకూర్చే అంశాలపై సీఎం చంద్రబాబు తొలి సంతకాలు

మెగా డీఎస్సీతో నిరుద్యోగులకు ఊరట

పింఛన్లు రూ.4వేలు పెంపుతో 2.91లక్షల మందికి లబ్ధి

పేదల ఆకలి తీర్చనున్న అన్న క్యాంటీన్లు

ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు

అమల్లోకి హామీలు..

ఒంగోలు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన కీలక హామీల అమలుపై టీడీపీ కూటమి ప్రభుత్వం దృష్టిసారించింది. ముఖ్యమంత్రిగా బుధవారం ప్రమాణస్వీకారం చేసిన అధినేత చంద్రబాబు గురువారం సచివాలయంలో ఆ బాధ్యతలు తీసుకున్నారు. ఆ వెంటనే వివిధ వర్గాలకు ఉపకరించే ఐదు కీలక ఫైళ్లపై సంతకాలు చేశారు. ఎన్నికల ప్రచారంలో టీడీపీ అధినేతగా వివిధ వర్గాల వారికి లబ్ధి చేకూర్చే పలు అంశాలపై చంద్రబాబు విస్పష్టమైన హామీలు ఇచ్చారు. అందులో ఉపాధ్యాయ శిక్షణ కోర్సు పూర్తిచేసిన నిరుద్యోగులకు ఉపకరించే మెగా డీఎస్సీపై తొలి సంతకం, భూయజమానులను భయభ్రాంతులకు గురిచేసేలా గత వైసీపీ ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైటలింగ్ యాక్టుపై రెండవ సంతకం చేస్తానని పలు సభల్లో చెప్పారు. అలా సామాజిక పింఛన్ మొత్తాలను ప్రస్తుతం ఉన్న రూ.3వేల నుంచి రూ.4వేలకు పెంపుతో పాటు పలు ఇతర వాగ్దానాలు చేశారు. ఎన్నికలలో భారీ విజయాన్ని టీడీపీ కూటమికి ప్రజలు కట్టబెట్టగా ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన చంద్రబాబు మరుసటి రోజైన గురువారమే ఎన్నికలలో ఇచ్చిన హామీలు అమలుపై చర్యలు చేపట్టారు. తాను సీఎంగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఐదు కీలక అంశాలపై సంతకాలు చేశారు.

ఐదు ఫైళ్లపై సంతకాలు

ఎన్నికల వేళ చెప్పినట్లే మెగా డీఎస్సీపై తొలి, ల్యాండ్ టైటలింగ్ యాక్టుపై రెండవ సంతకం చేయగా పింఛన్ మొత్తం పెంపు, అన్న క్యాంటిన్ల పునరుద్ధరణ, స్కిల్ గణన అంశాలపై మిగతా సంతకాలు ఉన్నాయి. కాగా చంద్రబాబు తొలి సంతకం పెట్టిన మెగా డీఎస్సీలో రాష్ట్రంలో 16347 ఉపాధ్యాయ పోస్టులు ఉండగా అందులో జిల్లాలో 988 పోస్టులు ఉన్నాయి. మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తే ఆమేర ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసుకొని ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు ఉద్యోగాలు రానున్నాయి. అలాగే పింఛన్ పెంపుతో వృద్ధులు, వితంతువులు, వికలాంగులు ఇతరత్రా వర్గాలకు భారీ లబ్ధి చేకూరనుంది. ప్రస్తుతం జిల్లాలో సుమారు 2.91 లక్షల మంది పింఛన్‌దారులకు సుమారు రూ.87.90 కోట్లు అందిస్తున్నారు. తాజాగా మొత్తాన్ని రూ.3వేల నుంచి రూ.4వేలకు పెంచడంతో లబ్ధిదారులకు మరో సుమారు రూ.22కోట్లు మేర అదనంగా అందనుంది. అంతేకాక ఏప్రిల్ నుంచి జూన్ వరకు మూడు నెలలకు బకాయి మూడువేలు కూడా జూలైలో అందిస్తామని గతంలోనే చంద్రబాబు ప్రకటించారు. ఆ ప్రకారం జులై తొలివారంలో ఒక్కొక్కరికి రూ.7వేల పింఛన్ అందనుంది.

అన్నక్యాంటిన్ కళకళ

ఇక టీడీపీ ప్రభుత్వంలో ఒంగోలుతోపాటు జిల్లాలోని పలు ఇతర పట్టణాల్లో అన్న క్యాంటిన్లు ఏర్పాటు చేసి రూ.5కే భోజనం, టిఫిన్ అందించగా నిత్యం ప్రతి క్యాంటిన్‌లో వందలాది మంది తిని ఆకలి తీర్చుకున్నారు. వైసీపీ వచ్చాక వాటిని మూతవేసింది. పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటిన్లను తిరిగి ప్రారంభించనున్నారు.

శుక్రవారం నుంచే వాటిని ప్రారంభించనుండగా చిరు వ్యాపారులు, వివిధ రంగాల కార్మికులు, అడ్డకూలీలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ల్యాండ్ టైటలింగ్ యాక్టు రద్దుతో భూయజమానులకు భరోసా లభించనుంది. మొత్తంగా బాధ్యతలు స్వీకరించిన మరుక్షణమే పలు హామీల అమలుపై చంద్రబాబు సంతకాలు చేయడంతో పాలనలో మార్పు ప్రారంభమైందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

మార్పు మొదలైంది..!



నగరంలో పారిశుధ్యం తొలగింపు చర్యలు చేపట్టిన అధికారులు



బైపాస్ రోడ్‌లో హడావుడిగా తారుతో వేసిన లేయర్

● టీడీపీ అధికారంలో రాగానే ఒంగోలులో అభివృద్ధివైపు అడుగులు

ఒంగోలు (కార్పొరేషన్), జూన్ 13 : గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి ఊసే లేని ఒంగోలు నగరంలో అప్పుడే మార్పు మొదలైంది. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే యంత్రాంగం పేరుకుపోయిన సమస్యలపై దృష్టిసారించింది. దీంతో రెండు రోజులుగా కార్పొరేషన్, ఆర్‌అండ్‌బీ శాఖల ఆధ్వర్యంలో పనులు వేగవంతమయ్యాయి. ఈ మేరకు కమిషనర్ ఎం. జశ్వంత్‌రావు సిబ్బందితో సమీక్షించి, పనులకు ముందుడుగు వేశారు. ఆయన స్వయంగా నగరంలో పర్యటించి పారిశుధ్యం మెరుగు చర్యలు చేపట్టారు. నగరంలో ఇంటింటి చెత్త సేకరణలో నిర్లక్ష్యం వహించకూడదని సిబ్బందిని ఆదేశించారు. అలాగే నగరంలో వీధుల్లో చెత్త నిల్వ ఉండటానికి వీలు లేదని ఆదేశించారు. పారిశుధ్యంపై ప్రజల నుంచి ఫిర్యాదులు రావడానికి వీలు లేదని ఎప్పటికప్పుడు పారిశుధ్యం మెరుగుపరచాలని తెలిపారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ రవీంద్ర, శానిటరీ సూపర్‌వైజర్ పిచ్చయ్యతో కలిసి కమిషనరు నగరంలో పలు ప్రాంతాల్లో చెత్త తొలగింపు చర్యలను పర్యవేక్షించారు. ఇదిలా ఉండగా, నగరంలోని కర్నూలు రోడ్ బైపాస్‌లో ఏళ్లుగా రోడ్డు గుంతలతో వాహనాలు నడవాలంటేనే కష్టంగా మారిన పరిస్థితి. నానా అవస్థలు పడిన జనం ఇప్పుడు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ఫై ఓవర్ బ్రిడ్జి వద్ద గత కొన్నేళ్లుగా గుంతలమయంగా మారి, కనీసం కాలినడక కూడా కష్టతరంగా మారిన రోడ్డును బాగుచేస్తున్నారు. ఇప్పటికే ఒక లేయర్ తారురోడ్డు వేశారు. మిగిలిన రోడ్లను అందంగా తీర్చిదిద్దారు. ఇటీవల ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఆదేశాలతో నగరంలో సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టగా, టీడీపీ అధికారంలోకి వచ్చిన వారంరోజుల్లోనే మార్పు మొదలైందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

ప్రభుత్వ భూమిలో మళ్లీ ఆక్రమణ

హెచ్చరిక బోర్డు తొలగించి గోడ నిర్మాణం

జాతీయ రహదారి పక్కన 65 సెంట్లు కబ్జా

మార్కెట్ విలువ రూ.4 కోట్ల పైమాటే

వైసీపీ మున్సిపల్ కౌన్సిలర్ అడ్డగోలు వ్యవహారం

మార్కాపురం, జూన్ 13: మార్కాపురంలోని రైతుల వినియోగం కోసం కేటాయించిన కల్లం భూమిని మరోసారి వైసీపీ కౌన్సిలర్ ఆక్రమణకు పూనుకున్నాడు. గతంలో మార్కాపురం నియోజకవర్గంలో జరిగిన భూఅక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. మార్కాపురం పురపాలక సంఘంలో వైసీపీ కౌన్సిలర్ పట్టణానికి సమీపంలో నుంచి వెళుతున్న జాతీయ రహదారి పక్కనే ఉన్న సుమారు రూ.4 కోట్ల విలువైన భూమిపై కన్నేశాడు. గత ఏడాది సెప్టెంబరులో ఆ భూమిని చదును చేశాడు. ఈ విషయంపై 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు వెలువడ్డాయి. స్పందించిన రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని నిర్ధారించారు. అందుకు సంబంధించిన హెచ్చరిక బోర్డులు సైతం ఏర్పాటు చేశారు. అదే భూమిలో మరోసారి హెచ్చరిక బోర్డులు తొలగించి గోడను నిర్మించడం గమనార్హం.

నాడు రైతుల కల్లం కోసం వినియోగం

మార్కాపురం పట్టణ పరిధిలో సర్వే నెంబరు 1011లో 0.64 సెంట్ల ప్రభుత్వ భూమి ఉంది. పూర్వపు ఆర్ఎస్ఆర్ ప్రకారం ఆ భూమి రైతులకు సంబంధించిన కల్లంగా నమోదై ఉంది. గతంలో ఆ భూమిని ఎవరూ పట్టించుకునేవారు కాదు. మార్కాపురం పట్టణ సమీపం నుంచి జాతీయ రహదారి 545 వెళుతోంది. దీంతో ఆ రహదారి వెంబడి భూముల ధరలకు రెక్కలొచ్చాయి. దీంతో భూ అక్రమార్కులకు ప్రభుత్వ భూములపై కన్నుపడింది. మార్కాపురం మున్సిపాలిటీలోని ఓ కౌన్సిలర్ ఆ భూమిపై వాలాడు. మట్టి తోలి చదును చేసి ఆక్రమించాడు. దీనిపై కథనాలు వెలువడటంతో రెవెన్యూ అధికారులు స్పందించారు. ఆ భూమిలో కొలతలు నిర్వహించి ప్రభుత్వ భూమి ఆక్రమణను గురైందని నిర్ధారించి బోర్డులు ఏర్పాటు చేశారు. కానీ సదరు వైసీపీ కౌన్సిలర్ మళ్లీ ఆ ప్రభుత్వ స్థలాన్ని తిరిగి తన స్వాధీనంలోకి తెచ్చుకోవడానికి సిద్ధమయ్యాడు. ఆక్రమిత చర్యలో భాగంగా రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డులను తొలగించాడు. ఆ స్థలంలో కొత్తగా గోడ నిర్మాణం చేపట్టాడు. ఇప్పటికైనా మరోసారి రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిని కాపాడటానికి సమగ్ర చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



వైసీపీ కౌన్సిలర్ ప్రభుత్వ భూమిలో బోర్డును తొలగించి నిర్మించిన గోడ



మంత్రి గొట్టిపాటికి అపూర్వ స్వాగతం

- తొలిసారిగా సొంత ఊరు యద్దనపూడి రాక
- తండ్రి, పెదనాన్న సమాధుల వద్ద నివాళి

యద్దనపూడి (మార్టూరు) జూన్ 13 : అద్దంకి ఎమ్మెల్యే, మంత్రి గొట్టిపాటి రవికుమార్ దంపతులకు గురువారం యద్దనపూడి గ్రామంలో పార్టీనాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. యద్దనపూడి గ్రామానికి చెందిన రవికుమార్ ఎమ్మెల్యేగా 4వసారి విజయం సాధించారు. అంతకు ముందు 2004లో మార్టూరు నియోజకవర్గం నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా అసెంబ్లీలోకి అడుగుపెట్టారు. తాజాగా ఆయన ఐదోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించడంపై యద్దనపూడి మండల ప్రజలు ఆనందంలో మునిగిపోయారు. బుధవారం మంత్రిగా రవికుమార్ ప్రమాణం చేయడంతో కేడర్‌తో పాటు అభిమానులు స్నేహితులు, బంధువులు ఆనందంలో ఉన్నారు. మార్టూరు నియోజకవర్గం ఉన్నపుడు యద్దనపూడి గ్రామానికి చెందిన స్వర్గీయ మాజీ మంత్రి గొట్టిపాటి హనుమంతరావు టీడీపీ హయాంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే మంత్రిగా పని చేశారు. ఆయన మరణాంతరం తిరిగి రవికుమార్‌కు చంద్రబాబు హయాంలోనే మంత్రిపదవి దక్కడం హర్షనీయం. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే యద్దనపూడి మండలంపై ప్రత్యేక దృష్టి ఉన్న గొట్టిపాటి మంత్రి అయ్యాక భార్య ఝాన్సీ, ఇద్దరు కుమారులు హర్షవర్ధన్, మహేష్‌తో గ్రామానికి రావడంతో గ్రామస్థుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. రవికుమార్ బాబాయి మాజీ ఎంపీపీ గొట్టిపాటి రాంబాబు దంపతులు గ్రామస్థులతో ఎదురెళ్లి జడ్పీ హైస్కూల్ వద్ద రవికుమార్ దంపతులకు ఘన స్వాగతం పలికారు. అలాగే మహిళలు పూలతో స్వాగతించగా, యువకులు బాణసంచా కాల్చి మంత్రిని గ్రామంలోకి తోడ్కొని వెళ్లారు.

నాన్న, పెదనాన్న సమాధుల వద్ద నివాళి

యద్దనపూడి వచ్చిన మంత్రి గొట్టిపాటి రవికుమార్ గ్రామ శివారులోని నాన్న శేషగిరిరావు, పెదనాన్న మాజీ మంత్రి గొట్టిపాటి హనుమంతరావు ఘాట్‌ల వద్దకు వెళ్లి నివాళులర్పించారు. వారితోపాటు గొట్టిపాటి రాంబాబు దంపతులు, స్వర్గీయ గొట్టిపాటి కిషోర్ తనయుడు కమల్ కిషోర్ (బాబీ) తదితరులు నివాళులర్పించారు. అనంతరం రవికుమార్ యద్దనపూడి ప్రధాన సెంటర్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి, తర్వాత హనుమంతరావు విగ్రహానికి ఆయన కుమారుడు సోదరసమానుడైన స్వర్గీయ మాజీ ఎమ్మెల్యే గొట్టిపాటి నరసయ్య విగ్రహాలకు రవికుమార్ పూలమాలవేసి నివాళులర్పించారు.




యద్దనపూడిలో నాన్న, పెదనాన్న సమాధుల వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి.. ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న గొట్టిపాటి

అందరినీ ఆప్యాయంగా పలకరించిన మంత్రి

మంత్రిగా తొలిసారి యద్దనపూడి వచ్చిన గొట్టిపాటిని అభినందించేందుకు గన్నవరం, పోలూరు, యనమదల, చింతపల్లిపాడు, పూనూరు తదితర గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు తరలివచ్చారు. వారిలో కొంతమంది గొట్టిపాటిని శాలువాలు కప్పి అభినందించారు. అద్దంకి, బల్లికురవ, జెపంగులూరు, మార్టూరు మండలాలనుంచి నాయకులు వచ్చి మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. వారందరినీ రవికుమార్ ఆప్యాయంగా పలకరిస్తూ అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఒక వైపు పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబ శివరావు సారథ్యం, మరో వైపు మంత్రి రవికుమార్ సహకారంతో యద్దనపూడి మండలం మరింతగా అభివృద్ధి చెందుతుందని పార్టీ శ్రేణులు, ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

అభినందనల వెల్లువ

బల్లికురవ : మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను గురువారం గ్రానైట్ క్వారీలు, ఫ్యాక్టరీల యజమానులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. గురువారం గ్రానైట్ క్వారీల యజమానులు పత్తిపాటి సురేష్, మాలపాటి పోతురాజు, ధూళిపాళ్ల రామగోవిందు, ఒట్టికొండ అంజనేయులు, దేవినేని శ్రీనివాసరావు, బల్లికురవ మండల గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానుల సంఘ అధ్యక్షుడు చిట్టిపోతు మస్తానయ్య చిలకలూరిపేటలోని ఇంటికి వెళ్లి గొట్టిపాటిని అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రానున్న రోజుల్లో పరిశ్రమల అభివృద్ధికి కృషి చేస్తానని, చిన్నతరహ పరిశ్రమలను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. క్వారీ యజమానుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

మంత్రిని కలిసిన ముప్పవరంవాసులు

పంగులూరు : మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను ముప్పవరం టీడీపీ నేతలు, కార్యకర్తలు చిలకలూరిపేటలోని ఆయన స్వగృహంలో కలిసి అభినందనలు తెలిపారు. మిఠాయిలు తినిపించి గొట్టిపాటితో తమ ఆనందాన్ని పంచుకున్నారు. టీడీపీ నాయకుడు కుక్కపల్లి ఏడుకొండలు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ ఇంటూరి వెంకటేశ్వర్లు, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వరసర్ల సుబ్బారావు, బీసీ నేత దాసరి హనుమంతరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు రౌతు వీరాంజనేయులు, పుష్పరాజు, పలువురు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కేక్ కట్ చేసిన మహిళలు

గొట్టిపాటి మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా ముప్పవరం బీసీ కాలనీ మహిళలు కేక్ కట్ చేసి అభిమానాన్ని చాటుకున్నారు.



మంత్రికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న గ్రానైట్, క్వారీ యజమానులు

నేడు మంత్రి గొట్టిపాటి రాక

నాయకులు, కార్యకర్తలతో సమావేశం

అద్దంకి, జూన్ 13 : మంత్రి హోదాలో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం అద్దంకి రానున్నారు. బుధవారం మంత్రిగా ప్రమాణం చేసిన రవికుమార్ గురువారం స్వగ్రామమైన యద్దనపూడిలో పలు కార్యక్రమాల కు హాజరై, గ్రామస్థులతో సరదాగా గడిపారు. వరుస విజయాలను అందించిన నియోజకవర్గ ప్రజలను కలిసేందుకు శుక్రవారం రవికుమార్ అద్దంకి వస్తున్నారు. ఉదయం 10 గంటలకు పట్టణంలో నాగులపాడు రోడ్డులోని కామేపల్లి కల్యాణ మండపం లో జరిగే టీడీపీ, కూటమి శ్రేణుల సమావేశంలో పాల్గొననున్నారు.



విత్తన దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ మోహనరావు

రూ.15లక్షల విలువైన విత్తనాల అమ్మకాలు నిలిపివేత

మార్టూరు, జూన్ 13 : మార్టూరులో కోస్టల్ హైబ్రిడ్ సీడ్స్ దుకాణంలో అమ్మకాలకు అనుమతులు లేవని రూ.15లక్షల విలువైన హైబ్రిడ్ మిరప విత్తనాల అమ్మకాలను నిలిపివేసినట్లు వ్యవసాయ అధికారి వీరగంధం కిరణ్ కుమార్ తెలిపారు. గురువారం మార్టూరులో పర్చూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.మోహనరావు వ్యవసాయ అధికారి కిరణ్‌కుమార్ మార్టూరులో మూడు విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. వారు కోస్టల్ హైబ్రిడ్ సీడ్స్, హరిత సీడ్స్, శ్రీలక్ష్మీ వెంకటేశ్వర సీడ్స్ దుకాణాలలోని రికార్డులను పరిశీలించారు. వాటిలో కోస్టల్ హైబ్రిడ్ సీడ్స్ దుకాణంలో అనుమతులు లేకుండా ఉన్న రూ.15లక్షల విలువైన విత్తనాలు ఉన్నట్లు తనిఖీల్లో తేలిందన్నారు. దాంతో ఈ విత్తనాలను అమ్మ వద్దని దుకాణ యజమానికి సూచించామన్నారు. అదేవిధంగా ఎంఆర్‌పీ ధర కన్నా మించి విత్తనాలను అమ్మవద్దని డీలర్లకు సూచించారు. విత్తనాలను కొనుగోలు చేసిన రైతులకు తప్పని సరిగా బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు. అనుమతులు లేకుండా విత్తనాలను అమ్మిన దుకాణాదారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యవసాయ కమిషనర్, జిల్లా వ్యవసాయ అధికారి ఆదేశాలు మేరకు తనిఖీలు నిర్వహించినట్లు కిరణ్ కుమార్ తెలిపారు.

విత్తనాలు కొంటే బిల్లు తీసుకోవాలి

పలు దుకాణాల్లో ఏడీఏ సోదాలు

అద్దంకిటౌన్, మే 13 : రైతులు విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు తప్పని సరిగా బిల్లులు తీసుకోవాలని మండల మార్టూరు ఏడీఏ కేవీ శ్రీనివాసరావు అన్నారు. గురువారం అద్దంకి మండలం లో విత్తన దుకాణాలపై ఏడీఏ శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణతో కలిసి విత్తన దుకాణాలపై ఆకస్మిక సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలో ఆయా దుకాణాలలో ఉన్న విత్తనాలకు, నిల్వలు, వాటికి సంబంధించిన రికార్డులును పరిశీలించారు. ఏడీఏ మాట్లాడుతు తిసుకున్న బిల్లులో కొనుగోలు చేసిన విత్తన రకం, కంపెనీ పేరు, లాట్ నెంబర్‌లు వంటివి ఉండేలా చూసుకోవాలని సూచించారు.



తనిఖీలు చేస్తున్న ఏడీఏ శ్రీనివాసరావ

ఫోన్‌లో మాట్లాడుతూ..లారీని ఢీకొట్టి

బైకిస్టుకి తీవ్ర గాయాలు

అద్దంకిటౌన్, మే 13 : ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఫోన్ రావడంతో మాట్లాడుతూ లారీని వెనుక వైపు ఢీకొన్న ఘటనలో వ్యక్తికి గాయాలయ్యాయి. గురువారం అద్దంకి- మేదరమెట్ల రోడ్డులో దేనువకొండ పునరావాస కాలనీ సమీపంలో ఈ ఘటన జరిగింది. అద్దంకికి చెందిన గుంటూరు కరుణాకర్ దేనుకొండ కాలనీ సమీపంలో ఉన్న కోల్డ్ స్టోరేజీ వద్దకి వచ్చి మరలా తన ద్విచక్ర వాహనంపై అద్దంకి వెళ్తుండగా ఫోన్ రావడంతో మాట్లాడుతూ రోడ్డు పక్కన అగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో తలకు గాయాలు కాగా 108లో అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు తరలించారు.



గాయపడిన కరుణాకర్

వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉండాలి

బల్లికురవ, జూన్ 13 : గ్రామాలలో ఉన్న రైతు భరోసా కేంద్రాల సి బ్బంది రైతులకు ఆందుబాటులో ఉండి వారికి అవసరమైన విత్తనాలు సకాంలో అందించేలా చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ శాఖ డీఏవో రామకృష్ణ కోరారు. గురువారం మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతు భరోసా కేంద్రాలలో పనిచేస్తున్న సిబ్బందితో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గ్రామాలలో ఉన్న ఎ రువులు, పురుగు మందులు, విత్తనాలు అమ్మకాలు చేపట్టే డీలర్లు సరైన పత్రాలు లేకుండా అమ్మకాలు చేపడితే చర్యలు తప్పవన్నారు. అలానే ఖరీఫ్ సీజన్‌లో రైతుల పంట దుక్కులలో మట్టి నమునాలను సేకరించాలన్నారు. అలానే పచ్చి రొట్టి విత్తనాలను అందించాలన్నారు. సమావేశంలో మార్టూరు ఏడీఏ కేవీ శ్రీనివాసరావు, టెక్నికల్ ఏవో తిరుమలరావు, బల్లికురవ ఏవో కుమారి పాల్గొన్నారు.


అన్న క్యాంటీన్‌పై ఆశలు

ఇంకొల్లు, జూన్ 13 : సీఎం చంద్రబాబు గురవారం అన్న క్యాంటీన్ల పునఃప్రారంభంపై సంతకం చేయడంతో ఇంకొల్లు ప్రాంతంలో ప్రజలకు అన్నక్యాంటీన్ ఏర్పాటుపై ఆశలు చిగురించాయి. 2019లో అప్పటి ఎమ్మెల్యే ఏలూరి ఇంకొల్లులో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు తమ వంతు కృషి చేసారు. అప్పటి టీడీపీ ప్రభుత్వంలో అన్న క్యాంటీన్ నిర్మాణానికి రూ.40 లక్షల నిధులు కూడా కేటాయించారు. బస్టాండు సమీపంలో స్థల సేకరణ చేసారు. 2019 ఫిబ్రవరి 16వ తేదీన ఏలూరి సాంబశివరావు భూమిపూజ చేసి శిలాఫలకం వేశారు. అప్పటిలో వెంటనే ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు బ్రేకు పడింది. అనంతరం వైసీపీ అధికారంలోకి రావడంతో దీని ఊసే లేదు. మళ్లీ టీడీపీ అధికారంలోకి రావడం గురువారం ముఖ్యమంత్రిగా చంద్రబాబు అన్న క్యాంటీన్ల నిర్వహణకు సంబంధించిన ఫైల్‌పై సంతకం చేయడం తో ఇంకొల్లు ప్రాంత ప్రజలు అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేస్తారని ఆశిస్తున్నారు.



ఇంకొల్లులోని అన్నక్యాంటీన్ శిలాఫలకం

బాలకార్మికులను పనిలో పెట్టుకోవద్దు



అవగాహన కలిగిస్తున్న అధికారులు

ఇంకొల్లు, జూన్ 13 : బాలకార్మికులతో పనులు చేయించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చీరాల లేబర్ ఆఫీసర్ రామకృష్ణ హెచ్చరించారు. ఈ నెల 1వ తేదీ నుంచి 30 వరకు జరిగే ప్రత్యేక తనిఖీలలో భాగంగా ఇక్కడ పర్యటించారు. ఆటోనగర్ మెకానిక్ షాపులలో తనిఖీలు చేసి 14 సంవత్సరాల వయస్సులోపు ఉన్న బాలకార్మికులచే పనులు చేయించరాదని యజమానులకు సూచించారు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు అందరూ సహకరించాలని దుకాణదారులను కోరారు. కార్యక్రమంలో అధికారులు అబ్రహం, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నాలుగు సెల్‌ఫోన్‌ల చోరీ

అద్దంకి, జూన్ 13 : రెండు ఇళ్లల్లో 4 సెల్ ఫోన్‌లు, హుండీలో దాచుకున్న నగదు చోరీకి గురయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. బుధవారం రాత్రి అద్దంకి పట్టణంలోని దామావారిపాలెంలో రవి ఇంట్లో రెండు సెల్‌ఫోన్‌లు, హుండీలో దాచుకున్న సుమారు రూ.5వేల నగదు, మండలంలోని గోపాలపురంలో యర్రా హనుమంతరావు ఇంట్లో రెండు సెల్ ఫోన్‌లు అపహరణకు గురయ్యాయి. బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



మొక్కలు నాటుతున్న ఎంఈవోలు

ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన వసతులు

బల్లికురవ, జూన్ 13 : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన వసతులు అందుబాటులో ఉన్నాయని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎంఈవోలు వస్రాంనాయక్, రమేష్ కోరారు. గురువారం పాఠశాలల ప్రారంభం సందర్భంగా ఎంఈవోలు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేశారు. అనంతరం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మొక్కలు నాటారు. అనంతరం పాఠశాలల్లో అందుతున్న వసతుల గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు వారు వివరించారు. త్వరలో పూర్తిస్థాయిలో పుస్తకాలు అందజేస్తామని తెలిపారు. జీసీడీవో ఎం.చారులత, ఎఫ్ఏవో సైదావలి పాల్గొన్నారు.

వలపర్ల హైస్కూల్‌లో నాటిన మొక్కలు

మండలంలోని వలపర్ల జడ్పీ హైస్కూల్లో గురువారం ఉపాధ్యాయులు విద్యార్థులతో మొక్కలను నాటించారు. గురువారం స్కూళ్లు పునఃప్రారంభం కావడంతో విద్యాలయాలు పచ్చదనంతో ఉండాలని స్కూల్లో మొక్కలను నాటేకార్యక్రమం చేపట్టినట్లు ప్రధానోపాధ్యాయిని నిర్మలాదేవి తెలిపారు. ఇంకా కార్యక్రమంలో ఉపాధ్యాయులు చింతల సుబ్బారావు, పీఈటీ దేవరాజ్ పాల్గొన్నారు.

విద్యా కానుక కిట్లు పంపిణీ చేయాలి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న గుంటూరు ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి

యద్దనపూడి (మార్టూరు), జూన్ 13 : పాఠశాలలకు విద్యా కానుక కిట్లు అందేలా చేయాలని గుంటూరు ఆర్‌జేడీ బీ లింగేశ్వరరెడ్డి సూచించారు. ఆయన గురువారం యద్దనపూడి జడ్పీ హైస్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రధానోపాధ్యాయుడు ఎం.దేవేంద్ర, పలువురు ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థులకు బోధన విషయంలో ఐఎఫ్‌పీ ప్యానళ్లను ఎక్కువగా ఉపయోగించాలన్నారు. ఆ బోధనతో విద్యార్థులు సులువుగా నేర్చుకుంటారన్నారు. స్కూల్లో వాటర్ ప్లాంట్ సమస్యను ఉపాధ్యాయులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో పర్చూరు ఉపవిద్యా శాఖాధికారి ఎం.నిర్మల, ఎంఈవో చిలుకూరిగోపి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రావి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్వర్ణ (పర్చూరు) : ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులతో పాటు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందుతుందని ఎంఈవో మొలబంటి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం కారంచేడు మండల పరిధిలోని స్వర్ణ హైస్కూల్‌లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎంవీ సుబ్బారావు, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉప సర్పంచ్‌కు సర్పంచ్‌గా బాధ్యతలు

బల్లికురవ, జూన్ 13 : మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామ సర్పంచ్‌గా ఉప సర్పంచ్ ఉప్పుమాగులూరు శాంతిని జిల్లా అధికారులు నియయించారు. ఇప్పటి వరకు ఉప్పుమాగులూరు సర్పంచ్‌గా పనిచేసిన పసుమర్తి మహాలక్ష్మమ్మ అనారోగ్య కారణాలతో సర్పంచ్ విధులకు సెలవు పెట్టారు. దీంతో టీడీపీ మద్దతు దారుగా ఉన్న వైస్ సర్పంచ్ ఉప్పుమాగులూరు శాంతికి జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్ గురువారం నియమాక పత్రాన్ని అందజేశారు. గతంలో జరిగిన ఒప్పందం మేరకు వైసీపీ మద్దతుదారుగా ఉన్న సర్పంచ్ రెండున్నరేళ్ల పదవిలో ఉండి, అనంతరం సెలవు పెట్టడంతో టీడీపీ మద్దతుదారులకు సర్పంచ్ పదవి వచ్చింది. సెలవులో వెళ్లిన సర్పంచ్ పదవీ కాలం పూర్తయ్యే వరకూ సెలవులోనే కొనసాగేలా గతంలో ఒప్పందం అయినట్లు టీడీపీ నేతలు తెలిపారు.



జిల్లా పంచాయతీ అధికారి నుంచి బాధ్యతలు తీసుకుంటున్న శాంతి

పేదల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్ సిద్ధం

అద్దంకి, జూన్ 13 : ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాల మేరకు అధికారం చేపట్టిన వెంటనే సీఎం చంద్రబాబు గురువారం 5 ఫైళ్లపై సంతకాలు చేశారు. ఈ క్రమంలో జగన్‌రెడ్డి రద్దు చేసిన అన్న క్యాంటీన్‌లు పునరుద్ధరణ కూడా ఉంది. ఈనేపథ్యంలో త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్‌లో తెరుచుకోనున్నాయి. అద్దంకి పట్టణంలో పేద ప్రజల ఆకలి తీర్చేందుకు ఎన్ఎస్‌పీ కార్యాలయం ఆవరణలో నామ్ రోడ్డు వెంబడి అప్పట్లో గత టీడీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేశారు. వేల మంది ఆకలి తీర్చుతున్న అన్న క్యాంటీన్‌లను వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మూసి వేశారు. ఈ క్రమంలో అద్దంకిలో నిర్వహించిన అన్న క్యాంటీన్ భవనంలో జగనన్న మహిళా మార్ట్ ఏర్పాటు చేశారు. మెప్మా సభ్యుల సొమ్ముతో ఏర్పాటు చేసిన జగనన్న మహిళా మార్ట్ మెప్మా అధికారులు, సిబ్బందికి కాసుల పంట కురిపించిందన్న విమర్శలు ఉన్నాయి. ఈక్రమంలో మెప్మా సభ్యులు పెట్టిన సుమారు రూ.12 లక్షల పెట్టుబడికి లెక్కలు తేల్చక పోవడం కూడా విమర్శలకు తావిస్తోంది. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పలువురు టీడీపీ శ్రేణులు మహిళా మార్ట్ ను తొలగించాలని ఆందోళన చేయడంతో మున్సిపల్ అధికారులు మార్ట్‌ను మూసివేశారు. గురువారం సీఎం చంద్రబాబు అన్న క్యాంటీన్ పునరుద్ధరణ ఫైల్‌పై సంతకం చేయడంతో మరలా అన్న క్యాంటీన్ ప్రారంభమై పేదల ఆకలి తీర్చనున్నదని తెలిసి పేద ప్రజలు ఆనందోత్సహాలు వ్యక్తం చేస్తున్నారు.



అన్న క్యాంటీన్ భవనం



తీరంలో పర్యటిస్తున్న ఎస్ఐ శివకుమార్

సముద్రతీరంలో గస్తీ

రామాపురం(చీరాలటౌన్), జూన్ 13 : వాడరేవు, రామాపురంలో గురువారం పోలీసులు గస్తీ చేపట్టారు. ఇటీవల కాలంలో వరుసగా ఇద్దరు విద్యార్థులు మునిగేందుకు వచ్చి మృత్యువాత పడడంతో ఆంధ్రజ్యోతిలో బుధవారం సముద్రతీర పర్యవేక్షణపై కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఈపూరుపాలెం ఎస్సై శివకుమార్ సిబ్బందితో ఆ ప్రాంతాల్లో కలియ తిరిగారు. పర్యాటకులకు పలు సూచనలు, హెచ్చరికలు జారీ చేశారు. మద్యం సేవించడం, డేంజర్ జోన్‌లలో ఈతకు దిగవద్దని సూచించారు. దీంతో పర్యాటకులు అప్రమత్తమై జాగ్రత్తలు తీసుకున్నారు.

దశరథరామయ్య మృతి తీరనిలోటు

పంగులూరు, జూన్ 13 : అనారోగ్యంతో మృతి చెందిన చందలూరు గ్రామవాసి, టీడీపీ మండల నేత బెల్లంకొండ దశరథ రామయ్య అంత్యక్రియలు గురువారం జరిగాయి. దశరథ రామయ్య మృతదేహాన్ని సందర్శించిన పలువురు టీడీపీ నేతలు నివాళులర్పించారు. ఆయన మృతి వారి కుటుంబంతో పార్టీకి తీరని లోటని పార్టీ నాయకులు కేవీ సుబ్బారావు, బాలిన రామసుబ్బారావు, టీడీపీ మండలాధ్యక్షుడు రావూరి రమేష్ పెంట్యాల రాధాకృష్ణ అన్నారు. మండల పరిషత్ మాజీ అధ్యక్షులు నార్నె పార్వతమ్మ, గ్రామ సర్పంచ్ పెంట్యాల కిష్టారావు, టీడీపీ నాయకులు గుర్రం ఆదిశేఖర్, తెలుగు రైతు అధ్యక్షుడు రామలింగస్వామి, బోరెడ్డి ఓబుల్‌రెడ్డితో పాటు పలువురు నేతలు దశరథ రామయ్య మృతదేహాన్ని సందర్శించి ఆయన మృతిపట్ల సంతాపం తెలిపారు.



చందలూరులో నేడు మంత్రి పర్యటన

పంగులూరు, జూన్ 13 : మంత్రి గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం చందలూరు గ్రామం రానున్నారు. మండలంలోని చందలూరు గ్రామానికి శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు చందలూరులో పర్యటిస్తున్నట్లు కార్యాలయ ప్రతినిధి తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం

కడవకుదురు(చినగంజాం), జూన్ 13 : మండలంలోని కడవకుదురు గ్రామంలోని మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ పూజారి బి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో స్వామి వార్లను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రాంగణంలో వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలతో, పలు రకాల పూల మాలలతో అలంకరించి వేద పండితుల వేదమంత్రోచ్ఛరణలు మంగళ వాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా దంపతులచే స్వామి వారి కల్యాణ క్రతువుని నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని భక్తులు కనులురా తిలకించారు. పూజలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మహిళా భక్తులు భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటి సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్‌కు అభినందనలు

పర్చూరు, జూన్ 13 : జనసేన పార్టీ అధినేత ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్‌ను పర్చూరు నియోజకవర్గానికి చెందిన జనసేన కేంద్ర ఎన్నికల కమిటీ కన్వీనర్ ఆలా అనిల్ కుమార్ గురువారం పార్టీ కేంద్ర కార్యాలయం మర్యాద పూర్వకంగా కలిశారు. ఎన్నికల్లో అఖండ మెజార్టీతో గెలిచిన పవన్ కల్యాణ్, నాదెండ్ల మనోహర్‌కు అనిల్ కుమార్ పుష్ప గుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో నవ్యాంధ్ర ప్రదేశ్ అభివృద్ధి బాటలో పయనిస్తుందని ఈసందర్భంగా ఆలా తెలిపారు.



పవన్‌ను సన్మానిస్తున్న అనిల్ కుమార్

పది రోజులు నీటి సరఫరా బంద్

మేదరమెట్ల, జూన్ 13 : పది రోజుల పాటు మేదరమెట్ల - రాచపూడి తాగునీటి పథకాన్ని ఆపివేస్తున్నట్లు డీఈ వేణుగోపాలరావు తెలిపారు. గురువారం మేదరమెట్లలోని ఆర్‌డబ్ల్యూఎస్ పథకాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ్మవరం వద్ద గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో నీరు లేకపోవడం వలన తాగునీటి పథకాన్ని పది రోజులపాటు మూసివేస్తున్నట్లు చెప్పారు. మల్లవరం వద్ద నుంచి తాగునీటిని తీసుకోవడానికి అక్కడ మోటార్లు మరమ్మతులకు గరయ్యాయన్నారు. మోటార్ మరమ్మతులు పూర్తి చేసి, పది రోజులల్లో తాగునీటిని అందిస్తామన్నారు. మూడు మండలాలలోని 21 గ్రామాలకు ఈ పథకం ద్వారా నీరు అందుతుందన్నారు. ఈ పది రోజుల పాటు ఈ గ్రామాలకు నీటి సరఫర ఉండదని డీఈ తెలిపారు.



తాగునీటి పథకాన్ని పరిశీస్తున్న డీఈ వేణుగోపాలరావు

ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా వెంకటయ్య

నెల్లూరు (హరనాథపురం) : ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా వై.వెంకటయ్యను నియమిస్తూ కలెక్టర్ హరినారాయణన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ఈడీగా డిప్యూటేషన్‌పై ఉన్న కే.రమేష్ మాతృశాఖకు వెళ్లడంతో ఆయన స్థానంలో వెంకటయ్యను నియమించారు. బీసీ సంక్షేమ శాఖ ఈడీగా పనిచేస్తున్న వెంకటయ్యకు ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. గురువారం వెంకటయ్య బాధ్యతలు స్వీకరించారు. కాగా, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ అధికారిగా సెల్వి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ఆమెను ఆ కార్పొరేషన్ ఈడీ ఆ శాఖకు సరెండర్ చేశారు.

నత్తకే నవ్వొస్తోంది!


మందగమనంలో నాడు-నేడు పనులు

వేధిస్తున్న నిధుల సమస్య.. ఆగిన బిల్లులు

నాడు-నేడు రెండో దశ కింద పాఠశాలల్లో జరుగుతున్న పనులను చూసి నత్తకే నవ్వు వస్తోంది. రోజుల తరబడి పనులు సా....గుతూనే ఉన్నాయి. చేసిన పనులకు బిల్లులు చెల్లించక పోవడంతో అత్యధిక పాఠశాలల్లో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. ఇసుక, సిమెంట్‌కు కూడా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే గతేడాది నుంచి రివాల్వింగ్ ఫండ్ కింద సొమ్ము జమ కాకపోవడంతో పాఠశాలల కమిటీలు తాత్కాలికంగా పనులు నిలిపివేశాయి. అయితే, అధికారులు మాత్రం నాడు-నేడు పనుల్లో జిల్లా రాష్ట్రంలోనే అగ్రస్థానంలో ఉందని చెబుతున్నా వాస్తవ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి.



బుచ్చిరెడ్డిపాళెంలోని డీఎల్ఎన్ఆర్ హైస్కూల్లో నిధులు లేక పునాదుల దశలోనే ఆగిపోయిన అదనపు గదుల నిర్మాణం





ఉదయగిరి దళితవాడ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న పనులు



కావలి రూరల్ : కొత్తపల్లి హైస్కూల్లో సిమెంట్ అందక ఆగిన అదనపు గదుల నిర్మాణం

ఆంధ్రజ్యోతి పరిశీలన

నెల్లూరు (విద్య) : నాడు-నేడు రెండో దశ కింద జిల్లాలో 1,357 పాఠశాలలు, 22 జూనియర్ కళాశాలల్లో నిర్మాణాలకు రూ.479 కోట్ల రూ.74లక్షల, 79వేలతో అంచనాలను సిద్ధం చేశారు. అలాగే 553 పాఠశాలల్లో 2వేల అదనపు గదుల నిర్మాణాలకు కూడా పనులను ప్రారంభించారు. ఇందుకుగాను ప్రతి పాఠశాల అభివృద్ధి కమిటీ ఖాతాలకు 15 శాతం వంతున రివాల్వింగ్ ఫండ్ జమచేశారు. దీనికి తోడు సిమెంట్, ఇసుక, ఇనుముతోపాటు పలు రకాల నిర్మాణ సామగ్రి అందచేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి గత ఏడాది జూన్ నుంచి పనులు ప్రారంభించారు. తొలుత కమిటీల ఖాతాల్లో నగదు పడటంతో పనులు వేగవంతంగా చేసినా తరువాత నిధుల కొరతతో మందకొడిగా సాగుతున్నాయి. ఇప్పటివరకు జిల్లాలో రూ.81కోట్ల 43లక్షల 68 వేలు ఖర్చు చేశారు. మరో ఏడు కోట్ల వరకు రివాల్వింగ్ ఫండ్‌ను పాఠశాలల కమిటీల ఖాతాల్లో జమచేయాల్సి ఉంది. అలాగే సిమెంట్ కొనుగోలుకు రూ.8కోట్ల రూ.44లక్షల 5వేలు, ఇసుకకు రూ.21లక్షల 46వేలు ఖర్చుచేసినట్లు అధికారులు తెలిపారు. అయితే, చేసిన పనులకు బకాయిలు చెల్లించకపోవడంతో సిమెంట్ సంస్థలు సరఫరా నిలిపివేసినట్లు కమిటీ సభ్యులు చెబుతున్నారు. కొన్ని చోట్ల అదనపు గదులకు శ్లాబ్‌లు వేయగా మరికొన్ని చోట్ల పనులు పునాదుల్లోనే నిలిచిపోయాయి. అలాగే ఇంకొన్ని పాఠశాలల్లో ఇంజనీర్లు, పాఠశాల కమిటీల మధ్య సమన్వయం లేకపోవడంతో అవసరానికి మించి మెటీరియల్స్ కొనుగోలు చేయడం, మరికొన్ని చోట్ల కొనుగోలు చేయకపోవడం వంటి సమస్యలతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. అధికారులు మాత్రం తమకు విడుదలైన నిధులన్నీ ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తున్నామని, పనులు ఎక్కడా ఆగడం లేదని చెబుతున్నారు. అయితే వాస్తవ పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉండటంతో ఆగిపోయిన భవన నిర్మాణాలే సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి.

● వేధిస్తున్న గదుల కొరత

ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ప్రాథమిక పాఠశాల నుంచి 3, 4, 5 తరగతులను కిలోమీటరు దూరంలో ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. ప్రాథమిక బడుల నుంచి విద్యార్థులు వెళ్లడంతో ఉన్నత పాఠశాలల్లో చాలాచోట్ల తరగతి గదుల సమస్యలు ఏర్పడ్డాయి. దీనికి తోడు గదుల నిర్మాణానికి స్థలం, ఇతరత్రా సమస్యలతో కొన్నిచోట్ల పాతభవనాలను కూల్చివేశారు. ఇలాంటి ప్రాంతాల్లో విద్యార్థులు వరండాల్లోనే కూర్చునే పరిస్థితులు ఏర్పడ్డాయి. పాఠశాలల పరిసరాలన్నీ ఇసుక, ఇటుకలు, నిర్మాణ పనుల సామాన్లతో అస్తవ్యస్థంగా తయారయ్యాయి. అత్యధిక పాఠశాలల్లో చేపట్టిన పనులకు బిల్లులు చెల్లించకపోవడం, మెటీరియల్స్ సరఫరా సరిగా లేకపోవడం, కమిటీలు, ఇంజనీర్ల నడుమ సమన్వయం కుదరకపోవడంతో జిల్లాలో నాడు-నేడు పనులకు గ్రహణం పట్టిందని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి పూర్తి చేస్తామని ప్రకటించినా వచ్చే ఏడాదికి కూడా పనులు పూర్తయ్యేలా కనిపించడం లేదని తల్లిదండ్రుల కమిటీలు చెబుతున్నాయి. ఇసుక సరఫరాకు మండలాల్లో డంపింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. కొన్నిచోట్ల పాఠశాల నుంచి 10-15 కి.మీల దూరంలో ఉన్నాయి. అక్కడ నుంచి పాఠశాలకు తరలించేందుకు స్థానికంగా ట్రాక్టర్‌లు ఏర్పాటు చేసుకోవడం అదనపు వ్యయంగా మారుతోంది. దీంతో తల్లిదండ్రుల కమిటీలు, హెచ్ఎంలకు తలనొప్పిగా మారింది. కొన్ని పాఠశాలల్లో డబ్బులు ఖర్చుచేసినా బిల్లులు రావడం లేదని వాపోతున్నారు. గురువారం పాఠశాలలు తెరుచుకున్న తరుణంలో వసతుల కల్పనపై యంత్రాంగం దృష్టి సారించాలని తల్లిదండ్రులు ముక్త కంఠంతో కోరుతున్నారు.



సంగంలో అరకొరగానే..

2021-22లో నాడు- నేడు రెండో విడత కింద సంగం ఉన్నత పాఠశాలలో 5 అదనపు తరగతి గదులు మంజూరయ్యాయి. ఒక్కో గది నిర్మాణానికి రూ.12 లక్షల చొప్పున రూ.60 లక్షలు కేటాయించారు. తొలివిడతగా మంజూరైన నిధులతో పిల్లర్స్, గోడల వరకు నిర్మించారు. ఆ తర్వాత నిధులు రాక పనులు ఆగిపోయాయి. ఇటీవల వేసవిలో మరి కొంత నిధులు మంజూరవడంతో శ్లాబులు వేశారు. ఆ తర్వాత నిధుల ఊసేలేదు. ఇంకా గోడలకు పూత, దళాలు, కిటికీలు, తలుపులు, కరెంటు వసతి ఏర్పాటు చేయాల్సి ఉంది. 6 నుంచి 10వ తరగతి వరకు సుమారు 525 మంది బాలబాలికలు ఉండగా, గదులు చాలక వరండాలు, చెట్ల కింద కూర్చోబెట్టాల్సిన పరిస్థితులు ఉన్నాయి.

- సంగం



మర్రిపాడు : పొంగూరు హైస్కూల్‌లో బేస్‌మెంట్‌ను దాటని పనులు



నిధులు అందక..

మనుబోలు మండలం మడమనూరు ఉన్నత పాఠశాలలో ఆరు అదనపు గదులు, మరుగుదొడ్ల నిర్మాణం, పాత గదులకు మరమ్మతులు, ఇతరత్రా పనులకు రూ.1.34 కోట్లు మంజూరయ్యాయి. ఇందులో రూ.63 లక్షలు బిల్లుల రూపంలో, రూ.32లక్షలు సీపీఎం మెటీరీయల్ రూపంలో చెల్లించారు. ఇంకా రూ.39లక్షలు చెల్లించాల్సి ఉన్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పనులు ఆగిపోయాయి. ఈ పాఠశాలలో సుమారుగా 400 నుంచి 500 మంది పిల్లలు చదువుతున్నారు. గదులు చాలక 6, 7 తరగతుల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- మనుబోలు

పిల్లర్ల దశలోనే..



మండల కేంద్రమైన వలేటివారిపాలెం హైస్కూల్లో 425 మంది విద్యార్థులు ఉండగా, ఇక్కడే ఇంటర్ కళాశాల కూడా నడుస్తోంది. విద్యార్థులకు అవసరమైన తరగతి గదులు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు లేవు. గదులు లేక పెద్దలోనూ చెట్ల కింద, వరండాలో కూర్చొని పిల్లలు చదువుకుంటున్నారు. నాడు-నేడు పథకం కింద 4 అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.92 లక్షలు మంజూరు చేశారు. పిల్లర్ల దశ వరకు పనులు చేసిన కాంట్రాక్టర్ ఆ తర్వాత పత్తా లేకుండా పోయాడు. దీంతో నిధులు కూడా వెనక్కుపోయాయి.

- వలేటివారిపాలెం



కావలి రూరల్ : కొత్తపల్లి హైస్కూల్లో అసంపూర్తిగా వంటగది

విజయోత్సవ ర్యాలీలో
టీడీపీ, వైసీపీ వర్గీయుల ఘర్షణ

- కర్రలు, రాళ్లు రువ్వుకున్న ఇరువర్గాలు
- 8 మందికి గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం
- డీజే ట్రాక్టర్‌ను దహనం చేసిన వైసీపీ వర్గం
- తూర్పుపూండ్లలో పోలీసుల తిష్ట
- పోలీస్ అధికారులకు ఎస్పీ దిశానిర్దేశం



దగ్ధమైన ట్రాక్టర్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ కోటారెడ్డి


సైదాపురం, జూన్ 13 : మండల పరిధిలోని తూర్పుపూండ్ల గ్రామంలో బుధవారం రాత్రి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. విజయోత్సవ ర్యాలీలో టీడీపీ, వైసీపీ వర్గీయులు పరస్పరం ఘర్షణకు దిగడంతో ఎనిమిది మందికి గాయాలు అయ్యాయి. వివరాల్లోకి వెళితే.. ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేయడం, వెంకటగిరి ఎమ్మెల్యేగా కురుగొండ్ల రామకృష్ణ విజయం సాధించిన సందర్భంగా బుధవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో టీడీపీ వర్గం గ్రామంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించింది. డిజే పాటలతో బయలుదేరిన ట్రాక్టర్‌కు వైసీపీ వర్గం దారి ఇవ్వలేదు. దీంతో మాటమాట పెరిగి ఇరువర్గాలు కర్రలు, రాళ్లతో ఘర్షణకు దిగాయి. గ్రామ ఎస్టీకాలనీ సమీపంలో వైసీపీ వర్గీయులు రూ.25లక్షలు విలువజేసే డీజే ట్రాక్టర్‌పై పెట్రోల్ పోసి నిప్పంటించారు. అలాగే, జనరేటర్ ఉన్న వాహన అద్దాలనూ ధ్వంసం చేశారు. ఈ ఘర్షణలో టీడీపీకి చెందిన ముగ్గురు, వైసీపీకి చెందిన ఐదుగురికి గాయాలయ్యాయి. వైసీపీకి చెందిన ఓ వ్యక్తి కత్తితో దాడికి పాల్పడటంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు గ్రామానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

● ఇరువర్గాలపై కేసుల నమోదు



పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్

ఆత్మకూరు డీఎస్పీ కోటారెడ్డి మాట్లాడుతూ విజయోత్సవ ర్యాలీలో టీడీపీకి చెందిన సుబ్రహ్మణ్యం నాయుడు, వైసీపీకి చెందిన ప్రకాష్ నాయుడు వర్గాల మధ్య కర్రలు, రాళ్లతో దాడి జరిగిందని, ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. శాంతిభద్రతలకు ఆటంకం కలగకుండా గ్రామంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గాయపడ్డవారిలో ఒకరిని మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించినట్లు తెలిపారు. రాపూరు సీఐ సుబ్రహ్మణ్యం, సైదాపురం, రాపూరు, కండలేరు ఎస్ఐలు విజయ్‌కుమార్, మాల్యాద్రి, కిషోర్‌బాబులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. కాగా, గురువారం ఉదయం ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ గ్రామానికి చేరుకుని విచారించారు. తీసుకోవాల్సిన చర్యలపై పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు.



ఐదు సంతకాలు..
హర్షాతిరేకాలు!

- పింఛన్ల పెంపుతో 3,19,961 మందికి లబ్ధి
- నిరుద్యోగుల్లో మెగా డీఎస్సీ పండుగ
- మున్సిపాలిటీల్లో మళ్లీ అన్నా క్యాంటీన్లు
- ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దుతో ఊరట
- యువతకు ఉపాధి అవకాశాల కల్పన

నెల్లూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అవ్వాతాతలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. మెగా డీఎస్సీ ఫైలుపై సంతకం చేయడం ద్వారా ఐదేళ్లుగా ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు ఊరట కల్పించారు. నిరుపేదలు, కష్టజీవుల కడుపారా భోజనం పెట్టే అన్నా క్యాంటీన్లకు శ్రీకారం చుట్టారు. రైతులను భయపెట్టిన ల్యాండ్ టైటిల్ యాక్టును రద్దు చేశారు. నైపుణ్య గణన ద్వారా యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు నడుం బిగించారు. ముఖ్యమంత్రి హోదాలో గురువారం రాష్ట్ర సచివాలయంలోకి అడుగుపెట్టిన చంద్రబాబు సంక్షేమం, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు సంబంధించిన ఐదు కీలక ఫైళ్లపై తొలి సంతకాలు చేశారు. జిల్లాకు చెందిన వృద్ధులు, యువకులు, పేదలు, రైతుల్లో ఆనందాన్ని నింపారు.

● ఇక పింఛను రూ.4 వేలు

వృద్ధాప్య, వింతంతు, చేనేత తదితర పింఛన్లను రూ 4వేలకు పెంచుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. అంతేగాక ఏప్రిల్ నుంచే ఈ కొత్త పింఛను అమలు చేసి, 3 నెలలకు రూ.3వేలు జూలై మాసంలో పింఛను 4వేలు మొత్తం రూ.7వేలు ఇవ్వనున్నారు. జిల్లాలో 3,19,961 మంది పింఛనుదారులు ఉండగా, ప్రస్తుతం నెలకు రూ.95.77 కోట్లు చేస్తుండగా, జూలై నుంచి ఈ మొత్తం రూ.125 కోట్లు దాటనుంది.

● నిరుద్యోగుల్లో పండుగ

మెగా డీఎస్సీపై చంద్రబాబు సంతకం చేయడంతో బీఈడీ, డీయడ్ చదువుకున్న నిరుద్యోగుల ఐదేళ్ల ఎదురుచూపులు ఫలించనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 16వేల పైచిలుకు టీచర్ పోస్టులు భర్తీ కానుండగా, జిల్లా కోటా కింద సుమారు వెయ్యికిపైగా పోస్టులు మంజూరు అవుతాయని అంచనా. జిల్లాలో ప్రస్తుతం 550 పోస్టులు ఖాళీ ఉన్నాయి. ఇక పాఠశాలల విలీనం కారణంగా జిల్లా పరిధిలో 1500 పోస్టులు రద్దయ్యాయి. చంద్రబాబు ప్రభుత్వం పాఠశాలలను యధాతథంగా కొనసాగిస్తే రద్దయిన ఆ పోస్టులు తిరిగి వస్తాయి. జిల్లాలో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువత సుమారుగా 20వేల మందికిపైగా ఉన్నారు. చంద్రబాబు తీసుకున్న మెగా డీఎస్సీ నిర్ణయం వీరందరిలో పండుగ వాతావరణం తీసుకొచ్చింది.

● మళ్లీ కడుపు నిండుగా అన్నం



పేదలకు ఒకపూట పట్టెడన్నం పెట్టాలన్న విశాల దృక్పథంతో స్వర్గీయ ఎన్టీఆర్ స్ఫూర్తితో 2014లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేసింది. కేవలం 10 రూపాయలకే కడుపు నిండా భోజనం పెట్టే కార్యక్రమాన్ని అమలు చేసింది. అయితే జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటిని మూసివేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణ ఫైలుపై సంతకం చేయడం ద్వారా అటు పేదలపై ఉన్న మమకారాన్ని చాటుకున్నారు. గతంలో నెల్లూరు లో ఐదు అన్నా క్యాంటీన్లు, ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలోని మున్సిపల్ కేంద్రాల్లో ఒక్కొక్కటి చొప్పున నడిచేవి. వీటికి మళ్లీ పూర్వవైభవం రానుంది.

● అన్నదాతల భయానికి చెక్

రైతులను భయపెట్టిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టును ఇచ్చిన మాట ప్రకారం చంద్రబాబు రద్దు చేశారు. భూమి హక్కుపై రకరకాల భయాలు, అనుమానాలను కల్పించే విధంగా జగన్‌ఈ యాక్టును ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. దీనిపై అన్ని వర్గాల్లో వ్యతిరేకత రావడం, ఈ చట్టాన్ని రద్దు చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ మేరకు దీనిని రద్దు చేస్తూ గురువారం సంతకం చేశారు.

● నైపుణ్య గణనతో ఉపాధి అవకాశాలు

జనాభాలో 60 శాతం యువత ఉన్నా వీరి చదువు, నైపుణ్యాలకు సంబంధించిన ఎలాంటి సమాచారం లేకపోవడంతో అందరికీ ఉపాధి అవకాశాలను కల్పించలేకుండా పోతున్నారు. దీనిని అధిగమించడానికి చంద్రబాబు వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్రవ్యాప్తంగా కుల గణన చేసినట్లు చదువుకున్న నిరుద్యోగ యువత నైపుణ్య గణన చేయనున్నారు. దీనిని బట్టి రాష్ట్రంలో ఏ రంగానికి చెందిన నైపుణ్యం కలిగిన వారు ఎంత మంది ఉన్నారు, వీరికి ఉపాధి అవకాశాలు లభించాలంటే ఎలాంటి పరిశ్రమలు తీసుకురావాలి, ఎలాంటి శిక్షణ ఇస్తే ఉపాధి అవకాశాలు ఎక్కువ లభిస్తాయి, ఎలాంటి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేయాలనే విషయాలను ఈ గణన ద్వారా అధ్యయనం చేసి తదనుగుణంగా చర్యలు తీసుకోనున్నారు.

తెరుచుకున్న పాఠశాలలు

నెల్లూరు (విద్య), జూన్ 13 : సుదీర్ఘ విరామం తర్వాత గురువారం పాఠశాలల తలుపులు తెరుచుకున్నాయి. వేసవిలో ఆటపాటలతో ఎంజాయ్ చేసిన విద్యార్థులు ఉదయాన్నే బడి బాట పట్టారు. అయితే, తొలిరోజు తరగతులు నామమాత్రంగా కొనసాగాయి. చాటాచోట్ల విద్యార్థులు, సిబ్బంది పాఠశాలలను శుభ్రం చేసే పనిలో నిమగ్నమయ్యారు. చిందరవందరగా ఉన్న సామగ్రిని సర్ది పాఠశాలలకు పూర్వవైభవం తెచ్చేందుకు శ్రమించారు. కాగా, తొలిరోజే పాఠ్యపుస్తకాలు, విద్యాకానుకలు అందచేస్తామన్న అధికారులు కొంతమందికి మాత్రం నామమాత్రంగా అందచేశారు. విద్యాశాఖ నుంచి పూర్తిస్థాయిలో షెడ్యూల్ అందిన తరువాత కార్యక్రమాలన్నీ చేపడతామని అధికారులు వెల్లడించారు. కాగా, జిల్లాలో 3,432 పాఠశాలల్లో మొత్తం 3,54,779 మంది విద్యార్థులు ఉండగా తొలిరోజు 60 శాతం మందే హాజరయ్యారు. అలాగే వెళ్లిన పిల్లలకు మధ్యాహ్నం భోజనం అరకొరగానే అందింది. చాలామంది పిల్లలు ఇళ్ల నుంచి క్యారియర్ తెచ్చుకోగా, భోజనం అమలు చేయకపోవడంతో మిగిలిన పిల్లలు ఇంటిబాట పట్టారు.

● 'ప్రైవేట్'లో హడావుడి

ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో తొలిరోజు అడ్మిషన్ల హడావుడి కనిపించింది. తమకు నచ్చిన పాఠశాలల్లో పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు ఫీజులు చెల్లిస్తూ, పుస్తకాలు కొనుగోలు చేస్తూ కనిపించారు. తరగతులు మారుతుండటంతో నూతన గదుల్లో విద్యార్థులంతా వేసవిలో గడిపిన విశేషాలు, అనుభవాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. పాఠశాలకు తొలిసారి వెళ్లే బాలలు మారాం చేస్తూ కనిపించారు.

ఉలవపాడులో పడకేసిన పారిశుధ్యం

- చెత్తకుప్పలతో నిండిన వీధులు
- గ్రామస్థుల అవస్థలు



ఎస్సీ, బీసీ కాలనీల రోడ్డు పక్కన చెత్తలో పందుల సంచారం

ఉలవపాడు, జూన్ 13: ఉలవపాడు మేజర్ పంచాయతీలో పారిశుధ్యం పడకేసింది. ఏరోడ్డు చూసినా చెత్తకుప్పలతో దర్శనమిస్తోంది. గ్రామంలో రిజర్వుకాలనీ, హైస్కూల్ సమీపం, ఎస్సీ, బీసీ వడ్డెర కాలనీ మధ్య ప్రధాన రోడ్డున నడవాలంటే ముక్కులు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అంబేడ్కర్ నగర్‌లో ప్రధాన రహదారి వెంట చెత్తకుప్పలు పేరుకుపోయాయి. బీసీ వడ్డెర పాలెం, ఎస్సీ కాలనీ మధ్య రోడ్డులో నివాసాల వారు చెత్తా చెదారం ప్రధాన రోడ్డు పక్కనే వేస్తుండడంతో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. దోమల బెడద ఎక్కువైందని వ్యాధులు ప్రబలుతాయని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. గ్రామంలోని ప్రధాన రహదారులు ట్రంక్ రోడ్డు వ్యాపారస్తుల చెత్తతో నిండిపోయాయి. పంచాయతీ పారిశుధ్య కార్మికులకు తీరినప్పుడు ఒక్కో ప్రాంతానికి వెళ్లి నామమాత్రపు పనులు చేస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా బీసీ, ఎస్సీ కాలనీలలోని బజార్ల కూడళ్లు కూడా చెత్తతో నిండిపోయాయి. నెలలు తరబడి కాలనీలోని వీధులు శుభ్రం చేయరని, చెత్త, పాలిథిన్ కవర్లు గాలికి ఇళ్లలోకి కొట్టుకొస్తున్నా పట్టించుకోవడం లేదని మహిళలు పంచాయతీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా మురికి కాలువలు కూడా శుభ్రంచేసి నెలలు గడుస్తోందని, గతంలో కాలువల్లో పూడిక తీసిన చెత్త ఎత్తకుండా అలాగే వదిలేస్తుండడంతో దుర్గంధం వెదజల్లుతోందని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో పారిశుధ్యంపై దృష్టి సారించి కనీసం వారంలో ఒకసారైనా రోడ్డు పక్కన చెత్తకుప్పలు శుభ్రంచేసి బ్లీచింగ్ చల్లాలని గ్రామస్థులు కోరుతున్నారు. కాగా, వారం నుంచి పంచాయతీ పారిశుధ్య కార్మికుల చేత పనిచేయిస్తున్న మేస్త్రీ విధుల నుంచి తప్పుకున్నట్లు పంచాయతీ అధికారులు తెలిపారు.

ఘనంగా వెంగమాంబ పల్లకీసేవ



పల్లకీలో వెంగమాంబకు గ్రామోత్సవం

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), జూన్ 13: మండలంలోని నర్రవాడలో వెలసి ఉన్న ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన శ్రీవెంగమాంబ పేరంటాలమ్మ అమ్మవారి పల్లకిసేవను గురువారం వైభవంగా నిర్వహించారు. ప్రతి గురువారం అమ్మవారి పల్లకిసేవ నిర్వహించడం ఆనవాయితీ అని ఆలయ కార్యనిర్వాహణాధికారి ఉషశ్రీ తెలిపారు. అలాగే ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు అమ్మవారి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాలకు భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలని ఆమె కోరారు.

గోడపత్రికల ఆవిష్కరణ



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ధర్మకర్తలు

వరికుంటపాడు, జూన్ 13: మండలంలోని తూర్పు రొంపిదొడ్లలో ఉన్న శ్రీ మానసాదేవి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్స వాలను ఈనెల 28 నుంచి నిర్వహించనున్నట్లు అలయ చైర్మన్ చల్లా తిరు పతయ్య తెలిపారు. గురువారం ఆలయ ప్రాంగణంలో గోడపత్రికలు, కరపత్రాలను ధర్మకర్తలతో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ తొలిరోజు గణపతిపూజ, పుణ్యాహవచనము, నవగ్రహ మండపారాధన, ఉత్సవ, నవగ్రహ విగ్రహాలకు మహాస్నానము, అభిషేకాలు, మహానివేదన, కల్యాణం నిర్వహించడం జరుగుతుందన్నారు. 29న హోమాలు, గ్రామోత్సవాలు, 30న వాల్మీక, కుంకుమపూజ, పొంగళ్లు నిర్వహించడం జరుగు తుందన్నారు. భక్తుల సౌకర్యార్థం అన్నదానం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించి కార్య క్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త, కార్యనిర్వాహక అధికారి చల్లా యగ్నేశ్వ రరావు, వైస్ చైర్మన్ చల్లా మాల్యాద్రి, అర్చకులు ప్రవీణ్ శర్మ పాల్గొన్నారు.

గంగమ్మ, పోలేరమ్మకు పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి

బిట్రగుంట, జూన్ 13: బోగోలు మండలం గంగతిపపై వెలసిన గంగమ్మ, పోలేరమ్మల తిరునాళ్లు రెండోరోజు గంగపెట్టి, ఆలయ షైలు తుడుపు (శుద్ధి) కార్యక్రమాల అనంతరం ప్రత్యేక పూజలు గురువారం జరిగాయి. కాగా, శుక్రవారం ఉదయం నాగులచింత వద్ద పుట్టకప్పు, మధ్యాహ్నం ఈర్లమాను, సాయంత్రం పుట్ట బంగారం, రాత్రి అమ్మవార్ల గ్రామోత్సవం జరుగుతుందని, భక్తులు పొల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని గ్రామస్థులు కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలి

ఉదయగిరి, జూన్ 13: పట్టణంలోని దళితవాడ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు గురువారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందిరానగర్ ఎస్సీ కాలనీలో ఇంటింటికి తిరిగి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం షబ్బీర్, ఉపాధ్యాయులు రామకృష్ణ, నరసింహులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

ఉదయగిరి, జూన్ 13: మండలంలోని కుర్రపల్లి, శకునాలపల్లి, బోడబండ, పుల్లాయపల్లి, జీ.చెర్లోపల్లి, జీ.చెరువుపల్లి, సంజీవరాజుపల్లి, బిజ్జంపల్లి తదితర పాఠశాలలను ఎంఈవో-2 తోట శ్రీనివాసులు తనిఖీ చేశారు. పాఠ్యపుస్తకాల పంపిణీ, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం, నాడు-నేడు పనులను పరిశీలించి తగు సూచనలు, సలహాలు అందజేశారు.

కేజీబీవీలో ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

కందుకూరు, జూన్ 13: పట్టణంలోని పామూరు రోడ్డులో ఉన్న కేజీబీవీలో ఇంటర్మీడియట్ ఎంపీసీ గ్రూప్‌లో ప్రవేశానికి ఆసక్తి కలిగిన విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని విద్యాలయం ఎస్ఓ స్వాతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ విభాగంలో ఖాళీలు ఉన్నాయని పూర్తి వివరాలకు 9666092091 నెంబరులో సంప్రదించాలని కోరారు.

నేడు అందుబాటులో ఎమ్మెల్యే

ఉదయగిరి, జూన్ 13: వింజమూరులోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి అందుబాటులో ఉంటారని పార్టీ కార్యాలయ వర్గాలు గురువారం ఓ ప్రకటనలో తెలిపాయి. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు కలవవచ్చని వారు తెలిపారు.

టీడీపీ విజయోత్సవ సంబరాలు



ఆత్మకూరు : విజయోత్సవ వేడుకల్లో టీడీపీ శ్రేణులు

ఆత్మకూరు, జూన్ 13: సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో టీడీపీ అత్యధిక మెజార్టీతో అధికారంలోకి రావడం, టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి గెలుపొందడంతో పాటు రాష్ట్రమంత్రి పదవి వరించడంతో ఆత్మకూరు మునిసిపాలిటీ పరిధిలోని నెల్లూరుపాళెం సెంటర్‌లో టీడీపీ శ్రేణులు విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ మాదాల శ్రీనివాసులనాయుడు, టీడీపీ నాయకులు చెరుకూరు వెంకటేశ్వర్లునాయుడు, చెరుకూరు తిరుపతినాయుడు పాల్గొన్నారు.

అనంతసాగరం: టీడీపీ అధికారంలోకి రావడంతో మండలంలోని సంజీవనగరంలో గురువారం టీడీపీ నేతలు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా కేక్‌కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో శాఖమూరి సుబ్బారావు, బోయపాటి శ్రీనివాసచౌదరి, వెంకటయ్య నాయుడు, నరసయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురం: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా బస్టాండ్ సెంటర్‌లో గురువారం టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్, జనసేన సీనియర్ నాయకులు ముత్తంశెట్టి చెన్నకేశవులు, దాసరి వెంకటసుబ్బయ్య, దాసరి విరయ్య, బోగినేని కాశిరత్తయ్య, కోయిలపాడు యూత్, పెద్ద గౌస్ పాల్గొన్నారు.

మంత్రి ఆనంకు అభినందనల వెల్లువ



ఉదయగిరి: మంత్రి ఆనంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాకర్ల

ఉదయగిరి, జూన్ 13: రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని గురువారం అమరావతిలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఉదయగిరి రూరల్: రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని విజయవాడలోని గేట్‌వే హోటల్‌లో గురువారం టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి జడ్పీ మాజీ చైర్మన్ పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ మర్యాద పూర్వ కంగా కలిశారు. ఆయన వెంట టీడీపీ జిల్లా బీసీ సెల్ నాయకులు వెంగయ్యయాదవ్ ఉన్నారు.

ఆత్మకూరు: రాష్ట్ర మంతి ఆనం రామ నారాయణరెడ్డిని ఆత్మకూరు ఆర్డీవో మధులత మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

అనంతసాగరం: సోమశిలకు చెందిన టీడీపీ నాయకులు గురువారం విజయవాడలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా సోమశిల అభివృద్ధికి సహకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వేగు పెంచలయ్య, గువ్వల పెంచలయ్య, ముక్కు నాగరత్నం, పొంగూరు మురళి, కొప్పాల నరశింహులు, పెంచలయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



నగదును అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

ఆత్మకూరు, జూన్ 13: మునిసిపాలిటీ పరిధిలో ఇటీవల మృతిచెందిన కుటుంబాల సభ్యులకు ఒక్కొక్కరికి రూ. 10వేల వం తున రూ. 50 వేలు గురువారం సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు ట్రస్ట్ సభ్యులు అందజేశారు. 21వ వార్డు పరిధిలోని కుర్చకల్లి గౌరమ్మ, 16వ వార్డు పరిధిలో సయ్యద్ ఫాతిమాబీ, 4వ వార్డులో జ్యోతి లక్ష్మి, 19వ వార్డులో పుట్టం పుల్లమ్మ, 18వ వార్డులో సయ్యద్ సాహెబ్‌జూదాలకు ట్రస్ట్ సభ్యులు పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కష్టకాలంలో తమకు సాయం అందజేసిన శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఫ్లెక్సీ చింపిన వారిపై చర్యలు తీసుకోవాలి

అనంతసాగరం, జూన్ 13: మండలంలోని రేవూరులో ఏర్పాటు చేసిన టీడీపీ ఫ్లెక్సీని ఆ గ్రామానికి చెందిన వైసీపీ నేతలు బుధవారం రాత్రి చింపేశారని వారిపై చర్యలు తీసుకోవాలని పార్లమెంటు తెలుగు యువత కార్యదర్శి కమ్మ ప్రభాకర్‌నాయుడు డిమాండ్ చేశారు. ఈవిషయంపై అనంతసాగరం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

పీఎం కేర్ ఆర్థిక సాయం చెక్కుల అందజేత



ఆర్థిక సాయం అందచేస్తున్న అధికారులు

సంగం, జూన్ 13: మండలంలోని వెంగారెడ్డి పాళెంలో కోవిడ్‌తో మృతి చెందిన తల్లిదండ్రుల ఇద్దరి పిల్లలకు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో మంజూరైన పీఎం కేర్ సాయం చెక్కును గురువారం ఐసీడీఎస్ అధికారులు అందజేశారు. 2021 మే 12వ తేదీన అల్లాడి సాయి, కవిత దంపతులు కోవిడ్‌తో మృతి చెందారు. దీంతో కేంద్ర ప్రభుత్వం పీఎం కేర్ చిల్డ్రన్స్ పథకంలో భాగంగా వారి ఇద్దరి పిల్లలైన అల్లాడి లాస్య (16), ప్రజ్వల్ (9)కు ఒక్కొక్కరికి రూ. 10 లక్షల చొప్పున మంజూరైంది. ఆ మొత్తాన్ని వారి పేర్లపై బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్లను స్థానిక సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా సంరక్షకులకు అధికారులు అందజేశారు. గతంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మరో ఇద్దరికి రూ. 10 లక్షల చొప్పున బాండ్లు అందజేశామన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో సునీత, సూపర్‌వైజర్‌లు రమాదేవి, పద్మావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు సుగుణమ్మ, పిల్లల సంరక్షకులు పెంచలయ్య, వాణి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఉచిత కల్యాణ మండపం నిర్మాణం



భూమి పూజ చేస్తున్న కుట్టుబోయిన బ్రహ్మానందం

బిట్రగుంట, జూన్ 13: పేద ప్రజల కోసం షిరిడీ శేషసాయినాథుని సన్నిధిన కల్యాణ మండపం నిర్మిస్తున్నట్లు మందిర వ్యవస్థాపకుడు కుట్టుబోయిన బ్రహ్మానందం తెలిపారు. బోగోలు మండలం పాతబిట్రగుంట ద్వారకా నగరులో ఉన్న శేషసాయి మందిర ప్రాంగణంలో కల్యాణ మండప నిర్మాణ భూమిపూజ కార్యక్రమాలు గురువారం జరిగాయి. మొదట సాయినాథునికి ప్రత్యేక అభిషేకాలు, గణపతి పూజ, మండపారాధన, సాయిభక్తులచే సమూహిక శంకుస్థాపన కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎం రత్నం, మహేంద్ర, వెంకటేశ్వర్లు, చక్రపాణి, తేజ, లక్ష్మీనారాయణ, మేఘనాథ్, రాకేష్, కిరణ్, శేషయ్యస్వామి తదితరులు ఉన్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

రాజధాని రైతులకు సత్కారం



రైతులను సత్కరిస్తున్న కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి

కావలి, జూన్ 13: రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడానికి నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిని చేయడంలో కీలక పాత్ర పోషించిన రాజధాని రైతులను కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట(కావ్య) క్రిష్ణారెడ్డి సత్కరించారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు గురువారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా రాజధాని రైతులు దారి పొడవునా ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న రాజధాని రైతులను కావ్య క్రిష్ణారెడ్డి సత్కరించి కూటమి అధికారంలోకి రావడంలో వారు చేసిన కృషి, పోరాటాన్ని కొనియాడారు.

ఘనంగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కలిగిరి, జూన్ 13: శ్రీ అభయాంజనేయ స్వామి పుష్కరిణి క్షేత్రం ఏడవ వార్షికోత్సవం సందర్భంగా గురువారం శ్రీ సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం అభయాంజనేయునికి అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు భజన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని కమిటీ సభ్యులు ఏర్పాటుచేశారు. రాత్రి సీతారాముల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు భారీగా తరలివచ్చారు.

సమస్యలపై అర్జీల స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో

ఉలవపాడు, జూన్ 13: వివిధ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని బాధితులు సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందచేశారు. గురువారం మండల పరిషత్ కార్యాలయం వద్ద జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వినతుల స్వీకరణకు మండలం నుంచి 20 మంది వివిధ శాఖలకు సంబంధించి అర్జీలు అందించారు. 13 మంది రెవెన్యూకు చెందిన భూముల ఆన్‌లైన్ సమస్యలు, మిగిలిన అర్జీలు ఇతర శాఖలకు సంబంధించినవిగా తహసీల్దార్ చంద్రారెడ్డి తెలిపారు. ఎన్నికల కోడ్ వలన మండలాల్లో వివిధ శాఖలకు సంబంధించి పనులు పెండింగ్ పడిన బాధితులకు న్యాయం చేసేందుకు కందుకూరు సబ్ కలెక్టర్ విద్యాధరి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తహసీల్దార్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయ, వివిధ శాఖల మండలాధికారులు, సచివాలయం ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

15న ఎమ్మెల్యేలకు సన్మానం

కందుకూరు, జూన్ 13: యాదవ సంఘం ఆధ్వర్యంలో చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యయాదవ్, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావులకు శనివారం కందుకూరులో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు సంఘం నాయకులు వై లక్ష్మీనారాయణ గురు వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15న ఉదయం 11.30 గంటలకు పట్టణంలోని కనిగిరి రోడ్డులో ఉన్న ఆర్కే బిల్డింగ్‌లో సన్మాన కార్యక్రమం ఏర్పాటుచేసినట్లు తెలిపారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో పాల్గొని సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఆముదాలదిన్నె ఎస్టీ కాలనీలో తొలగిన తాగునీటి కష్టాలు



తాగునీటికి వేసిన పైప్‌లైన్లు

కావలి రూరల్, జూన్ 13: ఐదేళ్లపాటు తాగునీటి కోసం అలమటించిన ఆముదాలదిన్నె ఎస్టీకాలనీ వాసులు స్థానిక టీడీపీ నేతల ద్వారా తమ సమస్యలు ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి దృష్టికి తీసుకువెళ్లటంతో వారికి తాగునీటి కష్టాలు తొలగిపోయాయి. ఆముదాలదిన్నె రోడ్డు నుండి ఎస్టీ కాలనీకి గురువారం యుద్ధ ప్రాతిపదికన పైపులైన్లు వేయించి తాగునీటి సమస్య పరిష్కరించారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేసిన రోజునే పనులు చేపట్టి తుమ్మలపెంట రక్షిత మంచినీటి పథకం పైప్‌లైన్ల ద్వారా తాగునీటి పైప్ లైన్‌లు వేసి సమస్యను పరిష్కరించటం పట్ల గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బదిలీపై వెళ్తున్న బ్యాంక్ ఉద్యోగికి సత్కారం



అసిస్టెంట్ మేనేజర్ సుబ్బారావును సత్కరిస్తున్న మేనేజర్ నరేష్‌బాబు, సిబ్బంది

వలేటివారిపాలెం, జూన్ 13 : మండల కేంద్రమైన వలేటివారిపాలెం స్టేట్‌బ్యాంక్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తూ కందుకూరు స్టేట్‌బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్‌గా బదిలీపై వెళ్తున్న సుబ్బారావును స్టేట్‌బ్యాంక్ మేనేజర్, సిబ్బంది, ఖాతాదారులు గురువారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ నరేష్‌బాబు, సిబ్బంది, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఇంటూరి పరామర్శ

- రూ. 2 లక్షలు ఆర్థిక సహాయం



నరసింహం కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, జూన్ 13: చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారోత్సవానికి ఫ్లెక్సీలు కడుతూ విద్యుత్ షాక్‌తో మృతి చెందిన జనసైనికుడు ఇనకల్లు నరసింహం కుటుంబ సభ్యులను కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గురువారం రాత్రి పరామర్శించారు. మాచవరంలోని మృతుని నివాసానికి వెళ్లి తల్లిదండ్రులు శ్రీనివాసులు, అనూరాధలను పరామర్శించి ఓదార్చారు. వారికి 2 లక్షల రూపాయల ఆర్థికసహాయం అందజేసిన నాగేశ్వరరావు కుటుంబానికి అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంట గ్రామ టీడీపీ అధ్యక్షుడు సాదినేని మాల్యాద్రి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు బడేవారిపాలెం నుండి మాలకొండకు పాదయాత్ర

వలేటివారిపాలెం: కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు విజయం సాధించిన సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు సతీమణి ఇంటూరి సౌజన్య ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుండి బడేవారిపాలెం నుండి మాలకొండ పుణ్యక్షేత్రం వరకూ టీడీపీ కార్యకర్తలు పాదయాత్ర నిర్వహించనున్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం తెలిపారు. ఈ కార్యక్రమానికి శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు కార్యకర్తలు బడేవారిపాలెం చేరుకోవాలని మాదాల లక్ష్మీనరసింహం తెలియజేశారు.

తిరుమలకు టీడీపీ నేతల పాదయాత్ర



తిరుమలకు పాదయాత్రగా వెళుతున్న వారికి సంఘీభావం తెలుపుతున్న నేతలు

లింగసముద్రం, జూన్ 13: టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడం, బాల వీరాంజనేయస్వామి ఎమ్మెల్యేగా గెలుపొందడంతో తిరుమలకు పాదయాత్రగా వెళుతున్న టీడీపీ నేతలు, కార్యకర్తలను లింగసముద్రంలోని పలువురు టీడీపీ నేతలు కలిసి సంఘీభావం తెలియజేశారు. గురువారం మధ్యాహ్నం కొండపి నియోజకవర్గంలోని మర్రిపూడి మండలంలోని కెల్లంపల్లి గ్రామానికి చెందిన మందాటి బాలకోటయ్య మరో 28 మంది టీడీపీ నేతలు లింగసముద్రం మీదుగా తిరుమలకు పాదయాత్రగా వెళ్తుండగా మండల తెలుగు యువత అధ్యక్షుడు అడపా రంగయ్య, టీడీపీ నాయకులు చెంబేటి రమేష్, ప్రభాకర్, మాలకొండరాయుడు తదితరులు వారిని టీడీపీ కార్యాలయానికి తీసుకెళ్లి సంఘీభావం తెలిపారు.

ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దుపై హర్షం

కావలి, జూన్ 13: రైతులు ఆందోళన చెందుతున్న ఏపీ భూయాజమాన్య హక్కుల చట్టాన్ని రద్దుచేస్తూ ఎన్నికలలో ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్న నిర్ణయం పట్ల టీడీపీ రాష్ట్ర లీగల్‌సెల్ ఉపాధ్యక్షుడు పోట్లూరు శ్రీనివాసులు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ చట్టం వలన వచ్చే ప్రమాదాలపై రైతులు, న్యాయవాదులు, మేధావులు ఎన్నో ఆందోళనలు చేపట్టినా వైసీపీ ప్రభుత్వం అప్పట్లో స్పందించకపోవటం దారుణమన్నారు. అప్పట్లో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడి దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు తాను బాధ్యతలు తీసుకున్న వెంటనే ల్యాండ్ టైటిల్‌యాక్ట్ రద్దు చేస్తూ సంతకం చేయటం రైతులకు శుభపరిమాణమన్నారు. ఈ చట్టం రద్దు కోసం న్యాయవాదులు, మేధావులు, రైతులు చేసిన పోరాటాలకు కావలిలో అండగా నిలిచిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డిలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

లోవోల్టేజీ సమస్య పరిష్కరించాలి : సీపీఎం



కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం నేతలు

గుడ్లూరు, జూన్ 13: మండల కేంద్రమైన గుడ్లూరు ఎమ్మెస్సార్ కాలనీలో లోవోల్టేజీ సమస్య వెంటనే పరిష్కరించాలని గుడ్లూరు మండల సీపీఎం నాయకులు విద్యుత్ అధికారులను డిమాండ్ చేశారు. గుడ్లూరులో కాలనీల్లో సీపీఎం బృందం గురువారం పర్యటించారు. ఎమ్మెస్సార్ కాలనీలో లోవోల్టేజీ కారణంగా కనీసం ఫ్యాన్‌కూడా తిరగకపోవడంతో తీవ్ర అసౌకర్యానికి గురికావాల్సిన పరిస్థితి ఉందని కాలనీవాసులు సీపీఎం బృందానికి విన్నవించుకున్నారు. గతంలో సీపీఎం పోరాట ఫలితంగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు అయినప్పటికీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేయపోవడంతో తరచుగా ఈ సమస్య తలెత్తుతోందని, మరో పక్క వీధిలైట్లు కూడా సక్రమంగా వెలగడంలేదని, ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు గంటెనపల్లి వెంకటేశ్వర్లు, కొట్టే వెంకయ్య, స్టాలిన్, గడ్డం రాజేష్, రాపూరి మాల్యాద్రి, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

మొగిలిచెర్లలో కొనసాగుతున్న పోలీస్ పికెట్

లింగసముద్రం, జూన్ 13 : మండలంలోని మొగిలిచెర్ల గ్రామంలో బుధవారం టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య జరిగిన దాడులను దృష్టిలో ఉంచుకొని పోలీస్ పికెట్ కొనసాగుతోంది. గ్రామంలో ఇరువర్గాల మధ్య తిరిగి గొడవలు జరగకుండా ఉండేందుకు పోలీస్ పికెట్‌ను కొనసాగించాలని పోలీస్ ఉన్నతాధికారులు నిర్ణయించారని ఎస్సై ఎం బాజీబాబు చెప్పారు. గురువారం సాయంత్రం గుడ్లూరు సీఐ బీవీవీ సుబ్బారావు మొగిలిచెర్ల గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని ఎస్సై బాజీబాబు, పోలీసులకు సూచించారు. అయితే గ్రామంలో జరిగిన దాడులకు సంబంధించి పోలీసులు ఇరువర్గాలకు చెందిన కొందరిపై కేసులు నమోదు చేసినట్లు తెలిసింది.

దివ్యాంగుల పాఠశాలకు స్కూల్ వ్యాన్ వితరణ



స్కూల్ వ్యాన్‌ను బహూకరిస్తున్న ఎల్ఐసీ గోల్డెన్‌జూబ్లీ ఫౌండేషన్ ప్రతినిధులు

కందుకూరు, జూన్ 13: పట్టణంలోని కోవూరు రోడ్డులో ఉన్న స్వర్ణ స్వయంకృషి మానసిక దివ్యాంగుల పాఠశాలకు ఎల్ఐసీ గోల్డెన్ జూబ్లీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కూల్ వ్యాన్ బహూకరించారు. దివ్యాంగుల పాఠశాలకు గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే దివ్యాంగులను తీసుకొచ్చేందుకు వీలుగా 18.21 లక్షల రూపాయల విలువజేసే స్కూల్ వ్యాన్‌ను ఫౌండేషన్ ద్వారా కొనుగోలు చేసి అందించారు. ఈ సందర్భంగా గురువారం ఎల్ఐసీ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజరు బి ప్రసాదరావు, ఎల్ఐసీ మార్కెటింగ్ మేనేజరు ఓ కృష్ణమూర్తి, సీనియర్ బ్రాంచ్ మేనేజరు ఐవీఏ కాంతారావు చేతులమీదుగా పాఠశాల కరస్పాండెంట్ వి సుబ్బారెడ్డికి నూతన వ్యానును స్వాధీనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తులో ఎల్ఐసీ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కరస్పాండెంట్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ పాఠశాలకు స్కూల్‌వ్యాన్ బహూకరించటం హర్షణీయమని కృతజ్ఞతలు తెలిపారు.